

'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 16 సంచిక: 129

ఆదివారం 30-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మార్గదర్శి చిట్ ఫండ్ చందాదారులకు నోటీసు !!

చిట్ ఉల్లంఘనలకు పాల్పడిన చిట్ గ్రూపుల వివరాలు వెబ్‌సైట్‌లో (https://registration.ap.gov.in/....) ఉంచడం జరిగింది. ఈ విషయంలో చిట్‌గ్రూపు మెంబర్‌లకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 15 రోజులలోగా సదరు చిట్ గ్రూపునకు అనుమతులు మంజూరు చేసిన డిప్యూటీ రిజిస్ట్రార్, చిట్‌ఫండ్స్ వారికి లిఖిత పూర్వకంగా మరియు ఈ-మెయిల్ ద్వారా తెలియజేయగలరు.

మార్గదర్శి చిట్ ఫండ్ చందాదారులకు నోటీసు !!

మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో గల 37 శాఖల యందు నిర్వహిస్తున్న చిట్స్ నిర్వహణ, చిట్‌ఫండ్ యాక్ట్ మేరకు నిర్వహిస్తున్నారా? లేదా అనే అంశం మీద పర్యవేక్షణ అధికారం కలిగిన **అసిస్టెంట్ రిజిస్ట్రార్, చిట్‌ఫండ్స్** వారు తమ అధికారిక విధులలో భాగంగా **చేసిన విచారణలో నేరపూరిత అవకతవకలు** జరిగినట్లుగా గుర్తించారు. ఇదే అంశంలో కొన్ని శాఖల అధికారులు చేసిన ఫిర్యాదుల మేరకు రాష్ట్ర సి.ఐ.డి. వారు మార్గదర్శి చిట్‌ఫండ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీపై కేసులు నమోదు చేసి పూర్తిస్థాయి దర్యాప్తును చేపట్టారు.

అసిస్టెంట్ రిజిస్ట్రార్ **వారు చేసిన విచారణలో** వివిధ బ్రాంచీలు నిర్వహిస్తున్న వివిధ **చిట్ గ్రూపుల్లో** అనేక అవకతవకలు, నిధుల మళ్లింపు, ఏపీ చిట్‌ఫండ్ యాక్ట్ - 1982, ఏపీ చిట్ ఫండ్ రూల్స్-2008 చట్టఉల్లంఘనలకు పాల్పడినట్లుగా గుర్తించారు. వీటి వివరాలు మీ సౌకర్యం కోసం క్రింద పేర్కొన్న వెబ్‌సైట్ లో ఇవ్వడం జరిగింది. అందులో ప్రాథమికంగా గుర్తించిన ముఖ్య ఉల్లంఘనలు ఇవి..

1. మార్గదర్శి చిట్ ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ పేరుమీద ఉన్న టికెట్స్‌కు, కంపెనీవారు **చెల్లించాల్సిన డబ్బులు చెల్లించకుండా** ఈ గ్రూపుకు సంబంధంలేని **సభ్యులు (వేరే చిట్స్ గ్రూపు) చెల్లించిన చందా డబ్బుతో చెల్లింపులు పూర్తిచేసారు. ఇది చట్ట ఉల్లంఘన.** నియమావళి మేరకు కంపెనీ ఆధీనంలోని టికెట్సు (వెకేట్ చిట్స్)కు మార్గదర్శి ప్రైవేట్ లిమిటెడ్ వారు, సొంత నిధులతో మాత్రమే చెల్లింపులు చేయాలి.
2. ఇలా చిట్ కంపెనీ వారు చెల్లించాల్సిన చెల్లింపులు చేయకుండా **వేరే గ్రూపుకు సంబంధించిన చందాదారుల డబ్బులను దారి మళ్లించడం వల్ల, పాట పాడుకున్న చందాదారులకు చాలా ఆలస్యంగా చెల్లింపులు** చేస్తున్నట్లు గుర్తించడమైనది. చిట్ పాటాదారులకు కొన్ని సందర్భాలలో నాలుగు నెలలకు మించి చెల్లింపులు ఆలస్యం చేశారు.
3. **నూతన చిట్ ప్రారంభించే సమయంలో తగు అనుమతులు పొందకుండా** చిట్ మెంబర్స్ నుంచి ఎలాంటి మొత్తాలు స్వీకరించకూడదు. కానీ చిట్‌ఫండ్ నియమావళిని ఉల్లంఘిస్తూ యథేచ్ఛగా **పబ్లిక్ నుంచి నిధులు స్వీకరించడం** జరిగింది.
4. చిట్ గ్రూపులోని చందాదారులు వారి అవసరాలకు చిట్ పాట పాడుకోగా, వారికి **సకాలంలో చిట్ మొత్తాన్ని చెల్లించకుండా** చిట్ నిబంధనల పేరుతో సరైన హామీలను (సెక్యూరిటీ) **సమర్పించలేదనే కారణంతో** మరియు వడ్డీ ఆశ చూపించి భవిష్యత్తులో చెల్లించాల్సిన చందాకు హామీగా (సెక్యూరిటీగా) **చిట్ మొత్తాన్ని** కంపెనీ **వద్దే డిపాజిట్ చేసుకొని 4%** లేదా **5%** వడ్డీ చెల్లిస్తామని రశీదులు ఇచ్చి **ఎలాంటి మొత్తాలు చిట్ పాడుకున్న వారికి చెల్లించకుండా చట్ట ఉల్లంఘనకు** పాల్పడుతున్నారు.
5. మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ శాఖకు చెందిన **ఖాతా** నిర్వహణ చిట్ నియమావళి మేరకు ఆ శాఖకు సంబంధించిన **ఫోర్‌మెన్** ఆధీనంలో ఉండాలి. కాని ఈ శాఖలకు సంబంధించిన **బ్యాంకు ఖాతాల నిర్వహణ ఆ శాఖ ఫోర్‌మెన్** కాకుండా వారి కేంద్ర కార్యాలయంలో పనిచేసే **అనధికార సిబ్బందిచే** నిర్వహిస్తూ చిట్ నిధులను **చట్ట విరుద్ధంగా** దారి మళ్ళిస్తున్నారు.
6. చందా చెల్లింపులలో **డీ-ఫాల్ట్** అయిన **లేదా** ఎలాంటి చందా చెల్లించని వారి పేరు మీద **చిట్ పాట పాడి** నిబంధనలకు విరుద్ధంగా సదరు **మొత్తాలను ఇతర అవసరాలకు** వినియోగిస్తున్నారు.
7. చిట్‌ఫండ్ చట్టం 1982 లోని సెక్షన్ 24 మరియు రూల్ 28 నిబంధన మేరకు సమర్పించాల్సిన బ్యాలన్స్ షీట్, ప్రాఫిట్ & లాస్ అకౌంట్ షెడ్యూల్ 1, 2 మేరకు, సంబంధిత పర్యవేక్షణ అధికారులకు సమర్పించవలసి ఉన్నప్పటికీ **ఎలాంటి బ్యాలన్స్ షీట్‌లు, ప్రాఫిట్ & లాస్ అకౌంట్‌లు సమర్పించకుండా చట్ట ఉల్లంఘనకు** పాల్పడ్డారు.

చందాదారుల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత కలిగిన డిప్యూటీ రిజిస్ట్రార్ చిట్‌ఫండ్స్ వారు మార్గదర్శి చిట్‌ఫండ్ ప్రైవేట్ లిమిటెడ్ వారు చిట్ ఉల్లంఘనలకు పాల్పడిన **చిట్ గ్రూపుల వివరాలు వెబ్‌సైట్‌లో (https://registration.ap.gov.in/....)** పేర్కొంటూ **అసిస్టెంట్ రిజిస్ట్రార్ వారి నివేదికను పరిగణనలోకి తీసుకొని ఈ గ్రూపులను రద్దు పరచాలని ప్రాథమికంగా నిర్ణయించడం జరిగింది. ఈ విషయంలో చిట్‌గ్రూపు మెంబర్‌లకు ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 15 రోజులలోగా సదరు చిట్ గ్రూపునకు అనుమతులు మంజూరు చేసిన డిప్యూటీ రిజిస్ట్రార్, చిట్‌ఫండ్స్ వారికి లిఖిత పూర్వకంగా తెలియజేయవలసినదిగా కోరడమైనది.**

చందాదారుల అభ్యంతరాలు/అభిప్రాయాలు వెబ్‌సైట్‌లో సూచించిన విధంగా సంబంధిత డిప్యూటీ రిజిస్ట్రార్‌లకు ఈ-మెయిల్ ద్వారా తెలపగలరు.

సం/- రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, ఆంధ్రప్రదేశ్

జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

వైరల్



వెన్నెల నవ్వితే... ఆ అందం నువ్వే!

రజనీకాంత్ 'జైలర్' సినిమాలోని 'నువ్వు కావాలయ్యా' పాట సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అనిరుథ్ రవిచందర్ ఈ పాటకు స్వరాలు సమకూర్చి శిల్పారావుతో కలిసి పాడాడు. ఈ పాటకు తమన్నా భాటియా వేసిన స్టెప్‌లను నెటిజనులు షేర్ చేస్తున్నారు. ఈ క్యాచీ బీట్స్ పాట యూ ట్యూబ్‌లో 74 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.

ఈ పాటలో తమన్నా హుక్ స్టెప్స్‌ను అనుసరిస్తూ మిస్ కేరళ (2017) ప్రియాంక మేనన్ అందమైన వీడియో చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో 47.2 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది. కామెంట్ సెక్షన్ హార్ట్ ఇమోజీలతో నిండిపోయింది.

నా లోగో నా ఇష్టం



'నా లోగో నా ఇష్టం' అని ఎలాన్ మస్క్ అనుకున్నా సరే, నెటిజనులు మాత్రం రకరకాల మీమ్స్‌తో ట్విట్టర్ కొత్త లోగోను ఆటపట్టిస్తున్నారు.

'అడల్ట్ ఫిల్మ్ సైట్ లోగోలా ఉంది'

'ట్విట్టర్ ఎక్స్–లవర్‌ల సంఖ్య పెరిగే అవకాశం ఉంది అని చెప్పేలా ఉంది ఈ లోగో'... ఇలాంటి కామెంట్స్ సంగతి ఎలా ఉన్నా, సోషల్ మీడియాలో రకరకాల మీమ్స్ సందడి చేస్తున్నాయి. ప్రాంతీయ భాష చిత్రాల నుంచి హాలీవుడ్ సినిమాలలోని సీన్‌ల వరకు ఈ మీమ్స్ వైరల్ అయ్యాయి.

ఒక సృజనకారుడు పాత ట్విట్టర్ లోగో పిట్ట, కొత్త లోగో 'ఎక్స్'ను మిక్స్ చేసి సరికొత్త లోగోను సృష్టించాడు. ఈ లోగోను మస్క్‌గానీ చూశాడంటే పుసుక్కున 'ఇదే నా కొత్త లోగో' అని ఎనౌన్స్ చేయడం ఖాయం!



రైలు చివరి బోగీపై పెద్ద సైజులో 'ఎక్స్' అనే గుర్తు ఉంటుందనేది తెలిసిందే. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఒకాయన రైల్వే డిపార్ట్‌మెంట్‌కు ఇలా విన్నవించుకున్నాడు...

'మీ గుర్తును వాళ్లు లాగేసుకున్నారు. కాబట్టి బోగీ చివర 'ఎక్స్' స్థానంలో ట్విట్టర్ పాత లోగో పిట్ట ఉండాల్సిందిగా నా విజ్ఞప్తి'.

ఇస్మార్ట్ ఆఫర్



డ్యాన్స్ జెయ్యాలే... ఫ్రీగా ఐస్‌క్రీమ్ తినాలే!

'డ్యాన్స్ చేయండి. ఐస్‌క్రీమ్ ఫ్రీగా తినండి' అని ఎవరైనా ఆఫర్ ఇస్తే ఎంత బాగుంటుంది!

ఎవరో ఎందుకు సాక్షాత్తూ ఒక ఐస్‌క్రీమ్ కంపెనీ ఇలాంటి ఆఫర్‌ను కస్టమర్‌లకు ఇచ్చింది.

'ఐస్‌క్రీమ్ డే'ను పురస్కరించుకొని బెంగళూరుకు చెందిన 'కార్నర్ హౌజ్ ఐస్‌క్రీమ్స్' అనే ఐస్‌క్రీమ్ కంపెనీ షాప్ ముందు నుంచి కౌంటర్ వరకు డ్యాన్స్ చేస్తూ వచ్చే వాళ్లకు ఫ్రీ ఐస్‌క్రీమ్ ఆఫర్ ఇచ్చింది. ఇక డ్యాన్సులే డ్యాన్సులు!

కంపెనీ ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన ఈ డ్యాన్స్ వీడియోలు వైరల్ అయ్యాయి.

'ఫ్రీ ఐస్‌క్రీమ్ మాటేమిటోగానీ ఎంతో మంది డ్యాన్సింగ్ స్కిల్స్‌ను చూసే అవకాశం వచ్చింది'

'డ్యాన్స్ చేస్తే ఫ్రీగా టమాటాల ఆఫర్ ఎవరైనా ఇస్తే బాగుండేది'... ఇలాంటి కామెంట్స్ నెటిజనుల నుంచి వచ్చాయి.

టెంపుల్ ఆఫ్ టీ సర్వీస్

అమృత్‌సర్ పేరు వినబడగానే 'స్వర్ణ దేవాలయం' గుర్తుకు వస్తుంది. ఈ పవిత్ర నగరంలో ఒక విశేషమైన టీ స్టాల్ ఉంది. 'టెంపుల్ ఆఫ్ టీ సర్వీస్' అనే ఈ టీ స్టాల్‌లో టీ ఉచితంగా ఇస్తారు. ఎనభై సంవత్సరాల అజిత్‌సింగ్ ఎన్నో సంవత్సరాలుగా ఒక పెద్ద చెట్టు ఊడల మధ్య ఈ టీ స్టాల్‌ను నిర్వహిస్తున్నాడు.

అజిత్‌సింగ్‌ను అందరూ 'బాబాజీ' అని పిలుస్తారు.

'టెంపుల్ ఆఫ్ టీ సర్వీస్'లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు వరకు ఎప్పుడైనా ఉచితంగా టీ తాగవచ్చు.

గతంలో ఈ టీస్టాల్‌లోని వస్తువులను దొంగలు దోచుకెళ్లారు. అయినప్పటికీ బాబాజీ ఉచిత టీ ఇవ్వడం ఆపలేదు.



బాలీవుడ్ బార్బీ



ప్రపంచ వ్యాప్తంగా బార్బీయ మేనియా కమ్మేసింది. మన దేశం కూడా ఇందుకు మినహాయింపు కాదు. బాలీవుడ్ సినిమాల బార్బీఫైడ్ సీన్‌లు వైరల్ అవుతున్నాయి. తాజాగా 'ఓంశాంతి ఓం' సినిమాలోని 'ఫిర్ మిలేంగే ఛల్తే ఛల్తే' పాటను బార్బీఫైడ్ చేశారు. పింక్ కోర్టులో షారుఖ్‌ఖాన్, దీపిక పదుకొణె బ్యాడ్మింటన్ ఆడుతూ పాడుతుంటారు. అయితే అది 'ఫిర్ మిలేంగే...' పాట కాదు. ఇంగ్లీష్ సాంగ్ రైటర్, సింగర్ దువ లిపా 'బార్బీ' సినిమా సౌండ్ ట్రాక్ కోసం రాసిన 'బేబీ, యూ కెన్ ఫైండ్ మీ అండర్ ది లైట్స్/డైమండ్స్ అండర్ మై ఐస్' పాట బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తుంటుంది. ఈ పాట నేపథ్యంలో షారుఖ్, దీపికాలను 'బార్బీ' సినిమాలో లీడ్ రోల్స్ పోషించిన మార్గోవ్ రాబీ(బార్బీ), రెయాన్ గాస్లింగ్ (కెన్)లుగా ఊహించుకోవాలి.

కార్గిల్ యుద్ధ వీరుడికి సలాం



ఇండిగో ఎయిర్‌లైన్స్ పుణె ఫ్లైట్‌లో ప్రయాణిస్తున్న మేజర్ సంజయ్ కుమార్‌ను ఇండిగో సిబ్బంది సత్కరించారు. కార్గిల్ యుద్ధవీరుడు, పరమవీర చక్ర పురస్కార గ్రహీత సంజయ్ కుమార్‌ను ప్రయాణికులకు పరిచయం చేసి ఆనాటి యుద్ధంలో ఆయన సాహసాలను గురించి చెప్పారు ఎయిర్‌లైన్స్ పైలట్. సంజయ్ కుమార్‌ని ప్రయాణికులు ప్రశంసల్లో ముంచెత్తారు. దీనితాలూకు దృశ్యాలు నెటిజనులను ఆకట్టుకున్నాయి.

హెల్త్

షిజెల్లోసిస్..! పిల్లల్ని బంకలా పట్టేస్తాయి!



చికిత్స
ఇది బ్యాక్టీరియా కారణంగా వచ్చే సమస్య కాబట్టి సిప్రోఫ్లాక్సిన్, అజిథ్రోమైసిన్ వంటి యాంటీబయాటిక్స్‌ను డాక్టర్ల ఆధ్వర్యంలో తగిన మోతాదులో కోర్సుగా వాడాలి.

వర్షాలు కొన్ని ఆరోగ్య సమస్యల్ని వెంటబెట్టుకొస్తాయి. మరికొన్ని వ్యాధుల్ని మరింతగా పెచ్చరిల్లేలా చేస్తాయి. మరీ ముఖ్యంగా పిల్లల్లో! వాళ్లతో పాటు పెద్దల్లో కూడా. ఇది చిన్నదిగా కనిపించే పెద్ద సమస్యే. సామాన్యజనం పరిభాషలో 'నెత్తుటిబంక విరేచనాలు' అంటారు. విరేచనాలవుతూ ఉండగా అందులో కొద్దిగా రక్తం, మరికొద్దిగా చీములా పడుతుండటంతో ఈ పేరు. షిజెల్లా అనే ప్రజాతికి చెందిన ఓ బ్యాక్టీరియాతో వచ్చే సమస్య ఇది. కలుషితమైన నీటి వల్ల ఒకరి నుంచి మరొకరికి వ్యాపించే వ్యాధి. నీరు కలుషితం అవ్వడానికి అనువుగా ఉండే ఈ సీజన్‌లో మరింత ఎక్కువగా కనిపిస్తుంది. షిజెల్లోసిస్ వ్యాధిపై అవగాహన కోసం ఈ కథనం.

మానవ విసర్జకాలతో కలుషితమైన నీరు తాగడం వల్ల, ఆ నీటితో చేసిన వంటల వల్ల షిజెల్లా బ్యాక్టీరియా ఒకరి నుంచి మరొకరికి వ్యాపించి, మానవ జీర్ణవ్యవస్థలోకి చేరి, విరేచనాలు మొదలవుతాయి. ఈ విరేచనాలు కాస్త జిగటగా, నెత్తురుతో ఉండటంతో మామూలు వాటికంటే ఎక్కువగా ఆందోళన కలిగిస్తాయి. పిల్లల్లో అందునా ఐదేళ్లలోపు వారిలో ఎక్కువగా కనిపిస్తుంటాయి. కాబట్టి వారి విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తుంటారు.

లక్షణాలు: ● విరేచనాల్లో బంక (మ్యూకస్), నెత్తురు కనిపించడం. ● కడుపు పట్టేసినట్లుగా అనిపించడం (స్టమక్ క్రాంప్స్), కడుపు నొప్పి ● జ్వరం (జ్వరతీవ్రత 101 ఫారెన్‌హీట్ వరకు ఉండవచ్చు) ● వికారం, కొన్నిసార్లు వాంతులు.

వ్యాప్తి ఇలా... ● కలుషితాహారంతో : షిజెల్లా బ్యాక్టీరియాతో కలుషితమైన నీటితో తయారు చేసిన ఆహారంతో లేదా ఆ నీళ్లు తాగడం వల్ల; లేదా ఆ నీటిలో ఈదినప్పుడు నోట్లోకి వెళ్లినప్పుడు మింగడం వల్ల. ● వ్యక్తి నుంచి వ్యక్తికి: ఈ బ్యాక్టీరియా కలిగి ఉన్న వ్యక్తి తన పెదవుల్ని చేతులతో తాకాక అవే చేతుల్ని ఇతరులు ముట్టుకున్నప్పుడు. ● ఇది పిల్లల డే కేర్ సెంటర్లలో, పిల్లలను ఆడిపించే క్రెషలు, స్విమ్మింగ్‌పూల్స్ ద్వారా... అలాగే హైజీన్ తక్కువగా ఉండే విద్యార్థుల హాస్టల్స్, మెస్‌లు, క్యాంపస్‌లలో వ్యాపించే అవకావం ఎక్కువ. ఇక ప్రయాణాల్లో అంతగా పరిశుభ్రత పాటించని హోటళ్ల వల్ల కూడా ఒకరినుంచి మరొకరికి పాకవచ్చు.

కొన్నిసార్లు కాంప్లికేషన్లు...

● **డీ–హైడ్రేషన్‌తో** : విరేచనాల కారణంగా దేహంలోని ద్రవాలను కోల్పోవడంతో డీ–హైడ్రేషన్‌కు గురికావచ్చు. ఫలితంగా తల తిరగడం (డిజ్జీనెస్); తేలిగ్గా అనిపించడం (లైట్ హెడెడ్‌నెస్); పిల్లల్లో కన్నీళ్లు కూడా కనిపించక పోవడం, కళ్లు లోతుకుపోయినట్లుగా కనిపించడం... మరీ చిన్న పిల్లల్లో ఈ పరిస్థితులు తీవ్రమైతే ఒక్కోసారి షాక్‌కూ... అటు తర్వాత ప్రాణాపాయానికి కూడా దారితీయవచ్చు.

● **మూర్ఛ (సీజర్స్)** : కొంత మంది పిల్లల్లో మూర్ఛ (సీజర్స్) కనిపించవచ్చు. జ్వర తీవ్రత చాలా ఎక్కువగా ఉన్నప్పుడు ఇలా జరిగే అవకావాలు ఎక్కువ.

● **మలద్వారం చివరి భాగం బయటికి జారడం (రెక్టల్ ప్రొలాప్స్)** : జిగురుతో కూడిన మ్యూకస్ బంకలా పడటం వల్ల మలద్వారం చివరి భాగం బయటకు జారే అవకాశం ఉంటుంది. దీన్నే రెక్టల్ ప్రొలాప్స్ అంటారు.

● **హీమోలైటిక్ అనీమియా** : ఇది చాలా అరుదుగా మాత్రమే కనిపించే ముప్పు అయినప్పటికీ కొట్టి పారేయలేని సమస్య. నెత్తుటి విరేచనాలు అవుతుండటంవల్ల ఎర్రరక్తకణాల సంఖ్య తగ్గడం (హీమోలైటిక్ అనీమియా), ప్లేట్‌లెట్స్ తగ్గడం (థ్రాంబోసైటోపీనియా)... చాలా అరుదుగా ఒక్కోసారి మూత్రపిండాల వైఫల్యం కనిపించవచ్చు.

● **టాక్సిక్ మెగాకోలన్** : ఇది కూడా చాలా అరుదుగా మాత్రమే కనిపించే ముప్పు. ఇందులో పేగుల కదలిక (బవెల్ మూవ్‌మెంట్) మందగించి మలం ముందుకు కదలడం ఆగిపోవచ్చు. దాంతో గ్యాస్ గానీ, మల విసర్జన గానీ జరగకపోవచ్చు. ఇలాంటి వైఫల్యం కనిపించినప్పుడు దీన్ని మెడికల్ ఎమర్జెన్సీగా పరిగణించి వెంటనే చికిత్స తీసుకోకపోతే పెద్దపేగు గాయపడటంతో పాటు ఒక్కోసారి ప్రాణాపాయానికీ దారితీసే ప్రమాదం ఉంటుంది.

● **బ్యాక్టీరిమియా** : షిజెల్లా ఇన్ఫెక్షన్‌తో పేగుల లోపలి లైనింగ్ దెబ్బతినవచ్చు. దాంతో ఇలా దెబ్బతిన్న ప్రాంతం నుంచి ఇన్ఫెక్షన్ రక్తంలోకి వ్యాపిస్తుంది. ఇది కాస్త అరుదు.

నివారణ

● **కేర్‌ఫుల్ డిస్పోజల్ ఆఫ్ దయపర్స్** : చిన్న పిల్లల డయపర్స్‌ను జాగ్రత్తగా పారేయాలి. వీటిని నీటివనరు (వాటర్ సోర్స్)తో కలవనివ్వకుండా జాగ్రత్తపడాలి. ● అప్పటికే విరేచనాలూ, నీళ్ల విరేచనాలూ, నెత్తుటిబంక విరేచనాలతో బాధపడుతున్నవారు... వంట చేయడం సరికాదు. వాళ్లు కిచెన్ నుంచి దూరంగా ఉండాలి. ● భోజనానికి ముందు, మల విసర్జన తర్వాత తప్పనిసరిగా కనీసం 20 సెకండ్ల పాటు సబ్బుతో రుద్దుతూ చేతులు శుభ్రంగా కడుక్కోవాలి. ● **గుడ్ టాయెలెట్ హ్యాబిట్స్**: పిల్లలకూ చేతులు కడుక్కనే అలవాటు నేర్పాలి. ● స్కూల్స్, పిల్లల కేర్ సెంటర్స్, ఆటస్థలాలు, పిల్లలు ఆడుకునే ప్రదేశాలు, వాళ్ల టాయిలెట్స్ పరిశుభ్రంగా ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
● పిల్లలు స్విమ్మింగ్ పూల్స్‌లో లేదా పల్లెల్లో చెరువులు, బావుల్లో ఈదుతున్నప్పుడు ఆ నీటిని మింగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ● చెరువులు, వాగుల వంటి నీటి వనరు నుంచి తెచ్చిన నీటిని కాచి వడబోయకుండా తాగవద్దు. అలాగే పట్టణాల్లోనూ కొళాయి/నల్లా నీటిని శుభ్రం చేయడం, వడబోయడం వంటివి చేయకుండా వాడకూడదు.



డాక్టర్
శివనారాయణ రెడ్డి
సీనియర్
పీడియాట్రీషియన్

మెడిటిప్ ఆస్తమా నివారణ ఇలా...



ఆస్తమా ఊపిరాడనివ్వకుండా చేస్తూ... ఎంతగా ఇబ్బంది పెడుతుందో తెలిసిన విషయమే. పైగా వర్షాలతో ఇప్పుడున్న వాతావరణం ఆస్తమాకు మరింత దోహదం చేస్తుంది. కొన్ని ఆహారాలతో ఆస్తమా అటాక్ రాకుండా నివారణ ఇలా...

◗ తమకు సరిపడని పదార్థాలతో ఆస్తమా ట్రిగర్ అవుతుంది. అందుకే ఆహారాల్లో తమకు సరిపడని వాటికి దూరంగా ఉండాలి. ◗ భోజనంలో... ఆకుకూరల్లో పాలకూర, బచ్చలి వంటి వాటివి... కాయగూరల్లో కాకర, గుమ్మడి, క్యారట్, బీట్‌రూట్, మొలకెత్తిన గింజలు, రాగులు, సజ్జలు వంటి పొట్టుతో కూడిన చిరుధాన్యాలు తీసుకోవాలి.
◗ పండ్లలో పుల్లటి పండ్లయిన కమలాలు, నిమ్మ, బత్తాయి, అరటిపండు వంటి వాటిని మినహాయించి, మిగతావాటిని అంటే ఉదాహరణకు బెర్రీ, బొప్పాయి వంటి పండ్లను తీసుకోవచ్చు. ◗ ఆహారాన్ని వండేందుకు ఉపయోగించే దినుసుల్లో వెల్లుల్లి, ఉల్లిపాయలు, ఆలివ్ ఆయిల్ వంటివి వాడుకోవచ్చు. ధనియాలు, లవంగం, దాల్చిన చెక్క, ఏలకులు, జీలకర్ర, అల్లం, పసుపు వంటి సహజ మసాలాదినుసులు ఆస్తమా తీవ్రతను తగ్గిస్తాయి.

పెద్దవయసు వారిని వణికించే పార్కిన్‌సన్స్ వ్యాధి!



పార్కిన్‌సన్స్ వ్యాధి కాస్త వయసు పెరిగిన వారిలో అంటే 60 ఏళ్లు పైబడిన వారిలో కనిపించే వ్యాధి. ఇందులో బాధితుల వేళ్లు, చేతులు వణుకుతుంటాయి. ఈ వ్యాధిని డాక్టర్ జేమ్స్ పార్కిన్‌సన్ అనే వైద్యనిపుణుడు 1817లో గుర్తించి, 'షేకింగ్ పాల్సీ' అని పేరు పెట్టినప్పటికీ... కనిపెట్టినవారి పేరుతోనే ఇది ప్రాచుర్యం పొందింది. ఈ వ్యాధి గురించి ప్రాథమిక అవగాహన కోసం ఈ కథనం.

పార్కిన్‌సన్స్ వ్యాధి మహిళల్లో కంటే పురుషుల్లో దాదాపు ఒకటిన్నర రెట్లు ఎక్కువ. కొందరిలో యుక్తవయసులో అంటే 30 ఏళ్ల వారిలోనూ కనిపిస్తుండటంతో దీన్ని అనువంశీకంగా కనిపించే పార్కిన్‌సనిజమ్ (హెరిడిటరీ పార్కిన్‌సనిజమ్) అంటున్నారు.

లక్షణాలు: ● కదలికలు నెమ్మదిస్తాయి (దీన్ని బ్రాడీ కైనేసియా అంటారు). దాంతో నడక, స్నానం, దుస్తులు ధరించడం కష్టమవుతుంది. ముందుకు పడిపోతున్నట్లు అనిపిస్తుంటుంది. బ్యాలెన్స్ కోల్పోతారు. ● కాళ్లు, చేతుల్లోని కండరాలు బిగుసుకుపోవడం, వణకడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ● తీవ్రమైన అలసట (ఫెటీగ్)కనిపిస్తూ, తరచూ నిద్రాభంగమవుతుంది. ఈ పరిణామాలతో పాటు మెదడులోని కొన్ని రసాయనాల అసమతౌల్యత వల్ల కుంగుబాటు (డిప్రెషన్), నిద్రసమస్యలు కనిపిస్తాయి. పీడకలలూ, రాత్రి నిద్రలేమితో ఆకస్మాత్తుగా పగటినిద్ర రావచ్చు. ● కొందరిలో మింగడం కష్టం కావడం, మింగలేకపోవడంతో ఆహారం గొంతులో పట్టేయడం /ఇరుక్కుపోవడం. ● కొందరిలో కండరాల నొప్పులు / కీళ్ల నొప్పులు. ● మొదట్లో కనిపించే ఈ లక్షణాల్ని నిర్లక్ష్యం చేస్తే, అవి మరింత ముదిరి బాధితులు తమ రోజువారీ పనులు చేసుకోలేనంతగా ఇబ్బంది పడతారు. ● కొన్ని చర్మ సమస్యలతో పాటు నాడీ వ్యవస్థ దెబ్బతినడం వల్ల మూత్ర విసర్జన సమస్యలూ అలాగే మలబద్ధకం వంటి లక్షణాలూ కనిపించవచ్చు.

నిర్ధారణ ఇలా... పార్కిన్‌సన్స్ వ్యాధిని పసిగట్టడం అన్నది ప్రధానంగా వ్యాధి లక్షణాల్ని బట్టి, క్లినికల్ పరీక్షల సహాయంతో జరుగుతుంది. నిర్ధారణ కోసం ఈ కింది పరీక్షలు అవసరమవుతాయి.
● మెదడు ఎమ్మారై పరీక్ష, స్పెక్ట్ అనే పరీక్ష. దీన్నే డాట్ స్కాన్ అని కూడా అంటారు. ● పెట్ స్కాన్ పరీక్ష.

చికిత్స : ● వయసు పెరగడంతో మెదడులోని డోపమైన్ తగ్గడం, దాంతో కదలికలను నియంత్రించే మెదడు కణాలు నశించడం వల్ల పార్కిన్‌సన్స్ వ్యాధి వస్తుంది. డోపమైన్ ఉత్పత్తిని పెంచే మందులతో లక్షణాల్ని అదుపులోకి తేవచ్చు. అయితే పెరిగే వయసుతో పాటు డోపమైన్ ఉత్పాదన / మెదడులో దాని మోతాదు తగ్గుతూ వస్తుండటంతో మందుల మోతాదును పెంచుతూ పోవాల్సి ఉంటుంది. ● లెవోడోపా / కార్బిడోపా అనే మందులు దేహంలోకి వెళ్లగానే డోపమైన్‌గా మారతాయి. మావో–బి ఇన్హిబిటార్స్ మందులు మరింత డోపమైన్ లభ్యమయ్యేలా చేస్తాయి. ● యాంటీ కొలెనెర్జిక్ మందులు లక్షణాల తీవ్రతను తగ్గించి, ఉపశమనాన్ని స్తాయి.
● **శస్త్రచికిత్స :** మందుల మోతాదు పెరుగుతున్న కొద్దీ ఓ దశలో దుష్ప్రభావాలు మొదలవుతాయి. అందుకే మాత్రలు వేసుకున్నా ప్రయోజనం లేని సందర్భాల్లో ఇక చివరి యత్నంగా 'డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ సర్జరీ' అనే శస్త్ర చికిత్స అవసరం పడవచ్చు.



డాక్టర్
ఎం. సాయి స్రవంతి
కన్సల్టెంట్
న్యూరోఫిజీషియన్

నివారణతో పాటు అవసరమయ్యే ఇతర పద్ధతులు:
వ్యాయామం పార్కిన్‌సన్ వ్యాధిని కొంత మేరకు నివారిస్తుంది. ఫిజియోథెరపీ, రీ-హ్యాబిలిటేషన్, మింగలేని సమయాల్లో పోషకాహార లోపాలను అధిగమించడానికి విటమిన్ సప్లిమెంట్స్ తీసుకోవడం. అలాగే పార్కిన్‌సన్ వ్యాధి వల్ల కుంగుబాటు (డిప్రెషన్) వంటి మానసిక సమస్యలు పార్కిన్‌సన్ వ్యాధికి దారితీసే ప్రమాదమూ ఉంది. అందుకే సైకియాట్రిక్ ఇవాల్యుయేషన్ అవసరం కావచ్చు.



సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 16 సంచిక: 129

SUNDAY Special

ఆదివారం 30-7-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | MUMBAI | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఇంగ్లండ్ 389/9

ఆస్ట్రేలియాతో జరుగుతున్న 'యాషెస్' సిరీస్ చివరి టెస్టుపై ఇంగ్లండ్ పట్టు బిగించింది. రెండో ఇన్నింగ్స్‌లో జో రూట్ (91), బెయిర్‌స్టో (78) రాణించారు.

- వివరాలు 10లో



పీఎస్‌ఎల్‌వీ సీ-56 ప్రయోగం నేడే

ఆదివారం ఉదయం 6:31 గంటలకు నింగిలోకి... సింగపూర్‌కు చెందిన ఏడు ఉపగ్రహాలను కక్ష్యలో ప్రవేశపెట్టనున్న రాకెట్

- వివరాలు 6లో



మణిపూర్‌లో 'ఇండియా'

హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీల బృందం శనివారం పర్యటించింది.

- వివరాలు 6లో



ప్రతి భారతీయ భాషకు గౌరవం

నూతన జాతీయ విద్యా విధానం ద్వారా దేశంలోని ప్రతి భాషకూ సముచిత గౌరవం లభిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు.

- వివరాలు 6లో



'క్రైస్తవులకు రూ.లక్ష' దరఖాస్తులు

క్రైస్తవులకు 100% సబ్సిడీతో రూ. లక్ష ఆర్థిక సాయం అందించేందుకు రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ దరఖాస్తులు స్వీకరించనుంది.

- వివరాలు 11లో



సంపూర్ణంగా కోలుకున్న లాలూ

కిడ్నీ మార్పిడి ఆపరేషన్ తర్వాత పూర్తిగా కోలుకున్న ఆర్జేడీ చీఫ్ లాలూ తాజాగా హుషారుగా బ్యాడ్మింటన్ ఆడుతూ కనిపించారు.

- వివరాలు 6లో

తీరని కన్నీటి వ్యథ

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలు మిగిల్చిన వ్యథ ఇప్పట్లో తీరే పరిస్థితి కనిపించడం లేదు. వరదల్లో తమవారిని కోల్పోయిన ఆవేదనలో కొందరు.. ఇళ్లు, సామగ్రి, పశువులు, పంటలు నష్టపోయిన ఆందోళనలో మరికొందరు.. ఎక్కడ చూసినా విషాదమే కనిపిస్తోంది. రోడ్లు, వంతెనలు దెబ్బతిని రాకపోకలు లేక, సరిగా సాయం అందక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేక గ్రామాలు చీకట్లోనే మగ్గుతున్నాయి. ముఖ్యంగా నీట మునిగిన వరంగల్ నగరంతో పాటు పూర్తిగా దెబ్బతిన్న మోరంచపల్లి, కొండాయి గ్రామాల్లో పరిస్థితి ఇంకా దారుణంగానే ఉంది. దీనికితోడు వరంగల్ నగరంలో శనివారం భద్రకాళి చెరువుకు గండిపడటం మరోసారి భయాందోళన రేపింది. అధికారులు సకాలంలో స్పందించి, దిగువన కాలనీలను ఖాళీ చేయించడంతో ప్రమాదం తప్పింది.



వరంగల్‌లోని భద్రకాళి చెరువుకు పడిన గండి (వృత్తంలో)

వరద కష్టాల నుంచి తేరుకోని బాధితులు

ఆప్తులను కోల్పోయిన ఆవేదనలో కొందరు.. సర్వమూ పోగొట్టుకున్న బాధలో మరికొందరు

- వరంగల్‌లో భద్రకాళి చెరువుకు గండి
- దిగువ కాలనీలవాసులను ఖాళీ చేయించిన అధికారులు
- నగరంలో ఇంకా పలు ప్రాంతాలు నీటిలోనే..
- మోరంచపల్లిలో శనివారం రెండు మృతదేహాలు లభ్యం
- ఇంకా విషాదంలోనే ఉన్న కొండాయి
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

వివరాలు 2,3లో

100 ఏళ్ల ముందుచూపు కావాలి!

2లో

భద్రాచలం వద్ద మహోగ్రంగానే..

- వానలు తెరిపినిచ్చినా ఉప నదుల పరవళ్లతో గోదావరిలో పెరిగిన వరద
- భద్రాచలం వద్ద 55.8 అడుగులకు చేరిన నీటి మట్టం

3లో

వరద నష్టం అంచనాకు రేపు రాష్ట్రానికి కేంద్ర బృందం

3లో

బండి సంజయ్‌కు ప్రమోషన్



బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియామకం

- కీలక బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానం
- ఉపాధ్యక్షురాలిగా డీకే అరుణ కొనసాగింపు
- కార్యదర్శిగా సత్యకుమార్‌కు మరోసారి అవకాశం
- పార్టీ నూతన పదాధికారులను నియమించిన జేపీ నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తెలంగాణ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ కుమార్‌కు పార్టీ అధిష్టానం కీలక బాధ్యతలు అప్పగించింది. ఆయనను జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ జాతీయ కమిటీలో చోటు కల్పించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి హోదాలో బండి సంజయ్‌ను ఏదైనా ఒక రాష్ట్రానికి పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జిగా నియమించే అవకాశం ఉంది. అదే సమయంలో రాష్ట్రానికి చెందిన సీనియర్ నాయకురాలు డీకే అరుణను పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలిగా కొనసాగించారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వై.సత్యకుమార్‌కు జాతీయ కార్యదర్శిగా మరోసారి అవకాశం కల్పించారు. కాగా, సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జాతీయ కమిటీలో కీలక మార్పులు చేశారు. మొత్తం 13 మంది జాతీయ ఉపాధ్యక్షులు, 9 మంది జాతీయ ప్రధాన కార్యదర్శులు, ఒక జాతీయ సంస్థాగత వ్యవహారాల సహ ప్రధాన కార్యదర్శి, 13 మంది జాతీయ కార్యదర్శులు, ఒక కోశాధికారి, ఒక సహ కోశాధికారితో కూడిన జాతీయ కమిటీని జేపీ నడ్డా నియమించగా, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. కాగా ఏపీ బీజేపీ వ్యవహారాల సహ ఇన్‌చార్జిగా ఉన్న సునీల్ దేవ్‌ధర్‌ను పార్టీ జాతీయ కార్యదర్శిగా తప్పించారు. కర్ణాటకకు చెందిన సీటీ రవి, అస్సాంకు చెందిన ఎంపీ దిలీప్ సైకియాలను ప్రధాన కార్యదర్శి హోదా నుంచి

మిగతా 5వ పేజీలో ▶

వేగంగా సహాయం చేపట్టండి

వరద బాధిత ప్రాంతాల్లో రోగాలు ప్రబలకుండా చూడండి



- పారిశుధ్య పనులు, తాగు నీటి సరఫరాకు ప్రాధాన్యత
- దెబ్బతిన్న రోడ్లకు వెంటనే తాత్కాలిక మరమ్మతులు
- సమన్వయం కోసం ప్రతి జిల్లాలో కంట్రోల్ సెంటర్
- అదనపు కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి కేటీఆర్ ఆదేశాలు

2లో



రాహుల్‌కు మీరే పిల్లను చూడండి!

పెళ్లి ప్రస్తావన తెచ్చిన హరియాణా మహిళా రైతులతో సోనియా గాంధీ సరదా ముచ్చట్లు

- ఢిల్లీలోని 10 జన్‌పథ్‌లో వారికి గాంధీ కుటుంబం ఆత్మీయ ఆతిథ్యం
- భారత్‌జోడో యాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలో భాగంగా ఆహ్వానం
- మహిళలతో కలసి భోజనం చేసిన సోనియా, రాహుల్, ప్రియాంక
- ఆపై వారితో కలసి హుషారుగా నృత్యం చేసిన సోనియా, ప్రియాంక

వివరాలు 6లో

మాపై దుష్ప్రచారం ఓ కీలక నేత పనే

- కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరుతున్నామన్న కథనాలు నిరాధారమైనవి
- టీపీసీసీ మాజీ చీఫ్, ఎంపీ ఉత్తమ్ దంపతుల వెల్లడి

5లో

నా వాంగ్మూలాన్ని మార్చేశారు



సీబీఐ పేర్కొన్నదంతా అవాస్తవం

'సాక్షి' ఇంటర్వ్యూలో ఏపీ ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం

నేను చెప్పనివి.. చెప్పినట్లు చార్జిషీట్‌లో ఎలా ఇస్తారు?

ఆ రోజు ఉదయం 6.30 గంటలకు వైఎస్ జగన్‌కు వివేకా మరణ వార్త తెలిసింది

2లో

తెలంగాణ మొత్తం తిరగాల్సిందే..

గురుకులాల రిక్రూట్‌మెంట్‌లో అభ్యర్థులకు కష్టాలు

ఒక్కో పరీక్ష పేపర్‌కు ఒక్కో జిల్లా తిరగాల్సిన పరిస్థితి

పరీక్ష కేంద్రాలు చూసి గగ్గోలు పెడుతున్న అభ్యర్థులు

వివరాలు 11లో



మన పులులు 21

'స్టేటస్ ఆఫ్ టైగర్స్ 2022' నివేదికలో వెల్లడి

వివరాలు 12లో

ఇంకాచెప్పాలంటే



ప్రధానిని చేద్దామని కాదు.. పెళ్లి చేద్దామా అని అడిగింది మేడం!

వానంటే హడలిపోతున్న హైదరాబాద్, వరంగల్ నగరాలు

సాక్షి ప్రత్యేక ప్రతినిధి

హైదరాబాద్ కొండాపూర్‌లోని మజీద్‌బండలో ఎనిమిదెకరాల కుడికుంట చెరువులోని చెత్తాచెదారాన్ని 'సాహి'అనే ఎన్జీఓ సంస్థ ఇటీవల శుభ్రం చేసి ఇళ్ల నుంచి వచ్చే డ్రైనేజీ నీటిని మళ్లించి వందల ఏళ్ల నాటి ఈ చెరువుకు కొత్త వైభవం తీసుకొచ్చింది. అంతటితో ఆగకుండా ఇదే చెరువుతో పరిసరాల్లో వచ్చిన మార్పులపై 'లాస్ట్ మైల్ ఫర్ వాటర్'అనే టైటిల్‌తో షార్ట్‌ఫిల్మ్ రూపొందించి యూఎన్‌ఓ బెస్ట్ సిటీస్‌పై నిర్వహించిన కాంపిటీషన్‌కు పంపితే అక్కడ బెస్ట్ కేటగిరీలో నిలబడింది. ప్రపంచం హైదరాబాద్ వైపు చూసేలా చేసింది. భూకంపాలు, రవాణా ఇబ్బందుల్లేని మహానగరాన్ని బహుళజాతి సంస్థలు తమ వ్యాపార గమ్యస్థానంగా ఎంచుకుంటున్న సమయంలో, కొద్దిపాటి వర్షాలకే నగరం వరద ముంపు బారిన పడటం, ప్రజారవాణా ఇబ్బందులు, విద్యా సంస్థల మూత, ఐటీ కంపెనీలపై లాగౌట్ ఆంక్షలు.. హైదరాబాద్ సామర్థ్యంపై సరికొత్త సందేహాలను తెరపైకి తెస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు వరంగల్ నగరాలపై (అర్బన్ ఫ్లడ్స్) నిపుణులు ఇచ్చిన నివేదికలపై తక్షణం కార్యాచరణ మొదలు పెట్టాలన్న డిమాండ్లను ముందుకు తెస్తున్నాయి.

చెరువులు, నాలాల భారీ ఆక్రమణలతో ముంచెత్తుతున్న వరదలు
నిపుణుల నివేదికలు, సిఫార్సులపై తక్షణ కార్యాచరణ చేపట్టాలనే డిమాండ్లు
హైదరాబాద్ ఇమేజ్ మసకబారే అవకాశం ఉందనే ఆందోళన

- 24 గంటల్లో 24 సెం.మీ వర్షం, వరదను తట్టుకునేలా 1914లో సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డు
- మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో శాశ్వత వరద నివారణ పథకాలకు రూపకల్పన
- ఇప్పుడు కూడా తాత్కాలిక చర్యలు కాకుండా శాశ్వత పరిష్కారాలు చూపాలంటున్న నిపుణులు



100 ఏళ్ల ముందు చూపు కావాలి!

మూసీ, ఈసీ నదుల ఉగ్రరూపం 1908 సెప్టెంబర్ 28న హైదరాబాద్ మహానగరాన్ని గడగడలాడించి 15,000 మందిని బలి తీసుకుంది. మూసీలో 60 ఫీట్ల ఎత్తుతో ఎగిసిన వరద ఉధృతికి అఫ్జల్‌గంజ్, ముసల్లం, చాదర్‌ఘాట్ వంతెనలు నేలమట్టమయ్యాయి. 50 వేల మంది నిరాశ్రయులయ్యారు. ఈ వరద ముప్పునకు శాశ్వత పరిష్కారం చూపాలనుకున్న ఏడో

ఒక ముప్పు.. వందేళ్ల ముందుచూపు

నిజాం ఉస్మాన్ అలీఖాన్ 1914లో సిటీ ఇంప్రూవ్‌మెంట్ బోర్డును ఏర్పాటు చేశారు. ప్రఖ్యాత ఇంజనీరింగ్ నిపుణుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆధ్వర్యంలో వరద నివారణతో పాటు ఆధునిక నీటిపారుదల పథకాలకు రూపకల్పన చేయించారు. అందులో భాగంగానే ఎగువ భాగాన మూసీపై ఉస్మాన్‌సాగర్, ఈసీపై హిమాయత్‌సాగర్‌ల నిర్మాణంతో పాటు 24 గంటల్లో 24 సెంటీమీటర్ల వర్షం, వరదను తట్టుకునేలా విశ్వేశ్వరయ్య వందేళ్ల ముందుచూపుతో హైదరాబాద్‌ను పునర్నిర్మించారు. కానీ 1990 తర్వాత నగరంలో చెరువులు, నాలాల భారీ ఆక్రమణల ఫలితంగా 1994, 2000, 2009, 2016, 2020 సంవత్సరాలలో హైదరాబాద్‌ను వరదలు ముంచెత్తాయి.



1912 జూలై 15న ఉస్మాన్‌సాగర్ పనుల ప్రారంభోత్సవ దృశ్యం

ఇప్పుడేం చేయాలి..?

- మహానగరాన్ని వరద ముప్పు నుంచి తప్పించేందుకు కిర్లోస్కర్ కమిటీ చేసిన సిఫార్సులను అమలు చేయాలి. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ నిపుణులు లక్ష్మణరావు నివేదికపై తక్షణ కార్యాచరణ చేపట్టాలి.
- చెరువులు , కుంటలు, నాలాల నిర్వహణతో పాటు కబ్జాల నియంత్రణ కోసం ప్రత్యేక అథారిటీ ఏర్పాటు చేయాలి.
- వరద నీటి నిల్వ, నియంత్రణలో ఉత్తమ ఫలితాలు కనబరిచే కమ్యూనిటీలను ఆస్తి పన్ను నుంచి మినహాయించాలి.
- ప్రస్తుతం కొనసాగుతున్న స్టెప్‌వెల్స్ (మెట్ల బావులు)కు మరమ్మతులు చేయాలి. బెంగళూరు తరహాలో భారీగా బావుల తవ్వకం చేపట్టాలి.
- మహానగరంలో చెల్లాచెదురైన చెరువులను గొలుసుకట్టు పద్ధతిలో తక్షణం అనుసంధానం చేయాలి. నార్త్ ఈస్ట్ బేసిన్‌లోని నేరేడ్‌మెట్ ముక్కిడి చెరువు నుంచి మొదలయ్యే వరద దిగువన ఉన్న సఫిల్‌గూడ నదీం చెరువు, మల్కాజిగిరి బండచెరువుల నుంచి నాచారం పెద్ద చెరువు, ఉప్పల్ నల్లచెరువు మీదుగా సాఫీగా మూసీలోకి వెళ్లేలా చూడాలి.
- జీడిమెట్లలోని ఫాక్స్‌సాగర్ పూర్తిగా నిండిన తర్వాత అక్కడి నుంచి జీడిమెట్ల వెన్నెల చెరువు మీదుగా కూకట్‌పల్లి ఎల్లమ్మ చెరువు, మైసమ్మ చెరువు, పరికి చెరువుల మీదుగా బాలానగర్‌లోని అంబర్‌చెరువు, మూసాపేట కామునిచెరువు, కూకట్‌పల్లి రంగధామునికుంట, నల్లచెరువు వరకు వరద మూసీకి వెళ్లేలా ఆక్రమణలు తొలగించాలి.
- శేరిలింగంపల్లి ఖాజాగూడ పెద్దచెరువు నుంచి మొదలయ్యే వరద నీరు మణికొండ ఎల్లమ్మచెరువు, ఇబ్రహీంబాగ్ పెద్దచెరువు మీదుగా షేక్‌పేట శాతం చెరువు నుంచి గోల్కొండ సమీపంలోని లంగర్‌హౌస్ చెరువుకు చేరేలా చేయాలి. ఇక మియాపూర్ గురునాథ్ చెరువు నుంచి ప్రారంభమయ్యే గొలుసుకట్టు మదీనగూడ పటేల్ చెరువు, గంగారం పెద్దచెరువు, హఫీజ్‌పేట మేడికుంట, కాయిదమ్మకుంట, కొత్తకుంటల మీదుగా మదీనగూడ ఎర్రచెరువు, లింగంపల్లి గోపిచెరువు, చాకలివాని చెరువు, నల్లగండ్ల చెరువుల మీదుగా వరద వెళ్లేలా చర్యలు తీసుకోవాలి.

నాలుగేళ్ల క్రితమే నివేదిక



హైదరాబాద్ మహానగరానికి ముంపు ముప్పు తప్పించేందుకు నాలుగేళ్ల క్రితమే జేఎన్‌యూటీ నుంచి నివేదిక ఇచ్చాం. కేవలం రూ.4,093 కోట్ల వ్యయంతో హైదరాబాద్‌ను వచ్చే వందేళ్ల వరకు సేఫ్‌గా ఉంచేలా నివేదికను ఇచ్చాం. ముఖ్యంగా క్లౌడ్ కంట్రోల్ చేస్తూనే వర్షం వల్ల వచ్చే వరదలను నివారించేందుకు మూడు మార్గాలు సూచించాం. అవి చేయకుండా ఆఫీసులు, విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వడం వల్ల ఏ ప్రయోజనం ఉండదు. వరదల వల్ల ఏటా రూ.5 వేల కోట్లు వ్యయమయ్యే రహదారులు, ఇతర మౌలిక సదుపాయాలు దెబ్బతింటున్నాయి, మరో రూ.5 వేల కోట్ల వరకు నగరవాసులు నష్టపోతున్నారు. వరదలకు శాశ్వత పరిష్కారం చూపకుండా తాత్కాలిక పద్ధతుల్లో వెళితే విశ్వనగరం దిశగా అడుగులేస్తున్న హైదరాబాద్ ఇమేజ్ మసకబారే ప్రమాదముంది.

– డాక్టర్ కేఎం లక్ష్మణరావు, అర్బన్ ఫ్లడ్స్ నిపుణుడు, జేఎన్‌టీయూ

ఇది నిజంగా దైన్యస్థితి



హైదరాబాద్ అంటేనే గొలుసుకట్టు చెరువులు. 24 సెంటీ మీటర్ల వర్షం, వరదను తట్టుకునేలా డిజైన్ చేసిన వరద కాల్వలు మన నగరం సొంతం. కానీ రియల్ ఎస్టేట్ విస్తరణే లక్ష్యంగా ప్రభుత్వం తీసుకున్న చర్యల ఫలితమే నేడు హైదరాబాద్‌లో రెయినీ హాలిడేస్. వర్షం, వరద భయంతో ఐటీ, విద్యా సంస్థలకు సెలవులు ఇవ్వటమనేది. ఇది నిజంగా దైన్యస్థితే.

–లుబ్నా సర్వత్, సేవ్ అవర్ లేక్ సొసైటీ (సోల్)

అందరం కలిస్తేనే బెటర్ హైదరాబాద్



హైదరాబాద్ ఈ రోజు చిరు జల్లులకే వణుకుతోందంటే..అందుకు అందరూ బాధ్యులే. చెరువులు, కుంటలు, నాలాల ఆక్రమణలో అందరి బాధ్యత ఉన్నట్లు, వర్షం నీటి వృథా విషయంలోనూ ప్రతి ఇంటి బాధ్యత ఉంది. హైదరాబాద్‌లో ఈ పరిస్థితికి అందరూ బాధ్యులే. అందుకే అందరు కలిసి బెటర్ హైదరాబాద్ దిశగా ముందుకు సాగాలి. కుడికుంట చెరువు తర్వాత ఇప్పుడు శేరిలింగంపల్లి ప్రాంతంలో 30 చెరువుల్లో మార్పు తీసుకొచ్చే ప్రయత్నం జరుగుతోంది.

– కల్పనా రమేశ్, సాహి ఎన్జీఓ

ఓరుగల్లు ఉక్కిరి బిక్కిరి



పది లక్షల జనాభా దాటిన వరంగల్ నగరాన్ని వరదలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇక్కడ కూడా నాలాలు, చెరువుల ఆక్రమణలే సమస్యగా మారాయి. నగరంలో వరద నీటి కాలువలు లేకపోవటం వరంగల్‌కు ఇబ్బందికరంగా మారింది. ఇక్కడ బొందివాగు నాలాతో హంటర్‌రోడ్డు సహా మరో పది కాలనీలు వర్షం నీరు వెళ్లే నాలాలు, కబ్జా ప్రదేశాలు, లోతట్టు ప్రాంతాల్లో కాలనీల నిర్మాణాలు నీట మునిగే పరిస్థితులు నెలకొన్నాయి. హనుమకొండ వడ్డెపల్లి, గోపాల్‌పూర్ చెరువులు నిండి పలు కాలనీలు నీట మునుగుతున్నాయి. ఇక్కడ చేపట్టిన నాలా విస్తరణ పనులు నత్తకే నడకలు నేర్పుతుండటంతో ఏటా మునగటం కాలనీల వంతవుతోంది.

వేగంగా సహాయక చర్యలు చేపట్టండి

అదనపు కలెక్టర్లు, మున్సిపల్ అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో మంత్రి కేటీఆర్ ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో వానలు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో పట్టణాలు, నగరాల్లో సహాయక చర్యలను ముమ్మరం చేయాలని పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు ఆదేశించారు. ముఖ్యంగా పారిశుధ్య నిర్వహణ, సురక్షిత తాగునీటి సరఫరా, దోమల నిర్మూలనకు ప్రాధాన్యం ఇవ్వాలని.. రోగాలు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని సూచించారు. కేటీఆర్ సోమవారం పురపాలక శాఖ ఉన్నతాధికారులు, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్లు, మున్సిపల్ కమిషనర్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సహాయ కార్యక్రమాలను సవాల్‌గా తీసుకొని చర్యలు చేపట్టాలని, ఇతర శాఖలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో ప్రాణనష్టం జరగ కుండా చూడాలన్నారు. పట్టణాల్లోని చెరువులు పూర్తిగా నిండి, ప్రమాదకరంగా పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు వాటిని పరిశీలించాలని.. అవసరమైతే నీటి పారుదల శాఖ అధికారులతో మాట్లాడి నీటిని ఖాళీ చేయించాలని సూచించారు. సహాయ కార్యక్రమాలకు ఎలాంటి అవసరం ఏర్పడినా స్వయంగా తన కార్యాలయంతోపాటు పురపాలక శాఖ ఉన్నతాధికారులంతా అందుబాటులో ఉంటారని క్షేత్రస్థాయి అధికారులకు వివరించారు. సహాయ కార్యక్రమాల సమన్వయం కోసం హైదరాబాద్‌తో పాటు ప్రతి జిల్లాలో కంట్రోల్ సెంటర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. పట్టణాల్లో భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులకు వెంటనే తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సూచించారు. ప్రతి పట్టణంలో ప్రత్యేకంగా పారిశుధ్య డ్రైవ్ చేపట్టాలని.. అవసరమైతే అదనపు సిబ్బందిని, వాహనాలను సమకూర్చుకోవాలని సూచించారు.

సురక్షిత తాగునీటిపై దృష్టి

రాష్ట్రవ్యాప్తంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సురక్షిత తాగునీరును అందించాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ప్రజలు తాగునీటిని కాచి వడపోసుకొని వినియోగించేలా అవగాహన కల్పించాలన్నారు. వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని, పట్టణాల్లోని బస్తీ దవాఖానాలు, వైద్య ఆరోగ్యశాఖ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) వంటి సంస్థల సహకారంతో మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న పాత భవనాలను వెంటనే తొలగించాలని.. విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకొని మరమ్మతు కార్యక్రమాలను చేపట్టాలని ఆదేశించారు.

ముందుచూపుతో తప్పిన భారీ ప్రాణ, ఆస్తి నష్టం!

- సహాయ చర్యలపై ఎప్పటికప్పుడు సీఎం కేసీఆర్ ఆదేశాలిచ్చారు: సీఎంవో ప్రకటన
- భద్రాచలం వద్ద అప్రమత్తతపై దిశానిర్దేశం చేసినట్టు వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో కుండపోత వర్షాలతో గోదావరికి వరదలు వచ్చాయని.. సీఎం కేసీఆర్ ముందుచూపుతో పెద్దగా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చేశారని ముఖ్యమంత్రి కార్యాలయం ప్రకటించింది. వరుసగా మూడో రోజు శనివారం రాత్రి కూడా రాష్ట్రంలో వర్షాలు, వరదల పరిస్థితులను సీఎం కేసీఆర్ నిరంతరంగా సమీక్షించారని తెలిపింది. సహాయ, పునరావాస కార్యక్రమాలపై రాత్రి పొద్దుపోయే వరకు కూడా మంత్రులు, అధికారులకు సీఎం దిశానిర్దేశం చేశారని పేర్కొంది. వానలు తగ్గుముఖం పట్టడంతో అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారని వివరించింది. ముంపు ప్రాంతాల్లో హెలికాప్టర్ల ద్వారా ఆహారం, తాగునీరు, మందులను పంపిణీ చేస్తున్నట్టు తెలిపింది. భద్రాచలంలో వరద పరిస్థితిపై మంత్రి పువ్వాడ అజయ్‌తో సీఎం కేసీఆర్ ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారని.. సీఎం ఆదేశాల మేరకే మంత్రి ఏరియల్ సర్వే నిర్వహించి పరిస్థితిని సీఎంకు నివేదించారని పేర్కొంది. భద్రాచలం వద్ద మూడో ప్రమాద హెచ్చరిక కొనసాగుతున్న నేపథ్యంలో.. ముంపును తగ్గించే చర్యలు చేపట్టాలని నీటిపారుదల శాఖ సీఈలను సీఎం కేసీఆర్ ఆదేశించారని వెల్లడించింది. రాష్ట్రంలో పది రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో నదులు, వాగులు ఉప్పొంగడం, 20 మందికిపైగా మృత్యువాతపడటం, మరికొందరు గల్లంతవడం తెలిసిందే. అయితే ప్రాణ, ఆస్తి నష్టం వివరాలను రాష్ట్ర ప్రభుత్వం ఇంకా అధికారికంగా వెల్లడించలేదు.

కష్టకాలంలో కాంగ్రెస్ అండగా ఉంటుంది

ప్రజలు ఆందోళన చెందవద్దు: రేవంత్‌రెడ్డి

హస్తినాపురం: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు ప్రజలు సర్వం కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ముఖ్యమంత్రి కేసీఆర్ నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. అయితే రాష్ట్ర ప్రజలు ఆందోళన చెందవద్దని, కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు. ఎల్బీనగర్ నియోజకవర్గం హస్తినాపురం డివిజన్‌లోని పలుప్రాంతాలలో శనివారం ఆయన పాదయాత్ర చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జీలు మల్‌రెడ్డి రాంరెడ్డి, జక్కిడి ప్రభాకర్‌రెడ్డిలతో కలసి వరద ముంపు ప్రాంతాలలో పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా రేవంత్ విలేకరులతో మాట్లాడుతూ గత వారం రోజులుగా భారీ వర్షాలు రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయని, ఊళ్లకు ఊళ్లు మునిగిపోయి.. దాదాపు 30 మంది ప్రాణాలు కోల్పోయారని, వేల ఎకరాలలో పంటనష్టం జరిగినా సీఎం ఎక్కడా పర్యటించకపోగా.. మహారాష్ట్ర రాజకీయాలతో తలమునకలై ఉన్నారని ఆరోపించారు. విపత్తు సంభవించినప్పుడు సర్వం కోల్పోయిన బాధితులను పరామర్శించాల్సిన సీఎం ప్రగతిభవన్‌కు పరిమితం కావడం రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యమని అన్నారు. వరదల్లో ప్రాణాలు కోల్పోయిన వారితోపాటు మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌లకు పిండప్రదానం చేసే కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా చేపట్టాలని రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.30 వేల సాయం అందించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ఎల్బీ నగర్ నియోజకవర్గంలో స్థానికులతో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

రేవంత్‌వి బురద రాజకీయాలు: దాసోజు



సాక్షి, హైదరాబాద్: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సమయంలో మానవత్వంతో ప్రజలకు తోడుగా ఉండాల్సిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి బురద రాజకీయాలు చేస్తున్నారని బీఆర్ఎస్ హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భారీ వర్షాల్లో శవాల మీద చిల్లర ఏరుకునే విధంగా రేవంత్ వ్యవహరిస్తున్నారని, వర్షాల్లో పది రోజులుగా రేవంత్ జాడలేనందునే 'ఎంపీ కనిపించడం లేదు'అనే పోస్టర్లు కనిపించాయని అన్నారు. హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌తో కలసి శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. వరద పరిస్థితిపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు నిద్రపోకుండా కలెక్టర్లతో సమీక్షలు చేస్తుండగా, సీఎంకు పిండం పెడతానంటూ రేవంత్ వ్యాఖ్యలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రేవంత్‌రెడ్డి దున్నపోతులా వ్యవహరిస్తున్నారని, కాంట్రాక్టర్ల కోసమే తప్ప ప్రజల కోసం ఒక్కసారి కూడా ప్రెస్‌మీట్ పెట్టలేదని అన్నారు. మల్కాజిగిరి ఎంపీగా ప్రజలకు ఏమీ చేయని రేవంత్, వరదలు తగ్గుముఖం పడుతున్న సమయంలో గాంధీభవన్‌లో కంట్రోల్ రూమ్ పేరిట డ్రామాలు చేస్తున్నారన్నారు. సీఎం కేసీఆర్ మీద నీచ భాషను ఉపయోగిస్తున్న రేవంత్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని దాసోజు డిమాండ్ చేశారు.

దగుల్బాజీ రాజకీయాలకు తెరలేపారు..

రాష్ట్రంలో దగుల్బాజీ రాజకీయాలకు రేవంత్ రెడ్డి తెరలేపారని, భారీ వర్షాలను కూడా రాజకీయాలకు వాడుకుంటున్నారని మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వరదల్లో రేవంత్‌తో పాటు ఆయన అనుచరులు, కార్యకర్తలు ఎక్కడా సహాయం అందించలేదని, రేవంత్ ఉప్పల్ పర్యటనలో కాంగ్రెస్ కార్యకర్తలు మూడు గ్రూపులుగా విడిపోయి తన్నుకున్నారని అన్నారు. రేవంత్‌కు పిండం, తద్దినం పెట్టే రోజులు దగ్గరలో ఉన్నాయని ధ్వజమెత్తారు. కేసీఆర్, కేటీఆర్ మీద అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఉరికించి కొడతామని రామ్మోహన్ హెచ్చరించారు.

బీజేపీ నాయకులపై పోలీసుల దాడి

కార్యకర్తలకు తీవ్ర గాయాలు.. ఎంజీఎంలో చికిత్స

రామన్నపేట: వరంగల్ భద్రకాళి చెరువు గండిని పరిశీలించేందుకు వెళ్లిన బీజేపీ నేతలపై పోలీసులు చేయి చేసుకోవడమే కాకుండా అసభ్య పదజాలంతో దూషించారు. ఈ ఘటనలో పలువురు కార్యకర్తలకు తీవ్ర గాయాలయ్యాయి. శనివారం భద్రకాళి చెరువుకు గండి పడిందనే విషయం దావానలంలా వ్యాపించడంతో అధికార పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులు, ప్రతిపక్ష పార్టీల నేతలు వరంగల్‌లోని పోతన నగర్‌కు చేరుకున్నారు. ఈ క్రమంలో అధికార పార్టీ నేతలను గండి పడ్డ ప్రదేశానికి పంపిన పోలీసులు.. బీజేపీ నేతలు ఆ ప్రాంతానికి చేరుకోగానే అక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ ముష్క శ్రీనివాస్ అడ్డుకున్నారు. ఈ క్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగు రాకేశ్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. చివరికి ఇద్దరు ముగ్గురు నాయకులను ముంపు ప్రాంతానికి వెళ్లేందుకు అనుమతిచ్చిన పోలీసులు ఆ సమయంలో జరిగిన ఘర్షణలో బీజేపీ కార్యకర్తలపై తీవ్ర స్థాయిలో దాడి చేశారు. ఈ క్రమంలోనే అనిల్, పురుషోత్తం అనే ఇద్దరు కార్యకర్తలపై సీఐ శ్రీనివాస్ పిడిగుద్దులు గుద్దుతూ అసభ్య పదజాలంతో తిట్టారు. అనంతరం బలవంతంగా పోలీస్ జీపు ఎక్కించి స్టేషన్‌కు తరలించారు. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన వారిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కాగా, దాడికి పాల్పడిన సీఐను వెంటనే సస్పెండ్ చేయాలని రాకేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కార్యకర్తలను ఆయన పరామర్శించారు.



బీజేపీ నాయకులపై పోలీసుల దాడి

కష్టాల్లో ఉన్న ప్రజలను ఆదుకోండి

కాంగ్రెస్ నేత కోదండరెడ్డి



సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రజలను ఆదుకోవాలని, ఈ మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యుద్ధప్రాతిపదికన సాయమందించాలని టీపీసీసీ వరద సహాయక చర్యల సమన్వయ కమిటీ చైర్మన్ ఎం. కోదండరెడ్డి కోరారు. రాష్ట్రంలో సంభవించిన విపత్తులపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రెండు కమిటీలను ఏర్పాటు చేశామని, అన్ని ప్రాంతాల నేతలతో సమన్వయం చేసుకుని ప్రజలకు సేవలందించేందుకు ఓ కమిటీ, పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి సాయాన్ని పర్యవేక్షించేందుకు మరో కమిటీని ఏర్పాటు చేశామని ఆయన వెల్లడించారు. శనివారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిటీ సభ్యులు గడ్డం ప్రసాద్ కుమార్, సంగిశెట్టి జగదీశ్వర్‌రావు, సుంకేట అన్వేశ్‌రెడ్డి, చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, మన్నె సతీశ్‌రెడ్డిలతో కలసి ఆయన మాట్లాడుతూ విపత్తు సందర్భంలో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో సరైన వైద్య సౌకర్యాలు అందడం లేదని తమ కమిటీ గుర్తించిందని, వెంటనే ఉచితంగా మందుల పంపిణీని ప్రారంభించి గ్రామీణులను ఆదుకోవాలని ఆయన కోరారు. వరదల కారణంగా రాష్ట్రంలో ఎక్కడ, ఎలాంటి సమస్య తలెత్తినా గాంధీభవన్‌లోని టోల్ ఫ్రీ నంబర్లు 040 – 24602383, 040 – 24601254లకు తెలియజేయాలని సంగిశెట్టి జగదీశ్వర్ వెల్లడించారు.

పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

తెలంగాణ రైతు సంఘం డిమాండ్

సాక్షి, హైదరాబాద్: భారీవర్షాల కారణంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, ఎకరాకు రూ.10 వేల పరిహారం ఇవ్వాలని తెలంగాణ రైతుసంఘం డిమాండ్ చేసింది. శనివారం ఇక్కడ జరిగిన విలేకరుల సమావేశంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్, సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు అరి బండి ప్రసాద్‌రావు, సహాయ కార్యదర్శి శోభ మాట్లాడారు. అధిక వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 10 లక్షల ఎకరాల్లో పంటలు నీటమునిగాయని పేర్కొన్నారు. యుద్ధ ప్రతిపాదికన నష్టాన్ని అంచనా వేయాలని, ఎకరాకు రూ. 10 వేలు, వాణిజ్య పంటలకు రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నా వాంగ్మూలాన్ని మార్చేశారు

సీబీఐ పేర్కొన్నదంతా అవాస్తవం

- 'సాక్షి' ఇంటర్వ్యూలో ఏపీ ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో చార్జిషీట్ దాఖలు చేసిన సీబీఐ.. అందులో అవాస్తవాలను పొందు పరిచిందని, తన తన వాంగ్మూలాన్ని ఇష్టానుసారం మార్చిందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు అజేయ కల్లం వెల్లడించారు. తాను వాంగ్మూలం ఇవ్వలేదని చెప్పకపోయినా.. చెప్పినట్లు ఓ పత్రిక అసత్యాలను ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. సీబీఐని వెనుక ఎవరో ఉండి నడిపిస్తున్నారని, అందుకే కొందరిని ఈ కేసులో ఇరికించడం కోసం ప్రయత్నిస్తున్నారని చెప్పారు. 2019 మార్చి 15న వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టో కమిటీ సమావేశం జరుగుతుండగా, ఉదయం 6.30 గంటల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివేకా మరణ వార్త తెలిసిందన్నారు. ఈ విషయమై తన వాంగ్మూలం రికార్డు చేసిన తర్వాత ఓ పత్రికలో తప్పుడు కథనం వచ్చిందని, నిజాలు ప్రజలకు తెలియజేయడం కోసం అప్పట్లో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, వాస్తవాలు వెల్లడించానన్నారు. తన వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేయడం సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని పేర్కొంటూ, దాన్ని తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ ప్రస్తుతం హైకోర్టును కూడా ఆశ్రయించానని తెలిపారు. ఈ నేపథ్యంలో శనివారం ఆయన 'సాక్షి' ఇంటర్వ్యూలో పలు విషయాలు వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

నాకు కనీసం చూపించలేదు..

2023 ఏప్రిల్ 29న వికాస్ సింగ్ తొలుత నాకు మెసేజ్ పంపారు. ఆ తర్వాత కాల్ చేశారు. మిస్డ్ కాల్ పడటంతో నేను తిరిగి కాల్ చేశా. సీబీఐ ఎస్పీ వికాస్‌సింగ్‌గా తనను తాను పరిచయం చేసుకుని.. కలవాలని అడిగారు. నేను రమ్మన్నాను. ఆయన వచ్చాక 20 నిమిషాలు మాట్లాడారు. తర్వాత వైఎస్ వివేకా హత్య కేసులో మీ వాంగ్మూలాన్ని రికార్డు చేసుకుంటామని అడిగారు. నేను అభ్యంతరం లేదని చెప్పాను. సీఆర్‌పీసీ 161 కింద నా వాంగ్మూలం తీసుకున్న తర్వాత.. దాన్ని నాకు చూపించలేదు. కనీసం చదివి వినిపించలేదు. ఆశ్చర్యపోయే విషయం ఏమిటంటే.. నా వాంగ్మూలంపై వికాస్ సింగ్ సంతకం కాకుండా ముఖేశ్ శర్మ అనే వ్యక్తి సంతకం ఉంది. అతనెవరో కూడా నాకు తెలియదు.



ఇలాగైతే దర్యాప్తు సంస్థలపై నమ్మకం పోతుంది

ఈ నెల మొదటి వారంలో సీబీఐ చార్జిషీట్ కోర్టుకు అందజేసింది. ఆ తర్వాత ఒకట్రెండు పత్రికల్లో నా వాంగ్మూలం ప్రచురితమైంది. అది చూసి నేను షాక్‌కు గురయ్యా. నేను చెప్పిన దానికి.. సీబీఐ చార్జిషీట్‌లో పొందుపరిచిన దానికి చాలా వ్యత్యాసం ఉంది. అలా ఎందుకు వక్రీకరించారో అర్థం కావడం లేదు. నేను ఎక్కడా వైఎస్ జగన్ భార్య పేరును ప్రస్తావించలేదు. అయినా వారు చార్జిషీట్‌లోని వాంగ్మూలంలో ఆమె పేరు చేర్చారు. దీని వెనుక రాజకీయ కుట్ర ఉండవచ్చు. ఒక ఐఏఎస్ అధికారినైన నా వాంగ్మూలంలోనే ఇంత వ్యత్యాసం ఉంటే ఇక సామాన్యుల నుంచి తీసుకున్న వాటిలో ఎన్ని మార్పులు చేశారో చూడాల్సిన అవసరం ఉంది. కేంద్ర దర్యాప్తు సంస్థ వెనుక ఎవరో ఉండి ఇదంతా చేయిస్తున్నారని తెలుస్తోంది. ఇలాంటి చర్యలతో దర్యాప్తు సంస్థలపై ప్రజలకు నమ్మకం పోతుంది.

నేను చెప్పింది ఇదీ..

2019 మార్చి 15న ఉదయం 5 గంటలకు సమావేశం ప్రారంభమైంది. గంటన్నర తర్వాత (ఉదయం 6.30)ఎవరో డోర్ కొట్టారు. జగన్‌మోహన్‌రెడ్డి ఓఎస్‌డీ (కృష్ణమోహన్‌రెడ్డి) బయటికి వెళ్లారు. కాసేపటి తర్వాత వచ్చి జగన్ చెవిలో ఏదో చెప్పారు. తీవ్ర దిగ్భ్రాంతికి గురైన ఆయన.. 'చిన్నాన్న చనిపోయారు' అని చెప్పారు. ఆయన ఘటనా స్థలానికి వెళ్లాల్సి ఉండటంతో మేం సమావేశాన్ని అక్కడితో ఆపేసి బయటికి వచ్చాం.

ఆ పత్రిక రాసిందంతా అవాస్తవం

వైఎస్ వివేకానందరెడ్డి గుండెపోటుతో చనిపోయారని జగన్‌మోహన్‌రెడ్డి చెప్పినట్లు నేను వెల్లడించానని ఓ పత్రిక రాసింది. అది వాస్తవం కాదు. ఆ పత్రికలో వచ్చిన తప్పుడు వార్తలపై వివరణ ఇచ్చేందుకే విలేకరుల సమావేశం పెట్టి నిజాలు వెల్లడించా. అలాగే ఆ పత్రికలో వచ్చింది తప్పు అని ఖండించాలని సీబీఐని కోరా. అసలు చార్జిషీట్ వేయకముందే సీబీఐకి నేను ఏం చెప్పాను అన్నది ఆ పత్రికకు ఎలా వచ్చింది? ఎలా ప్రచురించింది? అంటే దీని వెనుక సీబీఐని ఎవరో నడిపిస్తున్నారని తెలుస్తోంది. పైగా సమాచారాన్ని ఇష్టం వచ్చినట్లు మార్చి ప్రచురించింది.

నేను వాంగ్మూలం ఇవ్వలేదని ఎప్పుడూ చెప్పలేదు..

నేను వాంగ్మూలం ఇవ్వలేదని ఎక్కడా చెప్పలేదు. ప్రెస్‌మీట్‌లో కూడా ఇచ్చాననే చెప్పా. ఒకవేళ నేను ఇవ్వను అంటే సీబీఐ అధికారులు చేసేదేమీ లేదు కదా అని మాత్రమే పేర్కొన్నా. నేను గతంలో ఇవ్వలేదని చెప్పానని.. ఇప్పుడు నా వాంగ్మూలం మార్చారని పిటిషన్ వేశానని ఓ చానల్ ప్రచారం చేయడం అసంబద్ధం. సత్యదూరం. ఊహాజనిత వార్తలతో తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారు. కావాలంటే నా ప్రెస్‌మీట్‌ను చూడొచ్చు.

అందుకే కోర్టును ఆశ్రయించా

నేను చెప్పనిది.. చెప్పినట్లు రాసిన తర్వాత కోర్టును ఆశ్రయించాల్సి వచ్చింది. చట్ట ప్రకారం 161 స్టేట్‌మెంట్ సాక్ష్యంగా చెల్లదు. అయినా నా వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడం కోసం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశా. చార్జిషీట్‌లో నుంచి తప్పుడు వాంగ్మూలాన్ని తొలగించి.. అవసరం అనుకుంటే సహజ న్యాయ సూత్రాల మేరకు నోటీసులు జారీ చేసి మళ్లీ తీసుకునేలా ఆదేశాలు జారీ చేయాలని కోరా.

పిటిషన్‌లో ఏముందంటే..

'2023 ఏప్రిల్ 29న సీబీఐ నా నుంచి స్టేట్‌మెంట్ రికార్డు చేసింది. నేను చెప్పింది ఒకటైతే సీబీఐ దాన్ని మార్చి చార్జిషీటులో మరోలా పేర్కొంది. వివక్ష లేకుండా, పక్షపాతం లేకుండా విచారణ సాగాలన్న ఉద్దేశంతో కోర్టు దృష్టికి తెస్తున్నాను. 2019 మార్చి 15న జగన్ నివాసంలో సుమారు ఉదయం 5 గంటల ప్రాంతంలో మేనిఫెస్టోపై సమావేశం ప్రారంభమైంది. గంటన్నర తర్వాత అటెండర్ వచ్చి డోరు కొట్టారు. ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి బయటకు వెళ్లి, తిరిగి వచ్చి జగన్ చెవిలో ఏదో చెప్పారు. వెంటనే జగన్ షాక్‌కు గురైనట్టుగా లేచి చిన్నాన్న చనిపోయారని చెప్పారు. ఇంతకు మించి నేనేమీ సీబీఐకి చెప్పలేదు. జగన్ గారి భార్య ప్రస్తావన కాని, మరే ఇతర ప్రస్తావన కాని చేయలేదు. అయితే ఛార్జిషీటులో సీబీఐ పేర్కొన్న స్టేట్‌మెంట్‌లో అబద్దాలే ఉన్నాయి. దర్యాప్తును తప్పుదోవపట్టించే ధోరణి ఇందులో కనిపిస్తోంది. కొంత మంది వ్యక్తులను ఇరికించే ప్రయత్నాల్లో భాగంగానే సీబీఐ ఇలా చేస్తోంది. నా విజ్ఞప్తిని పరిగణనలోకి తీసుకుని ఛార్జిషీటులో నా స్టేట్‌మెంట్‌గా పేర్కొన్న అంశాలను కొట్టేయాలి' అని అజేయ కల్లం పేర్కొన్నారు. కాగా, 'నా వాంగ్మూలాన్ని తప్పుగా రికార్డు చేశారు' అనే శీర్షికన శనివారం సాక్షిలో ప్రచురింతమైన వార్త అనువాదంలో పొరపాటు వల్ల 'సమావేశం ప్రారంభమైన అరగంటకు' అని ప్రచురితమైంది. 'సమావేశం ప్రారంభమైన గంటన్నర తర్వాత' అని ఉండాలి.

'వెలుగు' దివ్వెలు



కొత్తగూడ: ఇటీవలి భారీ వర్షాలకు పాకాల సరస్సు పూర్తిగా నిండి.. దాని శిఖం భూమిలో ఉన్న పలు విద్యుత్ సరఫరా లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ భారీగా నీరు చేరింది. సమీపంలోని పలు గ్రామాలకు వీటి నుంచే విద్యుత్ సరఫరా అవుతుంది. వాటిలో ఒక ఫీడర్ బ్రేక్‌డౌన్ అయి.. గోవిందాపురం, పొగుళ్లపల్లి, బోరింగ్‌తండా, చక్రాలతండా, మొండ్రాయిగూడెం, మోకాళ్లపల్లి గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

శ్రీకాంత్..

వాగు ఈది ఫీడర్ సరిచేసి



విద్యుత్‌ను పునరుద్ధరించాలంటే.. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగు దాటి విద్యుత్ స్తంభంపైకి ఎక్కి రిపేర్ చేయాలి. ఎలాగని విద్యుత్ శాఖ అధికారులు ఆలోచిస్తుండగా.. స్థానిక అన్‌మ్యాన్ డిస్ట్రిబ్యూషన్ కార్మికుడు శ్రీకాంత్ సాహసం చేశాడు. వరదలో సుమారు 200 మీటర్ల దూరం ఈదుకుంటూ వెళ్లి.. స్తంభం ఎక్కి ఫీడర్‌ను సరిచేసి వచ్చాడు. దీంతో రెండు రోజులుగా అంధకారంలో ఉన్న గ్రామాలకు వెలుగులు వచ్చాయి.



గార్ల: మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేట సమీపంలోని పెద్ద చెరువులో ఉన్న స్తంభంపై వైర్లు దెబ్బతిని వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శనివారం స్థానిక కాంట్రాక్ట్ విద్యుత్ వర్కర్ గట్టు యుగేందర్ చెరువులో అర కిలోమీటరు ఈదుకుంటూ వెళ్లి.. నీటిలోని విద్యుత్ స్తంభం ఎక్కాడు. త్రీ ఫేస్ విద్యుత్ వైర్లను సరిచేశాడు. ప్రాణాలు లెక్కచేయకుండా వెళ్లి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాడని యుగేందర్‌ను విద్యుత్ ఏఈ మహేంద్రబాబు, రైతులు అభినందించారు.

యుగంధర్

విద్యుత్ ఇచ్చి వ్యవ'సాయం'



ఎస్సారెస్పీని పరిశీలించిన డ్యాం సేఫ్టీ బృందం



ఎస్సారెస్పీ డ్యాం వివరాలు తెలుసుకుంటున్న డ్యాం సేఫ్టీ బృందం

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టును శనివారం డ్యాం సేఫ్టీ కేంద్ర బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా డ్యాం సేఫ్టీ బృందం అధ్యక్షుడు ఏబీ పాండ్య మాట్లాడుతూ.. శ్రీరాంసాగర్ ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో అధ్య యనం చేపట్టాల న్నారు. ఎస్సారెస్పీలోకి ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదలు, గోదావరిలోకి నీటి విడుదలను ప్రాజెక్టు అధికారులను అడిగి తెలుసు కున్నారు. ప్రస్తుతం శ్రీరాంసాగర్ ప్రాజెక్టుకు వరదల వలన ఎలాంటి డోకా లేదన్నారు. ప్రాజెక్టు వద్ద వరద గేట్ల మరమ్మతులు సకాలంలో చేపట్టినట్లు తెలి పారు. కడెం ప్రాజెక్టుకు, ఎస్సా రెస్పీ ప్రాజెక్టుకు మధ్య వ్యత్యాసం గురించి వివరించారు. ఎస్సారెస్పీ భద్రతపై, సిబ్బంది కొరతపై తుది నివేదిక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు అందజేస్తా మన్నారు. అనంతరం ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకం పంపుహౌస్‌ను, వరద కాలువ హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ రామరాజు, డ్యాం సేఫ్టీ ఎక్స్‌పర్ట్ సత్యనారాయణ, సీడబ్ల్యూసీ పర్యవేక్షణ నిపుణుడు యోగిందర్ కుమార్ శర్మ, ప్రాజెక్టు ఎస్ఈ శ్రీనివాస్, ఈఈ చక్రపాణి, స్థానిక అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం వద్ద మహోగ్రంగానే..

- వానలు తెరిపినిచ్చినా ఉప నదుల పరవళ్లతో గోదావరిలో పెరిగిన వరద
- భద్రాచలం వద్ద 55.8 అడుగులకు చేరిన నీటి మట్టం
- కొనసాగుతున్న మూడో ప్రమాద హెచ్చరిక
- ఎగువ ప్రాజెక్టుల్లో తగ్గిన ఇన్‌ఫ్లో..
- ఆదివారం నుంచి భద్రాచలం వద్ద శాంతించనున్న గోదావరి
- శ్రీశైలం ప్రాజెక్టుకు 1.51 లక్షల క్యూసెక్కుల ప్రవాహం.. 58.81 టీఎంసీల నిల్వ
- కృష్ణా నదిలోనూ ఎగువ నుంచి తగ్గుతున్న వరద



భద్రాచలంలో..

సాక్షి, హైదరాబాద్/ భద్రాచలం/ గద్వాల రూరల్/ ధరూర్/ దోమలపెంట: రాష్ట్రవ్యాప్తంగా వానలు తెరిపినిచ్చినా.. ఇప్పటికే చేరిన నీటితో ఉప నదులు, వాగులు పరవళ్లు తొక్కుతుండటంతో గోదావరి మహోగ్ర రూపం కొనసాగుతోంది. శనివారం రాత్రి 10గంటలకు భద్రాచలం వద్ద ప్రవాహం 16 లక్షల క్యూసెక్కులకు, నీటి మట్టం 56 అడుగులకు పెరిగింది. భారీగా వరద వస్తుండటంతో నీటి మట్టం మెల్లగా పెరుగుతూనే ఉంది. దీనితో అధికారులు మూడో ప్రమాద హెచ్చరికను కొనసాగిస్తున్నారు. లోతట్టు ప్రాంతాల వారిని పునరావాస శిబిరాల్లోనే ఉంచారు. మంత్రి పువ్వాడ అజయ్, సీఎల్పీ నేత మల్లు భట్టివిక్రమార్క, ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోత్ కవిత తదితరులు సహాయక చర్యలను పరిశీలించి, బాధితులను పరామర్శించారు. శనివారం మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా పునరావాస కేంద్రాల్లోని బాధితులకు భోజనం పెట్టకపోవడంతో వారంతా రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. ఆర్డీఓ మాధవి దీనిపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో అధికారులు 3 గంటలకు భోజనం అందించారు.

ఎగువ నుంచి తగ్గుతూ..

ఇక మహారాష్ట్ర, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లలో వర్షాలు ఆగిపోవడంతో.. ఎగువన గోదావరిలో వరద తగ్గుతోంది. శ్రీరాంసాగర్‌లోకి ప్రవాహం 60వేల క్యూసెక్కులకు పడిపోవడంతో ప్రాజెక్టు గేట్లను మూసేశారు. ఎల్లంపల్లి వద్ద 2.95 లక్షలు, పార్వతి బ్యారేజీ వద్ద 3.01 లక్షలు, సరస్వతి బ్యారేజీ వద్ద 1.98 లక్షలు, మేడిగడ్డ బ్యారేజ్ వద్ద 10.80 లక్షల క్యూసెక్కులకు వరద తగ్గింది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం నుంచి భద్రాచలం వద్ద గోదావరి శాంతించనుంది. భద్రాచలం నుంచి వెళ్తున్న భారీ వరద పోలవరం, ధవళేశ్వరం మీదుగా కడలిలోకి వెళ్లిపోతోంది.

శ్రీశైలంలోకి 1.51 లక్షల క్యూసెక్కులు

కృష్ణా ప్రధాన పాయ, తుంగభద్రలలోనూ వరద తగ్గుముఖం పట్టింది. ఎగువన కృష్ణాలో ఆల్మట్టిలోకి 1.30 లక్షల క్యూసెక్కులు, నారాయణ్‌పూర్‌లోకి 88,228 క్యూసెక్కుల వరద వస్తోంది. ఆ ప్రాజెక్టుల్లో కాస్త నీటిని నిల్వ చేస్తూ, మిగతా దిగువకు వదులుతున్నారు. జూరాలకు శనివారం ఉదయం నుంచి సాయంత్రందాకా 2.20 లక్షల క్యూసెక్కుల వరదరాగా.. సాయంత్రానికి 1,35,900 క్యూసెక్కులకు తగ్గింది. ఇక్కడ గేట్లు, విద్యుత్ సరఫరా ద్వారా కలిపి 1,48,875 క్యూసెక్కులను దిగువకు విడుదల చేస్తున్నారు. దీనికి సుంకేశుల నుంచి 2,181 క్యూసెక్కులు కలిపి.. మొత్తం 1,51,056 క్యూసెక్కుల ప్రవాహం శ్రీశైలంలోకి చేరుతోంది. శనివారం రాత్రి 9 గంటలకు ప్రాజెక్టులో నీటి నిల్వ 61.79 టీఎంసీలకు పెరిగింది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 215.81 టీఎంసీలు. ప్రాజెక్టు నిండాలంటే మరో 157 టీఎంసీలు కావాలి. ఇక తెలంగాణలో వర్షాలు తెరిపి ఇవ్వడంతో మూసీలో వరద తగ్గింది. పులిచింతల ప్రాజెక్టులోకి 11,949 క్యూసెక్కులు చేరుతుండటంతో నీటి నిల్వ 30.78 టీఎంసీలకు చేరుకుంది. మరోవైపు తుంగభద్ర డ్యామ్‌లోకి 84,202 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ 69.23 టీఎంసీలకు పెరిగింది.

భద్రకాళి చెరువుకు గండి!

- నీట మునిగిన వరంగల్‌లో మరోసారి ఆందోళన
- పోతన నగర్‌వైపు కోతకు గురైన చెరువు కట్ట
- సమీప కాలనీల వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించిన అధికారులు
- యుద్ధ ప్రాతిపదికన కట్టకు మరమ్మతులు
- నగరంలో ఇంకా ముంపులోనే పలు కాలనీలు



భద్రకాళి చెరువు గండిని పూడుస్తున్న దృశ్యం

సాక్షి ప్రతినిధి, వరంగల్/ వరంగల్ అర్బన్/ వరంగల్/ ఖిలా వరంగల్/ హనుమకొండ అర్బన్: ఇప్పటికే నీట మునిగి అతలాకుతలమైన వరంగల్‌లోని భద్రకాళి చెరువుకు శనివారం గండిపడింది. చెరువుకు ఒక్కసారిగా వరద పెరగడంతో.. పోతననగర్ వైపు కట్టకు కోతపడింది. దీంతో పోతననగర్, సరస్వతినగర్ కాలనీల జనం భయాందోళనకు గురయ్యారు. విషయం తెలిసిన అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. పోలీసులు, మున్సిపల్, రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి.. ఈ రెండు కాలనీలతోపాటు కాపువాడ కాలనీ, రంగంపేటల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. గండిపడిన ప్రాంతంలో వెంటనే మరమ్మతులు చేపట్టారు. చెరువు గండిని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రభుత్వ చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్‌లు పరిశీలించారు. కాలనీల ప్రజలను ముందు జాగ్రత్తగా మాత్రమే తరలించామని.. చెరువు గండి కారణంగా ఎలాంటి ప్రాణ, ఆస్తినష్టం జరగకుండా చర్యలు చేపట్టామని మంత్రి తెలిపారు. కాగా.. భద్రకాళి చెరువు శిఖం భూముల్లో ఆక్రమణలే ప్రస్తుత దుస్థితికి కారణమని స్థానికులు మండిపడుతున్నారు. పాత రికార్డుల ప్రకారం భద్రకాళి చెరువు విస్తీర్ణం 621 ఎకరాలు అయితే.. సుమారు41 ఎకరాలు ఆక్రమణకు గురైనట్టు చెప్తున్నారు.

ఇంకా నీటిలోనే పలు కాలనీలు..: భారీ స్థాయిలో వరదలతో జలమయమైన వరంగల్ నగరంలో ఇంకా పలు కాలనీలు నీటిలోనే ఉన్నాయి. 33వ డివిజన్ సీఆర్ నగర్, 34వ శివనగర్, 39వ డివిజన్ శాకరాసికుంట కాలనీ రోడ్లపై వరద నీరు పారుతూనే ఉంది. అక్కడి ప్రజలు పునరావాస కేంద్రాల్లోనే తలదాచుకుంటున్నారు. ఖిలా వరంగల్ అగర్త చెరువుల మత్తడి నీరు మైసయ్యనగర్ మీదుగా శివనగర్‌లోని రహదారులపై పారుతోంది. ఇక మిగతా ప్రాంతాల్లోని కాలనీల్లో వరద తగ్గిపోవడంతో జనం ఇళ్లకు చేరుకుంటున్నారు. కానీ ఇళ్ల నిండా బురద ఉండటం, సామగ్రి అంతా తడిసిపోవడాన్ని చూసి ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శివనగర్ రహదారులపై ప్రవహిస్తున్న వరదనీరు

వరంగల్‌లో వరద నష్టం

రూ. 414కోట్లు: జిల్లా పరిధిలో భారీ వర్షాలు, వరదలతో ఊహించని విధంగా ప్రాణ, ఆస్తినష్టం జరిగిందని.. బాధితులను అన్నివిధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో ఉమ్మడి జిల్లా అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లా పరిధిలో రూ.414 కోట్లు నష్టం జరిగినట్టు ప్రాథమికంగా అంచనా వేశామని మంత్రి తెలిపారు. వరంగల్, హన్మకొండ జిల్లా ల్లో 36 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని.. 38 రెస్క్యూ టీమ్‌ల ద్వారా 2,055 మందిని వివరించారు. 207 ఇళ్లు పూర్తిగా, 480 ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయని అధికారులు గుర్తించినట్టు తెలిపారు. బాధితులు ఆందోళన చెందవద్దని, త్వరలో పరిహారం అందజేస్తామని భరోసా ఇచ్చారు.

కొండాయిలో నిండా విషాదమే!

- వరదలతో మృతిచెందిన వారి అంత్యక్రియలు పూర్తి
- మట్టి గోడలతో ఉన్న 80 ఇళ్లు నేలమట్టం
- విద్యుత్ సరఫరా లేక 3 రోజులుగా చీకటిలోనే
- వాగుపై బ్రిడ్జి కొట్టుకుపోవడంతో బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్

ఏటూరునాగారం: భారీ వర్షాలు, జంపన్న వాగు వరదతో తీవ్రంగా దెబ్బతిన్న ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం కొండాయి ఇంకా విషాదంలోనే ఉండిపోయింది. వరదలో కొట్టుకుపోయి మృతి చెందిన 8 మంది గ్రామస్తుల అంత్య క్రియలు కుటుంబ సభ్యుల రోదనల మధ్య శనివా రం పూర్తయ్యాయి. గ్రామంలో మట్టి గోడలతో ఉన్న 80 ఇళ్లు నేలమట్టం అయ్యాయి. గ్రామమంతా నీట మునగడంతో బియ్యం, నిత్యావసరాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తడిసి పాడైపోయాయి. ఇళ్లలో, బయట ఎక్కడ చూసినా బురదతోనే నిండిపోయి కనిపిస్తోంది.



వరద బాధితులు, ముంపు ప్రాంతాన్ని పరిశీలించేందుకు కొండాయి జంపన్నవాగులో బోట్‌లో వెళ్తున్న మంత్రి సత్యవతి రాథోడ్

బాహ్య ప్రపంచంతో సంబంధాలు కట్

జంపన్న వాగుపై ఉన్న బ్రిడ్జి పూర్తిగా కొట్టుకుపోవడంతో కొండాయి గ్రామానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పారిశుద్ధ్య చర్యలు చేపట్టలేని పరిస్థితి ఉంది. భారీగా విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో.. మూడు రోజులుగా విద్యుత్ సరఫరాలేక చీకటిలోనే మగ్గుతున్నారు. ఎన్డీఆర్ఎఫ్ బోట్లు ఉన్నంత సేపు కాస్త రాకపోకలు, అవసరమైన సరుకులు అందుతున్నాయి. ఆ బృందాలు వెళ్లిపోతే.. అడవి గ్రామంలో చిక్కుకుపోయినట్టేనని గ్రామస్తులు వాపోతున్నారు.

మరణంలోనూ వీడకుండా..

కొండాయి గ్రామస్తులు రషీద్, ఆయన భార్య కరీమా ఒకరి చేతులు మరొకరు పట్టుకుని వరద దాటుతుండగా కొట్టుకుపోయారని.. చనిపోయేంత వరకు వారు కలిసే ఉన్నారని గ్రామస్తులు చెప్పారు. మృతదేహాలు కూడా చేయిపట్టుకునే ఉన్నాయని తెలిపారు.

మృతుల కుటుంబాలకు రూ.4లక్షలు

విపత్కర పరిస్థితిలో చిక్కుకున్న కొండాయి గ్రామస్తులను అన్ని విధాలా ఆదుకుంటామని, మృతుల కుటుంబాలకు రూ.4 లక్షలు పరిహారం అందజేస్తామని గిరిజన సంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. తక్షణ సాయంగా రూ.25 వేలు అందిస్తున్నట్టు చెప్పారు. శనివారం అధికారులతో కలసి ఆమె బోట్లలో కొండాయి గ్రామానికి వెళ్లి పరిశీలించారు. వరద బాధితులను ఓదార్చారు. ఆస్తి, పంటల నష్టంపై అధికారులు సర్వే చేసి నివేదిక ఇస్తారని.. అనంతరం తగిన సాయం అందిస్తామని తెలిపారు.

మోరంచపల్లి.. తీరని వ్యథ

- వరద మిగిల్చిన నష్టంతో కోలుకోని గ్రామస్తులు
- ఇంకా నీటి మధ్య ఉన్న కొన్ని ఇళ్లు..
- పలు కుటుంబాలు పునరావాస శిబిరంలోనే..
- ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకోలు
- శనివారం రెండు మృతదేహాలు లభ్యం



గొర్రె ఓదిరెడ్డి



సరోజన

భూపాలపల్లి అర్బన్/చిట్యాల: వరద తాకిడికి తీవ్రంగా నష్టపో యిన జయశంకర్ భూపాల పల్లి జిల్లా మోరంచపల్లి వ్యథ ఇప్పట్లో తీరే పరిస్థితి కనిపించడం లేదు. ఎవరిని కదిలించినా కన్నీరేకనిపిస్తోంది. కట్టుబట్టలు మినహా ఏమీ మిగలలేదన్న ఆవేదన వినిపిస్తోంది. వరదలో గల్లంతైన నలుగురు గ్రామస్తుల్లో ఇద్దరి మృతదేహాలు శనివారం లభించాయి. ఇందులో గొర్రె ఓదిరెడ్డి మృతదేహాన్ని చిట్యాల మండలం ఒడితల-పాశిగడ్డ పంటపొలాల్లో, గంగిడి సరోజన మృతదేహాన్ని మోరంచపల్లి నుంచి కొత్తపల్లి వెళ్లే మార్గంలోని పొలాల మధ్య గుర్తించారు. 3 రోజులుగా నీటిలోనే ఉండటంతో మృతదేహాలు పూర్తిగా కుళ్లిపో యాయి. గల్లంతైనవారిలో వజ్రమ్మ, గడ్డం మహాలక్ష్మి ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు.

రెండు కిలోమీటర్లు మోసుకొచ్చి..: పంట పొలాల మధ్య గుర్తించిన గొర్రె ఓదిరెడ్డి మృతదేహాన్ని రోడ్డు మీదకు తీసుకువచ్చేందుకు సమీపంలోని దూత్‌పల్లి, బావుసింగ్‌పల్లి గ్రామస్తులు, పోలీసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. భూపాలపల్లి సీఐ రాంనర్సింహారెడ్డి, చిట్యాల ఎస్సై రమేశ్, గ్రామస్తులు కలసి.. మృతదేహాన్ని ఒక దుప్పటిలో పెట్టి, కర్రకు జోలెలా కట్టారు. పొలాల్లో నీళ్లు, బురదతో నిండి ఉండటం, దారి లేకపోవడంతో.. మోరంచవాగు సమీపంలోని లిఫ్ట్ ఇరిగేషన్ పథకం వైపు నుంచి సుమారు రెండు కిలోమీటర్లు మోసుకుంటూ రోడ్డుపైకి తీసుకొచ్చారు. తర్వాత గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌లో ఒడితల ఆస్పత్రికి తరలించి, పోస్టుమార్టం చేయించారు. అక్కడి శ్మశానవాటికలోనే అంత్యక్రియలు పూర్తి చేశారు.



మోరంచపల్లిలో బంధువులను చూసి రోదిస్తున్న బాధితులు

బురదపట్టిన సామగ్రి: గ్రామంలో ఏ ఇంటి తలుపు తట్టినా కన్నీరుమున్నీరవుతున్నారు. వరద నీరు ఇళ్లలోకి చేరడంతో సామగ్రి బురదతో నిండిపోయింది. చాలా వరకు వస్తువులు, పరికరాలు పాడైపోయాయి. గ్రామస్తులు ఇళ్లలో పనికొచ్చే వాటిని శుభ్రం చేసుకుంటూ, పనికిరానివి పడేస్తూ.. ఇళ్లను శుభ్రం చేసుకుంటూ కనిపించారు. చాలా ఇళ్లలో బియ్యం, ఇతర నిత్యావసరాలు పూర్తిగా తడిసి, పాడైపోయాయి. ఇంత జరిగినా ప్రభుత్వం తక్షణ ఆర్థికసాయంగానీ, పరిహారం గానీ ప్రకటించకపోవడం దారుణమని గ్రామస్తులు వాపోతున్నారు. ఆకలితో అలమటిస్తున్నామని, రాజకీయ పార్టీలు, స్వచ్ఛంద సంస్థల వాళ్లు పంచుతున్న వాటితో కడుపు నింపుకొంటున్నామని అంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

'మాదిగలకు కాంగ్రెస్ పార్టీలో ప్రాధాన్యమివ్వాలి'

సాక్షి,హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో మాదిగ సామాజిక వర్గానికి తగిన ప్రాధాన్యం ఇవ్వాలని, ఎన్నికల్లో, పార్టీలో తమ వర్గానికి చెందిన నేతలకు మరిన్ని అవకాశాలు కల్పించాలని కాంగ్రెస్ పార్టీలోని మాదిగ వర్గానికి చెందిన నేతలు పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రేను కోరారు. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కాంగ్రెస్ పార్టీలోని మాదిగ నేతలు కొండేటి మల్లయ్య, భీంభరత్, మేకల రాధిక, హైమ తదితరులు ఠాక్రేను కలిసి వినతిపత్రం అందించారు. గత రెండు ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి 10, 12 మంది మాదిగ నేతలు పోటీ చేస్తే కాంగ్రెస్ మాత్రం ఆరుగురు చొప్పున మాత్రమే మాదిగ నేతలకు టికెట్లు ఇచ్చిందని ఆ వినతిపత్రంలో తెలిపారు.

60 కొత్త వంతెనలు

- రోడ్ల ముంపు సమస్య పరిష్కారానికి విరుగుడుగా ప్రతిపాదించిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: రికార్డు స్థాయి వర్షాలతో రోడ్లు మునిగి వాహనరాకపోకలపై తీవ్ర ప్రభావం చూపుతున్న నేపథ్యంలో 60 కొత్త వంతెనలను రోడ్లు భవనాల శాఖ ప్రతిపాదించింది. తక్కువ ఎత్తుతో ఉన్న కాజ్‌వేలు, కల్వర్టులను తొలగించి వాటి స్థానంలో వంతెనలు కట్టాల్సిన అవసరం ఉందని పేర్కొంది. వీటి నిర్మాణానికి రూ.1150 కోట్లు ఖర్చవుతాయని అధికారులు అంచనా వేశారు. ఇందులో దాదాపు రూ.50 కోట్ల వ్యయం అయ్యే వంతెన జాతీయ రహదారుల మీద ఉండగా, మిగతావి రాష్ట్ర రహ దారులపై ఉన్నవి కావటం విశేషం. ఈ వంతెనలు కాకుండా, మరో 635 కల్వర్టులను కూడా ప్రతిపాదించారు. ఇక తాజా వాన లతో ములుగు జిల్లా జంపన్న వాగు మీద దొడ్ల గ్రామం వద్ద ఉన్న వంతెన, ములుగు-బుద్దారం మధ్య రాళ్లవాగు మీద ఉన్న వంతెన, భూపాలపల్లి జిల్లా టేకుమట్ల వంతెన కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. మహబూబాబాద్‌లో మున్నేరు వాగు మీద ఉన్న వంతెన అప్రోచ్ రోడ్లు కూడా కొట్టుకుపోయాయి. ఆ వంతెన వద్ద వరద పోటెత్తినందున దాని పటుత్వాన్ని పరిశీలించాల్సి ఉంది.

రాష్ట్ర రహదారుల పునరుద్ధరణకు రూ.600 కోట్లు..

కొత్త వంతెనలతో కూడిన ప్రతిపాదనకు ప్రభుత్వం నుంచి అనుమతి రావాల్సి ఉంది. రాని పక్షంలో, ప్రస్తుత వర్షాలకు దెబ్బతిన్న రోడ్లను పునరుద్ధరించటంతో సరిపెట్టనున్నారు. ఈ పునరుద్ధరణ పనులకు రూ.600 కోట్లు అవసరమవుతాయని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. రోడ్లు దెబ్బతిని ప్రస్తుతం వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా మారిన చోట్ల తాత్కాలిక మరమ్మతు పనులు చేపట్టిన విషయం తెలిసిందే. రాష్ట్ర రహదారులపై తాత్కాలిక మరమ్మతులకు రూ.46 కోట్లు అవసరమని నివేదికలో పేర్కొన్నారు. జాతీయ రహదారులపై తాత్కాలిక మరమ్మతులకు రూ.36 కోట్లు విడుదల చేయాలని, దెబ్బతిన్న రోడ్ల పునురుద్ధరణ, ప్రతిపాదించిన కొత్త వంతెన, కల్వర్టుల కోసం రూ.148 కోట్లు అవసరమని జాతీయ రహదారుల విభాగం ప్రతిపాదించింది. భూపాలపట్నం జాతీయ రహదారిపై టేకులగూడెం వద్ద రూ.50 కోట్లతో వంతెన నిర్మాణానికి జాతీయ రహదారుల విభాగం ప్రతిపాదించింది. దీనికి కేంద్రప్రభుత్వం అనుమతి మంజూరు చేయాల్సి ఉంది.



శనివారం జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

రేపు రాష్ట్రానికి కేంద్ర బృందం

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో వరదల నేపథ్యంలో పరిస్థితిని తక్షణమే అంచనా వేసేందుకు అమిత్‌షా ఆదేశాల మేరకు అంతర్-మంత్రిత్వ శాఖల కేంద్ర బృందాన్ని కేంద్ర హోంశాఖ నియమించింది. ఎన్‌డీఎంఏ సలహాదారు కునాల్ సత్యార్థి నేతృత్వంలోని ఆరుగురు సభ్యుల కమిటీ ఈ నెల 31 నుంచి రాష్ట్రంలో పర్యటించనుంది. క్షేత్రస్థాయిలో నష్టాలను కేంద్ర బృందం అంచనా వేసిన తర్వాత తెలంగాణ ప్రభుత్వం వివరణాత్మక నివేదిక కేంద్రానికి సమర్పిస్తుంది. అనంతరం అవసరమైతే కేంద్ర బృందం మరోసారి క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికను కేంద్ర హోంశాఖకు సమర్పిస్తుంది. కేంద్ర బృందంలో వ్యవసాయ, ఆర్థిక, జలశక్తి, విద్యుత్, రహదారుల శాఖలు, అంతరిక్ష విభాగంలోని నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్‌కు చెందిన అధికారులు ఉంటారు. తెలంగాణలో 2019-20, 2020-21, 2021-22, 2022-23 సంవత్సరాల్లో సంబంధిత మంత్రిత్వ శాఖలు అమలు చేసిన వివిధ పథకాలు, కార్యక్రమాల కింద చేసిన కేటాయింపులు, నిధుల విడుదల, ఖర్చుల వివరాలను కూడా కేంద్ర బృందానికి ఇవ్వాలని సంబంధిత శాఖలను కేంద్ర హోంశాఖ ఆదేశించింది.



ఆతురపడి మాటలాడువానిని చూచితివా?
వానికంటె మూర్ఖుడు సులువుగా గుణపడును.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు, అధిక శ్రావణ మాసం, తిథి: శు. ద్వాదశి ఉ.7.08 వరకు, తదుపరి త్రయోదశి తె.5.13 వరకు (తెల్లవారితే సోమవారం), నక్షత్రం: మూల రా.7.44 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం: ఉ.6.13 నుండి 7.45 వరకు, తదుపరి తె.4.53 నుండి 6.24 వరకు (తెల్లవారితే సోమవారం), దుర్ముహూర్తం: సా.4.47 నుండి 5.39 వరకు, అమృతఘడియలు: ప.1.31 నుండి 3.04 వరకు.

సూర్యోదయం : 5.41
సూర్యాస్తమయం : 6.31
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

మహిళాశక్తిపై మారీచ యుద్ధం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి

పవన్ కల్యాణ్ అమ్ముల పొదిలో అన్నీ పచ్చబాణాలే ఉంటాయన్న నిజం ఎప్పటికప్పుడు నిగ్గుదేలుతూనే వస్తున్నది. ఇటీవల ఆయన వదిలిన ఒక పచ్చబాణం మీడియాలో విస్తృత చర్చకు కారణమైంది. ఒక రాజకీయ పార్టీకి సిద్ధాంత నిబద్ధత లేనప్పుడు, స్వార్థ ప్రయోజనాలే ఆ పార్టీ కార్యక్రమంగా ఉన్నప్పుడు... మాయోపాయాలతో కూడిన వ్యూహాలనూ, ఎత్తుగడలనూ ఆశ్రయిస్తుంది. అటువంటి ఒక పార్టీ తెలుగుదేశం పార్టీ. తాను అధికారంలోకి రావడానికి కారణమైన ఎన్నికల మ్యానిఫెస్టోను మాయం చేసి, వెబ్‌సైట్‌లోంచి కూడా తొలగించిన ఏకైక పార్టీ తెలుగుదేశం. పార్టీ అధ్యక్షుడు తన సిద్ధాంత గ్రంథంగా వెలువరించిన 'మనసులో మాట' అనే పుస్తకాన్ని కూడా మార్కెట్‌లో ఎక్కడా లభ్యం కాకుండా మాయం చేసిన ఘనత ఆ పార్టీదే. ఇటువంటి ఘనత ప్రపంచంలో మరో పార్టీకి లేదు.

స్వార్థ ప్రయోజనాలకూ, సిద్ధాంత నిబద్ధతకూ చుక్కెదురు. తన ఆశయ గ్రంథాన్నీ, ఎన్నికల హామీలనూ జనంలో లేకుండా దాచేయడం సిద్ధాంత నిబద్ధత లేదనడానికి నిదర్శనం. స్వార్థ ప్రయోజనాల కోసం ఎప్పటికెయ్యది ప్రయోజనమో అప్పటికా జెండా ఎత్తడాన్ని ఆ పార్టీ ఒక వ్యూహంగా అనుసరిస్తూ వస్తున్నది. ప్రత్యర్థి పార్టీ ఒక భావజాల నిబద్ధతతో ఉన్నప్పుడు, తాను ప్రకటించిన కార్యక్రమాలను వరుసగా అమలు చేస్తున్నప్పుడు, తన మ్యానిఫెస్టోకు పటం కట్టి, ఇంటింటికీ వెళ్లి మీరే మార్కులేయండని అడుగుతున్నప్పుడు... ఈ పారదర్శకతను ఎదుర్కోవడం, ఈ నిబద్ధతతో తలపడటం స్వార్థపక్షానికి సాధ్యమవుతుందా? కాదు కనుకనే వైసీపీపై మారీచ యుద్ధ వ్యూహాన్ని టీడీపీ ఎంచుకున్నది. వైసీపీ అమలు చేస్తున్న పేదల అనుకూల కార్యక్రమాలన్నింటిపైనా దుష్ప్రచారం చేయడమే ఎజెండాగా అది తలకెత్తుకున్నది. ఇందులో ఎల్లో మీడియా, రాజకీయ భాగస్వామిగా కొనసాగుతున్న పవన్ కల్యాణ్ పార్టీ తమకు తాము నిర్దేశించిన పాత్రలను పోషిస్తున్నాయి.

పేదల సంక్షేమం కోసం జగన్ ప్రభుత్వం ఒక్క పైసా వృథా కాకుండా ఇప్పటికి రెండు లక్షల పాతిక వేల కోట్ల రూపాయలను వారి ఖాతాల్లోకి నగదు బదిలీ చేసింది. ఈ కార్యక్రమం వల్ల ఏపీ మరో శ్రీలంక కాబోతున్నదని వీరు చేసిన ప్రచారం సంగతి అందరికీ తెలిసిందే. కానీ ఈ కార్యక్రమం రాష్ట్రాన్ని మాంద్యంలోకి జారకుండా కాపాడిందనీ, జీఎస్‌డీపీ వృద్ధికి దోహదపడిందనీ ఆర్థికవేత్తలు పలువురు ప్రశంసించడంతో వారి గొంతులో వెలక్కాయ పడింది. నగదు బదిలీ అంశాన్ని వదిలిపెట్టి అడ్డగోలు అప్పులు చేస్తున్నదని రాష్ట్ర ప్రభుత్వంపై ప్రచారం మొదలు పెట్టారు. ఈ ప్రచారం తప్పని మొన్న కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో విడుదల చేసిన రాష్ట్రాలవారీ అప్పుల జాబితా రుజువు చేసింది.


పేద పిల్లల ఇంగ్లీషు మీడియం చదువుపై చేసిన దుష్ప్రచారం కూడా ఈ కోవలోదే. భాషాభిమానులను రెచ్చగొట్టడానికి చేతనైనంత ప్రయత్నం చేశారు. నిన్న మొన్నటి దాకా రాజ్యాంగ పదవులు నిర్వహించిన ఒకరిద్దరి సేవలను కూడా ఇందుకు ఉపయోగించుకున్నారు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలిస్తే నగరం మైలపడిపోతుందని (demographic imbalance) కోర్టుకెక్కారు. 30 లక్షల మంది మహిళలకు ఇళ్ల పట్టాలిచ్చి కాలనీలు ఏర్పాటు చేస్తుంటే చేసిన తప్పుడు ప్రచారం కూడా అప్పుడే మరిచిపోయేది కాదు. ఇటువంటి ఉదాహరణలు కొన్ని వందలు ఇవ్వొచ్చు. జగన్ ప్రభుత్వం మహిళా సాధికారత కార్యక్రమం కూడా ఇప్పుడు వీటి సరసన చేరింది. వైఎస్ జగన్ ప్రభుత్వం చేపట్టిన ప్రాధాన్య కార్యక్రమాల్లో మహిళా సాధికారత ఒకటి. చంద్రబాబు – పవన్ – ఎల్లో మీడియా కూటమికి సిద్ధాంత నిబద్ధత లేకపోవడంతో పాటు ప్రత్యేకంగా మహిళా సాధికారత పట్ల వ్యతిరేకత, మహిళల పట్ల వివక్ష వారి స్వభావాల్లోనే ఉన్నది. బహిరంగంగా వారు మాట్లాడిన మాటల ద్వారానే ఈ సంగతిని గ్రహించవచ్చు. వీరి మహిళా వ్యతిరేక వైఖరిని ఇటీవల జరిగిన ఒక బహిరంగ సభలో ముఖ్యమంత్రి జగన్ ఎండగట్టిన విషయం తెలిసిందే. ఇటువంటి మనస్తత్వమున్న వ్యక్తులు మహిళా సాధికారతను ఎలా సహిస్తారు? అలాగని ఆ భావనను బహిరంగంగా వ్యతిరేకించలేరు. అందుకని దుష్ప్రచారాలతో చేసే పరోక్ష దాడినే ఎంచుకున్నారు. ఈ దాడిలో తొలి బాణాన్ని వేసే బాధ్యతను పవన్ కల్యాణ్‌కు అప్పగించారు చంద్రబాబు.

గోదావరి జిల్లాల పర్యటనలో పవన్ కల్యాణ్ ఈ దాడులకు దిగారు. పవన్ ప్రసంగంలోని రెండు అంశాలను మహిళా సాధికారతపై పరోక్షంగా జరిగిన దాడిగా విశ్లేషకులు పరిగణిస్తారు. మొదటి అంశం – 'ఉమన్ ట్రాఫికింగ్'. రాష్ట్రం నుంచి మూడేళ్లలో 30 వేల మంది మహిళల అక్రమ రవాణా జరిగిందనీ, ఇంత జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టుగా ఉన్నదనీ పవన్ ఆరోపించారు. రెండో అంశం – 'వలంటీర్ వ్యవస్థ'. ఒంటరి మహిళలు, వితంతువులు, నిస్సహాయుల వివరాలు సేకరించి వలంటీర్లు సంఘవిద్రోహ శక్తులకు అప్పగించారనీ, అందువల్లనే ఇన్ని వేలమంది అక్రమ రవాణా సాధ్యమైందనీ ఆయన ఆరోపణ. ఈ వలంటీర్లలో 55 శాతం మంది మహిళలే కావడం ఇక్కడ గమనించదగ్గ విషయం. మహిళా సాధికారత కార్యక్రమాలు ఒక ఉద్యమంగా సాగుతున్న తరుణంలో ఈ తరహా వ్యాఖ్యలు కచ్చితంగా బురద జల్లడానికీ, పక్కదోవ పట్టించడానికీ ఉద్దేశించినవేనన్న అభిప్రాయం కలుగుతున్నది.

మహిళా సాధికారత అంటే ఏమిటో అర్థమైతే ఈ తరహా దాడులు ఎందుకు జరుగుతున్నాయో అర్థమవుతుంది. మహిళా సాధికారత అనే అంశానికి చాలామంది చాలా రకాలుగా నిర్వచనాలు చెప్పారు. వాటన్నింటినీ క్రోడీకరిస్తే తేలే విషయం ఒక్కటే. 'సమస్త జీవన రంగాల్లో భాగస్వామిగా ఉండగలిగే స్వేచ్ఛ – అందలాలను అందుకోవడానికి, వనరులను వినియోగించుకోవడానికి, నిర్ణయాధికార స్వాతంత్ర్యానికి సంబంధించి సమాన అవకాశాలు – సాంఘిక కట్టుబాట్లు, వివక్ష లేకుండా తన జీవితంపై తాను సంపూర్ణ హక్కులు కలిగి ఉండటం.' ఇటువంటి పరిస్థితులన్నీ ఒనగూడితేనే మహిళా సాధికారత సిద్ధించిందని భావించవలసి ఉంటుంది. ఇటువంటి వ్యవస్థ సాధ్యమవుతుందా అనేది పితృస్వామిక వ్యవస్థల్లో తలెత్తే మొదటి ప్రశ్న. గడచిన కొన్ని దశాబ్దాల పరిణామాలను, కొన్ని పశ్చిమ దేశాలు సాధించిన గణనీయమైన పురోగతిని పరిశీలిస్తే ఇది అసాధ్యమైన విషయం కాదని బోధపడుతుంది. కాకపోతే, ఇందుకు ప్రభుత్వాలు, వ్యవస్థలు, సంస్థలు ఈ దిశలో పట్టుదలగా పని చేయవలసి ఉంటుంది.

మహిళా సాధికారతకు దోహదపడే అంశాలేమిటి? అందుకు అడ్డుపడే అంశాలేమిటి? స్థూలంగా ఒక ఐదు అంశాలు సాధికారతకు దోహదపడతాయని నిపుణులు చెబుతున్నారు. 1. సాధికారతకు 'విద్య' తొలి మెట్టు. తమ జీవిత లక్ష్యాలను ఎంచుకోవడానికి, చేరుకోవడానికి, అందుకు సంబంధించిన నిర్ణయాలను స్వయంగా తెలివిడితో తీసుకోవడానికి, సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా మెలగడానికి విద్య దోహదపడుతుంది. 2. రెండో మెట్టు – 'ఆర్థిక స్వాతంత్ర్యం'. ఉత్పాదక రంగంలో స్త్రీల ప్రాతినిధ్యం జనాభా నిష్పత్తిలో పెరగాలి. ఆర్థిక వనరులు వారికి కూడా అందుబాటులో ఉండాలి. నిర్ణయాధికార స్థానాల్లో వారికి సమాన అవకాశాలు ఉండాలి. 3. 'ఆరోగ్యం–సంక్షేమం' మూడో ముఖ్యాంశం. వైద్య–ఆరోగ్య అవకాశాలు అందుబాటులో ఉండటం. వివక్షకు, హింసకు దూరంగా ఉండటం. 4. 'రాజకీయ ప్రాతినిధ్యం' నాలుగోది. వివిధ స్థాయిల్లో వారికి రాజకీయ ప్రాతినిధ్యం ఉండాలి. వారి జీవితాలపై ప్రభావం చూపే చట్టాల రూపకల్పనలో వారి వాణి బలంగా వినిపించాలి. 5. సాంఘిక కట్టుబాట్లు ఐదో అంశం. మారుతున్న కాలమాన పరిస్థితులకు అనుగుణంగా జీవనశైలి మారకుండా అవరోధంగా ఉండే శృంఖలాలను తెంచుకుంటూ లింగ వివక్షను తొలగించడం. ఈ ఐదు అంశాల్లో పురోగతి సాధిస్తే సూత్రప్రాయంగా మహిళా సాధికారత సాధించినట్టే! ఈ ఐదు అంశాలకూ విరుద్ధంగా పనిచేస్తే అవే సాధికారతకు ఆటంకాలుగా మారుతాయి.

మహిళా సాధికారతలో ప్రభుత్వాల చిత్తశుద్ధి, కృషి ముఖ్యం. ఈ పదాన్ని ఉపయోగించకపోయినా భారత రాజ్యాంగంలో ఇదే తరహా కర్తవ్యబోధ ఉన్నది. రాజ్యాంగ పీఠికల్లోనూ, ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల్లో వివక్షలేని మహిళాభ్యున్నతికి సంబంధించిన అధికరణాలున్నాయి. పేదరికం, పెరుగుతున్న అసమానతలు, పర్యావరణ ముప్పు అనే మూడు భూతాలు మొత్తం భూగోళానికే ప్రమాదకరంగా పరిణమిస్తున్న నేపథ్యంలో ఐక్యరాజ్య సమితి సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను నిర్దేశించిన సంగతి తెలిసిందే. ప్రపంచ రాజ్యాలన్నీ 2015లో సమావేశమై మెరుగైన ప్రపంచం కోసం 17 లక్ష్యాలను ఏర్పరచుకున్నాయి. ఈ లక్ష్యాలను 2030లోగా సాధించాలన్న గడువును కూడా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాల్లో ఐదవది మహిళా సాధికారత. తీర్మానమైతే చేసుకున్నారు కానీ, చాలా దేశాల్లో సంకల్పం కొరవడినట్టు కనిపిస్తున్నది. మన దేశంలోని చాలా రాష్ట్రాల్లో ఇందుకు సంబంధించిన స్పృహ ఉన్నట్టు కనిపించడం లేదు. ఇందుకు ప్రధాన కారణాలు – రాజకీయ నేతలు స్వార్థ ప్రయోజనాలకే పెద్దపీట వేసుకోవడం! పేదరికం నుంచి ప్రజలను బయటకు తీసుకురావడంపై, అసమానతల తొలగింపుపై వారికి అవసరమైన సామాజిక దృక్పథం లేకపోవడం! ఈ ధోరణికి ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన నాలుగేళ్లుగా సాగుతున్న వైఎస్ జగన్ పరిపాలన భిన్నమైనది.



అంబేడ్కర్ రాజ్యాంగ ఆశయాలను జగన్ ప్రభుత్వం ఔదలదాల్చింది. సుస్థిర అభివృద్ధి లక్ష్యాలను గీటురాళ్లుగా పెట్టుకున్నది. ఇందుకు మనం అనేక ఉదాహరణలు ఉటంకించవచ్చు. పేదరికం నుంచి విముక్తి, అసమానతల నిర్మూలన కోసం పెద్ద ఎత్తున ఉద్యమస్థాయి కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టింది. ఇదిగో ఈ ఉద్యమంపైనే చంద్రబాబు – ఎల్లో మీడియా – పవన్ కల్యాణ్ టీమ్ బురదజల్లింది. ఆంధ్రప్రదేశ్ శ్రీలంకలా మారుతుందని శాపనార్థాలు పెట్టింది కూడా దీనిపైనే. మహిళా సాధికారత విషయంలోనూ ఏపీ ప్రభుత్వం కీలకమైన నిర్ణయాలు తీసుకొని పనిచేస్తున్నది. మహిళా సాధికారతకు దోహదపడే అంశాలను అధ్యయనం చేసి అందుకు అనుగుణమైన చర్యలను తీసుకున్నది. నాణ్యమైన విద్యావకాశాలను అందరికీ అందుబాటులో తెచ్చే కార్యక్రమంలో భాగంగా ఆడపిల్లలు చదువులకు దూరం కాకుండా ఉండేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టింది. పద్దెనిమిదేళ్లు నిండిన తర్వాతే అమ్మాయిలకు పెళ్లి కానుక (కల్యాణమస్తు, షాదీ తోఫా) వర్తిస్తుందనే నియమం వెనుక బాల్య వివాహాలను నిరోధించడంతోపాటు కనీసం ఇంటర్మీడియట్ పూర్తయ్యే వరకైనా బాలికలు డ్రాపవుట్‌లుగా మిగలకుండా ఉంటారనే ఆశాభావం కూడా ఉన్నది. ఈ నిబంధనను కూడా విమర్శించి తన సామాజిక స్పృహ స్థాయేమిటో ప్రతిపక్షం వెల్లడించింది. ఈ నాలుగేళ్ల చర్యల ఫలితంగా పాఠశాలల్లో బాలికల సంఖ్య పెరిగింది. అమ్మ ఒడి కూడా అందుకు దోహదపడింది. ఇప్పుడు పాఠశాలల్లో బాలికల సంఖ్య సుమారు 48 శాతానికి చేరుకున్నది. డ్రాపౌట్‌ల సంఖ్య స్థిరంగా తగ్గుతున్నది.

ఆర్థిక రంగంలో మహిళల పురోభివృద్ధికి తీసుకున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి. 'చేయూత' పథకం ద్వారా లబ్ధి పొందిన మహిళల్లో పదహారున్నర లక్షల మంది మహిళలు కొత్త వ్యాపారాలను ప్రారంభించడమో, పాత వ్యాపారాలను వృద్ధి చేసుకోవడమో జరిగింది. చంద్రబాబు నమ్మకద్రోహంతో నిస్తేజమైన పొదుపు సంఘాలను 'ఆసరా' పథకం ఆదుకున్నది. పునరుజ్జీవం పొందిన పొదుపు సంఘాలకు ఈ నాలుగేళ్లలో బ్యాంకులు ఒక లక్షా పదహారు వేల కోట్ల రుణాలను అందజేశాయి. దీంతో గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పొదుపు సంఘాలు క్రియాశీల పాత్రను పోషిస్తున్నాయి. 30 లక్షలమంది మహిళలకు ఇళ్ల పట్టాలు లభించి, ఇళ్ల నిర్మాణం జరుగుతున్నది. ప్రభుత్వ పథకాల ప్రధాన లబ్ధిదారులుగా మహిళలే ఉన్నారు.

గతంలో ఎన్నడూ లేని స్థాయిలో మహిళల రాజకీయ ప్రాతినిధ్యం పెరిగింది. బాబు కేబినెట్‌లో ఇద్దరు మహిళలుంటే ఇప్పుడు నలుగురున్నారు. గతం కంటే ముఖ్యమైన శాఖలను వారు నిర్వహిస్తున్నారు. మున్సిపల్ చైర్మన్లు, మేయర్లు, సర్పంచ్‌లు, మండలాధ్యక్షులు, జడ్పీ చైర్మన్ పదవుల్లో 55 శాతం మంది మహిళలే. 50 శాతం నామినేటెడ్ పదవులను వారికి రిజర్వ్ చేశారు. గ్రామ సచివాలయాల్లో 1,38,026 మందిని నియమిస్తే అందులో 77,935 మంది మహిళలు. వలంటీర్లలో 55 శాతం మంది మహిళలు. ఆరోగ్య శాఖలో చేసిన 48 వేల నియామకాల్లో అత్యధికులు మహిళలు. ఈ సంవత్సరం డిగ్రీ పూర్తిచేసి క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు పొందిన లక్షా ముప్ఫయ్‌వేల మందిలో 60 శాతం అమ్మాయిలు. మహిళా సాధికారత దిశలో ప్రభుత్వం చేపట్టిన చర్యల వలన కలిగిన ఫలితాల్లో ఇవి కొన్ని మాత్రమే! గర్భిణీలు, బాలింతల దగ్గర నుంచి మహిళల ఆరోగ్య పరిరక్షణకు వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారు. వేధింపులకు విరుగుడుగా తీసుకొచ్చిన 'దిశ' యాప్ సూపర్ హిట్టయ్యింది.

ఈ విజయాలను పక్కదారి పట్టించడానికే వ్యూహం ప్రకారం మహిళల అక్రమ రవాణా అంశాన్ని పవన్ కల్యాణ్ తెరపైకి తెచ్చారని అభిప్రాయం కలుగుతున్నది. ఎందుకంటే పవన్ చెప్పినట్టు ఈ మూడేళ్లలో 30 వేలమంది మహిళల అక్రమ రవాణా జరగలేదు. కేంద్రం పార్లమెంట్‌కు సమర్పించిన నివేదిక, రాష్ట్ర పోలీసు అధికారుల వివరణ ప్రకారం ఈ మూడేళ్లలో 26,099 మంది 'అదృశ్య'మయ్యారు. వీటిని మిస్సింగ్ కేసులు అంటారు. ట్రాఫికింగ్ అనరు. ఈ మొత్తంలో 2019కి ముందు అదృశ్యమై అప్పటికి ఆచూకీ లభించని వారి సంఖ్య కూడా కలిసి ఉన్నది. ఈ అదృశ్యమైన వారిలో 23,394 మందిని గుర్తించి, తిరిగి ఇంటికి చేర్చడం కూడా జరిగింది. ఇక మిగిలింది 2705 మంది. ఇది 2021 డిసెంబర్ 31 నాటి లెక్క. ఆ తర్వాత ఇందులో మరెంతమంది ఇల్లు చేరారనే అంశంపై పోలీసు శాఖ ఆ యా కేసులను పరిశీలించవలసి ఉన్నది. కేంద్రం విడుదల చేసిన జాబితా ప్రకారం ఆంధ్రప్రదేశ్ 14వ స్థానంలో ఉన్నది. కానీ, పవన్ తీసిన రాగం, దానికి యెల్లో మీడియా, చంద్రబాబు చేసిన రాద్ధాంతం చూస్తే ఆంధ్రప్రదేశ్ నుంచి మాత్రమే వేలాది మంది అదృశ్యమయ్యారనే అపోహ కలుగుతుంది. ఈ అపోహ కలిగించడమే వారి లక్ష్యం.

వందలు, వేలు కాదు. పదిమంది అదృశ్యమైనా, ఒక్కరు అక్రమంగా రవాణా అయినా ఆందోళన చెందవలసిన విషయమే. సిగ్గుపడవలసిన సంగతే! ఈ పరిస్థితులకు కారణాలేమిటి? పేదరికం, అవిద్య, నిస్సహాయత – ఇటువంటివన్నీ కారణాలవుతాయి. మహిళా సాధికారత ద్వారానే వీటిని జయించగలుగుతారు. ఆ దిశలో పనిచేస్తున్న జగన్ ప్రభుత్వ విజయాలను మరపించేందుకే ట్రాఫికింగ్‌ను ముందుకు తెచ్చారనే వాదనకు బలం చేకూరుతున్నది. సాధికారతకు దోహదపడే అంశాలను బలపరచకపోగా అడ్డంకిగా ఉండే సాంఘిక రుగ్మతలను మాత్రం తెలుగుదేశం కూటమి ఎగదోస్తున్నది. 'కోడలు మగపిల్లాడిని కంటానంటే అత్త వద్దంటుందా?' అంటూ చంద్రబాబు చేసే ప్రచారం ఈ రుగ్మతలకు ఆజ్యం పోసేదే! పైగా ఈ ముఠాలోని ముఖ్యనేతలంతా గతంలో మాట్లాడిన మాటలూ, చేసిన చేష్టలూ మహిళను సాటి మనిషిగా కాక, ఆట వస్తువుగా పరిగణించే దృక్పథానికి ప్రతీకలు. ఇటువంటి శక్తులు మహిళా సాధికారతను సహిస్తాయా? చస్తే సహించవు. లక్షన్నరమంది మహిళలు ఒక్కసారిగా వలంటీర్లుగా సేవారంగంలోకి అడుగుపెట్టి క్రియాశీలంగా వ్యవహరిస్తుంటే తట్టుకోలేని ప్రబుద్ధుడు వారిపై నిందలు మోపడం ఈ అసహనానికి పరాకాష్ఠ!

vardhelli1959@gmail.com

సచిన్ పైలట్ (కాంగ్రెస్)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఇంట్లోంచి బయటికి వస్తుంటే కారు విండోలోంచి ఒక అపరిచితుడు కనిపించాడు. నాకొక ఆలోచన వచ్చింది. కారును అతడికి దగ్గరగా ఆపి, కారు విండోను కిందికి దించి, నా చేతిని బయటికి పెట్టి, ఒక వేలు పట్టుకోమని ఆ అపరిచితుడిని అడిగితేనో!

నమ్మదగని ఇద్దరు వ్యక్తులలో ఒకరిని తప్పనిసరిగా నమ్మవలసి వచ్చినప్పుడు రెండు వేళ్లలో ఒకటి పట్టుకోమని అడిగేందుకు ఎవరైనా ఒక నమ్మకస్థుడైన వ్యక్తిని మాత్రమే మనం ఎంపిక చేసుకోవలసిన అవసరం ఏముంటుంది? అపరిచితుడిని కూడా అడగవచ్చు కదా!

రెండు వేళ్లూ నా చేతివే అయినప్పుడు, ఆ రెండు వేళ్లలో ఒకటి అశోక్ గెహ్లోత్ అని, రెండోది రాజేంద్రసింగ్ గుఢా అని మనసులో అనుకునేది నేనే అయినప్పుడు, వాటిల్లో ఒక వేలు పట్టుకునే ఆ అపరిచితుడు గెహ్లోత్ వేలును పట్టుకుని కూడా, నేను పట్టుకున్నది గుఢా వేలును అని నాతో వాదించడానికేం ఉంటుంది కనుక?



డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు. గెహ్లోత్‌తో కలిసి గుఢాను పక్కన పెట్టడమా? గుఢాతో కలిసి గెహ్లోత్‌ను పక్కన పెట్టడమా?

గెహ్లోత్ ముఖ్యమంత్రి. గుఢా జూలై 21 వరకు మంత్రి. నేనైతే ముఖ్యమంత్రినీ కాదు, మంత్రినీ కాదు. నేను ఏదీ కాకపోయినా ఒకరంటే ఒకరికి పడని గెహ్లోత్, గుఢా ఒకర్నొకరు దూషించుకోడానికి నన్ను కీర్తిస్తున్నారంటే ఆ దూషణ, కీర్తన నమ్మదగినవే అయినా వాళ్లిద్దరూ నమ్మదగనివారే!

గెహ్లోత్ నన్ను సీఎంని కానివ్వడం లేదు. "ఈసారి మిమ్మల్నెలా సీఎంని కానివ్వరో నేనూ చూస్తా.." అని గుఢా అంటున్నారు!

కాలేజ్‌లో ఉన్నప్పట్నుంచి చూస్తున్నా... రాజస్థాన్‌లో ఎప్పుడూ వరుసగా రెండుసార్లు కాంగ్రెస్ రాలేదు. వరుసగా రెండుసార్లు బీజేపీ రాలేదు. కానీ కాంగ్రెస్ వచ్చిన ప్రతిసారీ వరుసగా గెహ్లోతే సీఎంగా వస్తున్నారు. రివాజుగా 2023లో బీజేపీ వస్తే కనుక 2028 వరకు సచిన్‌కు సీఎం అయ్యే ఛాన్స్ లేదనే ధీమా వల్ల కావచ్చు గెహ్లోత్ నన్ను కొంతకాలంగా చిరునవ్వుతో పలకరించే ప్రయత్నం చేస్తున్నారు. "నీకు చపాతీ, మిక్స్‌డ్ వెజిటబుల్స్ ఇష్టం కదా సచిన్? వస్తావా అలా మంచి రెస్టారెంట్‌కి వెళ్దాం?" అని కూడా నేడో, రేపో అడిగేసేలా ఉన్నారు.

చపాతీలు, మిక్స్‌డ్ వెజిటబుల్స్ కోసం గెహ్లోత్‌తో కలిసి వెళితే ఆయన ఏం అడుగుతారో నాకు తెలుసు. "గుఢా దగ్గరున్న 'ఎర్ర డైరీ' ఒరిజినల్‌ని ఎలాగైనా సంపాదించమంటారు. ఆ ఎర్ర డైరీలోని అక్రమాల లిస్టులో తన పేరుందేమోనని ఆయన భయం.

గుఢా బీఎస్పీ ఎమ్మెల్యే. ఆయన్ని కాంగ్రెస్‌లోకి తీసుకుంది గెహ్లోతే. మంత్రిని చేసిందీ గెహ్లోతే. మంత్రిగా తొలగించిందీ గెహ్లోతే.

గెహ్లోత్‌పై తిరుగుబాటుకు చెయ్యి కలిపితే 20 కోట్లు ఇస్తానని సచిన్ ఆశ చూపారని చెప్పి గెహ్లోత్ దగ్గర మంత్రి పదవి సంపాదించి, మంత్రి పదవి పోయాక ఇప్పుడు నా వైపు మాట్లాడుతున్నారు గుఢా! నేనెంత గొప్పవాణ్ణో, మా నాన్నగారు ఇంకెంత గొప్పవారో గెహ్లోత్‌కి వినిపించేలా నలుగురికీ చెబుతున్నారు!

వెళ్లి ఆ అపరిచితుడి దగ్గర కారు ఆపాను. కారు విండో కిందికి దించాను. నా చేతిని బయటికి పెట్టాను. చూపుడు వేలు, మధ్య వేలు చూపించి ఒక వేలు పట్టుకోమన్నాను.

అపరిచితుడు పట్టుకోలేదు!

"మీరు సచిన్ పైలట్ కదా.." అన్నాడు.

"అవును. సచిన్ పైలట్‌నే" అన్నాను.

"నేను మీ కార్యకర్తను సచిన్ జీ. నేను చెప్పడం ఏంటంటే... మీరు మీ వేళ్లనే కాదు, మీ చేతినీ నమ్మకండి.." అన్నాడు!!

ఒక్కసారిగా ఆశ్చర్యచకితుణ్ణి అయ్యాను!

అతడు నిజంగా అపరిచితుడేనా అని చూశాను. ఊహూ. అపరిచితుడు కాదు. పనికొచ్చే సలహా ఇచ్చినవాడు ఆత్మీయుడౌతాడు కానీ అపరిచితుడౌతాడా?

గుంత ఉంటెనే మంచిది!



అట్లుంటది

తెలిదేవర భానుమూర్తి

మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల దీపాలు ఎల్గినయి. ట్రాఫిక్‌తోని తొవ్వలు మెస్ల రాకుంటున్నయి. జెనంతోని సిన్మ తేటర్లు చీమల పుట్ట లెక్కున్నయి. పొద్దు మీకింది. ఇంటికి పోబుద్ధి గాని సర్కార్ జీతగాల్లు హోటల్ల గూసోని ముచ్చట బెడ్తున్నరు. గుడికాడ బిచ్చపోల్లు బిచ్చమడుక్కుంటున్నరు. ఒక్కపారే సిటీ బస్సులు సాల్పుత బోతున్నయి. ఎప్పటి తీర్గనే చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ. గాడ పాన్లు దినెటోల్లు పాన్లు దింటరు. సిగిలేట్లు దాగెటోల్లు సిగిలేట్లు దాగుతరు. పాన్ డబ్బకు జెర్రంత దూరంల ఛాయ్ బండి ఉన్నది. గాడ ఛాయ్ దాగెటోల్లు పాన్లు, సిగిలేట్ల కోసం పాన్ డబ్బ కాడ్కి వొస్తుంటరు.

పొద్దు మీకంగనే మా దోస్తులు పాన్ డబ్బ కాడ జమైతరు. సిగిలేట్లు దాక్కుంట, పాన్లు దినుకుంట ముచ్చట బెడుతుంటరు. గా దాని మీద గీ దాని మీద అనకుంట అన్నిటి మీద గాల్లు ముచ్చట బెడుతుంటరు. గని ఎక్వ రాజకీయాల మీదనే మాట్లాడుతుంటరు. రాజకీయాల మీద మాట్లాడుకుంట నువ్వెంత అంటె నువ్వెంత అనుకుంట మాటలతోనే కొట్లాడుతుంటరు. గా దినం నేను బోక ముందు గాల్లు ఏం మాట్లాడుకుండ్రో నా ఎర్క లేదు. గని నేను బోయినంక గాల్లు గీ తీర్గ ముచ్చట బెట్టిండ్రు.

''మా వాడకట్టుల గుంత బడ్డది'' అని యాద్గిరి అన్నడు.

''గుంత బడ్తె ఏమైంది?'' అని సత్నారి అడిగిండు.

''గుంతల బడి మోటర్ సైకిల్లు, స్కూటర్లు కరాబ్ గాబట్టినయి.''

''జెనంకు ఏం గాలేదా?''

''ఎవలన్న గుంతల బడ్తె కాల్లు, చేతులు ఇర్గబట్టినయి. వాన బడెతల్కె గా గుంత నీల్లతోని నిండింది.''

''నీల్ల తోని నిండితె ఏమైంది?''

''గుంత నీల్లతోని నిండ బట్కె దోమలొచ్చినయి. గవ్వి మమ్ములను కుట్టి కుట్టి సంపబట్టినయి.''

''గుంతను పూడ్చిచ్చెతందుకు మీరు కోషిస్ జెయ్యలేదా?''


''ఎందుకు జెయ్యలేదు. చేసినం.''

''ఏం జేసిండ్రు?''

''సక్కగ మా ఎమ్మెల్యె తాన్కి బోయినం.''

''పోయి ఏం జెప్పిండ్రు?''

''మా వాడకట్టుల గుంతబడ్డది. గా దాంట్ల ఎవలన్న బడితె



కాల్లు చేతులు ఇర్గుతున్నయి. గుంతను పూడ్పియ్యండ్రి అని అన్నం.''

''గాయిన ఏమన్నడు?''

''కాల్లు చేతులు ఇర్గితె ఏం జేస్తున్నరు అని అడిగిండు.''

''మీరేం జెప్పిండ్రు?''

''డాక్టర్ తాన్కి బోయి పట్టి గట్టిచ్చుకుంటున్నం అని జెప్పినం.''

''చెప్తె గాయినేమన్నడు?''

''పట్టిగట్టినందుకు డాక్టర్‌కు ఫీజు ఇస్తున్నారా లేదా అని అడిగిండు.''

''మీరేమన్నరు?''

''ఇస్తున్నం అని జెప్పినం.''

''గాయినేమన్నడు?''

''మీరు ఫీజు ఇయ్య బట్కె డాక్టర్ బత్కుతున్నడు అని గాయిన అన్నడు.''

''గుంతల బడె బట్కె మోటర్ సైకిల్లు, స్కూటర్లు కరాబైతున్నయని మా ఎమ్మెల్యెకు జెప్పినం.''

''చెప్తె గాయినేమన్నడు?''

''స్కూటర్లు కరాబైతె ఏం జేస్తరు అని గాయిన అడిగిండు.''

''సక్కగ మెకానిక్ తాన్కి బోతం అని జెప్పినం.''

''మెకానిక్ తాన్కి బోయి స్కూటర్లు, మోటర్ సైకిల్లు బాగ జేపిచ్చుకొని ఏం జేస్తరు?''

''బాగ జేసినందుకు మెకానిక్‌కు రూపాయలిస్తం.''

''మీరు రూపాయలియ్యబట్కెనే మెకానిక్ బత్కుతున్నాడు.''

''వాన బడె బట్కె గుంత నీల్లతోని నిండింది.''

''నీల్లతోని నిండితె ఏమైతది?''

''దోమలొచ్చినయి. గవ్వి మమ్ములను కుట్టి కుట్టి సంపుతున్నయి. దోమలు కుట్టె బట్కె రోగాలొస్తున్నయి.''

''రోగాలొస్తె మీరేం జేస్తున్నరు?''

''డాక్టర్ల తాన్కి బోతున్నం.''

''డాక్టర్లు మీకు ఇలాజ్ జేస్తున్నరు. ఇలాజ్ జేసినందుకు గాల్లకు ఫీజు ఇస్తున్నరు. గాల్లు మీకు మందులు రాస్తున్నరు. మందుల దుక్నంల మీరు మందులు గొంటున్నరు. మీరు ఫీజు ఇయ్యబట్కె డాక్టర్లు, మందులు గొన బట్కె మందుల దుక్నపోల్లు బత్కుతున్నరు. గుంత జెయ్య బట్కె మెకానిక్‌లు, డాక్టర్లు, మందుల దుక్నపోల్లు బత్కుతున్నరు. గుంతను పూడ్పిస్తె గింత మంది పొట్ట గొట్టినట్లు గాదా?'' అని మా ఎమ్మెల్యె అడిగిండు. 'గుంతలు లేని వాడకట్టులల్ల గుంతలు తోడ్పిస్తమని జెప్పిండు.' అని యాద్గిరి అన్నడు.

''మొన్న కేటీఆర్ పుట్టిన దినాన కొంతమంది టమాటలు పంచి పెట్టిండ్రు.''

''టమాటలు పంచి పెట్టుడు అంటె బంగారంను పంచి పెట్టుడే.''

''దమ్ముంటె కాంగ్రెస్ గాల్ల సీఎం క్యాండిడేట్ ఎవలో ముందుగాలే జెప్పాలె అని కేసీఆర్ అన్నడు.''

''దమ్ముంటె బీఆర్ఎస్ సిట్టింగ్లందర్కి ఎమ్మెల్యె టికెట్ ఇయ్యాలని రేవంత్ రెడ్డి అన్నడు.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టిండ్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ | 99591 50491

ఆ జన్మ ధన్యం!

తెల్లవారి లేచి చూసేసరికి, ప్రకృతిలో సర్వే సర్వత్రా ఎన్నెన్ని కోట్ల కొత్త పుష్పాలు పుట్టుకొస్తాయో! ఎన్నిసార్లు చూసినా ఈ వైచిత్రి ఆనందాన్నీ, ఆశ్చర్యాన్నీ కలిగిస్తూనే ఉంటుంది. ఈ సౌందర్యసృష్టి అంతా ప్రకృతి ప్రాణికోటికి నిత్యం అయాచితంగా అందజేసే వెలలేని కానుక. గతం... భవిష్యత్తు కోసం వర్తమానంలో నిలిపిన పునాది ఇది.

అయితే పుష్పాలన్నీ ఫలించవు. గాలి వల్లో, తుమ్మెదల వల్లో, ఇతర ప్రాణుల వల్లో తన జాతికి చెందిన పుష్పాడితో 'పరాగ సంపర్కం' జరిగితే, పరిస్థితులన్నీ అనువుగా ఉంటే,



జ్యోతిర్మయం

పుష్పం ఫలిస్తుంది. అలా ఫలించేది నూటికీ, వెయ్యికీ ఒక్క పుష్పం. మరి మిగిలిన పుష్పాల మాట? 'ఆయువు కల్గు నాల్గు గడియల్ కని పెంచిన తీవ తల్లి జా/తీయత దిద్ది తీర్చుము, తదీయ కరమ్ముల లోన స్వేచ్ఛమై/ఊయల లూగుచున్, మురియుచుందుము..' (కరుణశ్రీ) అన్న పరిధిలో ఉండిపోతాయి. తమ సౌందర్యంతో బాహ్య ప్రపంచానికి విందు చేసి, ఆయువు తీరగానే, ఆ తీవ తల్లి పాదాల మ్రోలనే వాలి, కన్ను మూస్తాయి. కొన్ని పూలకు మాత్రం, తమ జన్మకూ, తమ తీవతల్లి జన్మకూ కూడా కారణమైన జగదీశ్వరుడి కైంకర్య భాగ్యం లభిస్తుంది. పుట్టుక ధన్యమౌతుంది.

మామూలుగా అయితే ఒక పుష్పానికి శక్తి ఎంత? అన్ని పరిస్థితులూ అనుకూలిస్తే, అది తన జాతికే చెందిన ఫలంగా పరిణమించగలదు. అంతే. కానీ భక్తుడు ఆ పుష్పాన్ని శ్రద్ధగా శివపూజకు ఉపయోగిస్తే, దాని శక్తి పెరిగిపోతుంది. దానికి కొత్త సిద్ధులు, మహిమలు అబ్బుతాయి. తమకు ధన్యత కలిగించిన భక్తుడి పట్ల కృతజ్ఞతతో, అవి దారసుతులూ, ధన కనక వస్తు వాహనాది రూపాలైన ఫలాలుగా మారి ఆ భక్తుడికి అందుతాయి. '...మీ పాద పయోజ పూజితములై, అత్యద్భుతం(బు!), ఆ విరుల్ / కరులౌ, అశ్వములౌ, అనర్ఘమణులౌ, కర్పూరమౌ, హారమౌ, తరుణీ రత్నములౌ, పటీర తరులౌ, తథ్యంబు! విశ్వేశ్వరా!' అంటాడు యథావాక్కుల అన్నమయ్య అనే కవీశ్వరుడు. పటీర తరువు అంటే చందన వృక్షం. పన్నెండో శతాబ్దంలో అన్నమయ్య రచించిన 'సర్వేశ్వర శతకం' సర్వాంగ సుందరమైన, సలక్షణమైన శివస్తుతి శతకం.

– ఎం. మారుతి శాస్త్రి

తెలంగాణలో కాషాయ జెండా ఎగరాల్సిందే

● రాష్ట్ర బీజేపీ నేతలకు అమిత్ షా పిలుపు



అమిత్‌షాకు పుష్పగుచ్ఛం ఇస్తున్న మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి. చిత్రంలో ఈటల, కిషన్‌రెడ్డి, బండి సంజయ్, తరుణ్ ఛుగ్

సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో అధికారమే లక్ష్యంగా నాయకులందరూ కలిసికట్టుగా పనిచేయాలని రాష్ట్ర బీజేపీ నాయకులకు కేంద్ర హోం మంత్రి అమిత్ షా పిలుపునిచ్చారు. గెలుపే లక్ష్యంగా క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతంపై దృష్టి సారించాలన్నారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సహాయక చర్యల విషయంలో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలని, అదే సమయంలో క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరువయ్యేలా కార్యకర్తలు, నాయకులు సహాయక చర్యల్లో పాల్గొనేలా చూడాలని ఆదేశించారు. శనివారం తనను కలిసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, పార్టీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జ్‌లు తరుణ్ ఛుగ్, సునీల్ బన్సల్‌తో అమిత్ షా రాష్ట్రంలోని తాజా పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఇటీవల కిషన్‌రెడ్డి, బండి సంజయ్‌లతో భేటీ సందర్భంగా రాష్ట్ర రాజకీయాలపై ఆరా తీసిన అమిత్ షా... రాష్ట్ర నాయకులకు పార్టీ వ్యవహారాలు, అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అనుసరించాల్సిన వ్యూహాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టడం, ప్రధాని సహా కేంద్రమంత్రుల పర్యటనలు సహా పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టేందుకు మరింత దూకుడుగా వ్యవహరించాలని సూచించారు. రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలమైన పరిస్థితుల గురించి కిషన్‌రెడ్డి సహా రాష్ట్ర నాయకులు అమిత్ షాకు వివరించారు.

మహారాష్ట్ర నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు

సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్రకు చెందిన మాజీ ఎంపీ సంగ్రామ్ సింగ్ జైసింగ్ రావు గైక్వాడ్ తన అనుచరులతో బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, తెలంగాణ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు సమక్షంలో శనివారం పార్టీలో చేరారు. అలాగే ప్రముఖ వ్యాపారవేత్త షుగర్ ఫ్యాక్టరీల యజమాని, మరాఠా ధన్‌కర్ సామాజిక వర్గానికి చెందిన బాలాసాహెబ్ కస్నంవార్ బీఆర్ఎస్‌లో చేరారు. వీరితో పాటు మహారాష్ట్ర ఉస్మానాబాద్ జిల్లా నుంచి పలువురు ముఖ్యనేతలు పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. వీరందరికీ కేసీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేరికల కార్యక్రమంలో బీఆర్ఎస్ మహారాష్ట్ర ఇన్‌చార్జి కల్వకుంట్ల వంశీధర్‌రావు, మహారాష్ట్ర స్టీరింగ్ కమిటీ సభ్యుడు శంకరన్న ధోంగే, పూనే డివిజన్ కో–ఆర్డినేట్ బీజే దేశ్‌ముఖ్ పాల్గొన్నారు.

నేడు వరంగల్‌లో కిషన్‌రెడ్డి పర్యటన

సాక్షి, హైదరాబాద్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆదివారం కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో పాటు ఆ పార్టీ నాయకులు పర్యటించనున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు భూపాలపల్లి జిల్లా మోరంచపల్లి ప్రాంతంలో, మధ్యాహ్నం 3 గంటలకు రంగంపేట, భద్రకాళి చెరువు కట్ట ప్రాంతాలలో పర్యటిస్తారు. సాయంత్రం ఎస్ఆర్ నగర్ ప్రాంతంలో, ఆ తర్వాత కొలంబో మెడికల్ కాలేజ్ ప్రాంతంలోని బీఆర్ నగర్ పాటు వరద నీటిలో మునిగిన పాంతాలను పరిశీలిస్తారని బీజేపీ ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆది, సోమ, మంగళవారాల్లో వివిధ ఉమ్మడి జిల్లాల్లో భారీవర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ బృందాలు పర్యటించనున్నాయి.

మాపై దుష్ప్రచారం | కాంగ్రెస్‌లోని ఓ కీలక నేత పనే

● కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నామన్న కథనాలు నిరాధారమైనవి
● సీఎం కేసీఆర్‌ను వ్యక్తిగతంగా ఎప్పుడూ కలవలేదు, మాట్లాడలేదు
● నాకు ఎలాంటి వ్యాపారాలు, కాంట్రాక్టులు, భూలావాదేవీలు లేవు
● టీపీసీసీ మాజీ చీఫ్ ఉత్తమ్ దంపతుల వెల్లడి





సాక్షి, హైదరాబాద్: తాము కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నామంటూ వస్తున్న కథనాలను టీపీసీసీ మాజీ అధ్యక్షుడు, ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి దంపతులు తీవ్రంగా ఖండించారు. కాంగ్రెస్‌లో పనిచేయడం, ప్రజలకు సేవ చేయడాన్ని తాము గర్వంగా భావిస్తామని, అయితే పార్టీలో కీలక హోదాలో ఉన్న ఓ నాయకుడే తమపై దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఈ మేరకు శనివారం ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పద్మావతి సంయుక్తంగా ఓ ప్రకటన విడుదల చేశా రు. తమకు పిల్లలు కూడా లేరని, తమ జీవితాన్ని ప్రజాసేవ కే అంకితం చేశామన్న ఉత్తమ్ దంపతులు తమకు ఎలాంటి వ్యాపారాలు, కాంట్రాక్టులు, భూలావాదేవీలు లేవని చెప్పారు. ప్రజాజీవితంలో తప్ప వ్యక్తిగతంగా సీఎం కేసీఆర్‌ను ఎప్పుడూ కలవలేదని, మాట్లాడలేదని స్పష్టం చేశారు.

ప్రకటనలో ఏముందంటే...: 'నేను కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్టు వస్తున్న కథనాలు అసత్యాలు. ప్రజల్లో నా ప్రతిష్టను దిగజార్చేందుకు, పార్టీలో నా స్థానాన్ని తగ్గించేందుకు పార్టీలో కీలక స్థానంలో ఉన్న ఒక నాయకుడే ఇలాంటి వదంతులు వ్యాప్తి చేస్తున్నాడు. కాంగ్రెస్‌కు 30 ఏళ్లుగా సేవ చేస్తున్నందుకు గర్వపడుతున్నా. నా సతీమణి, మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి 2018 అసెంబ్లీ ఎన్నికల్లో వందల ఓట్ల తేడాతో ఓడినప్పటికీ కోదాడలోనే నివాసముంటూ అక్కడి ప్రజలకు సేవలందిస్తున్నారు. టీపీసీసీ ఉపాధ్యక్షురాలిగా తన వంతు బాధ్యత నిర్వర్తిస్తున్నారు. కానీ, రెండేళ్ల నుంచి మమ్మల్ని టార్గెట్ చేసి పరువు నష్టం కలిగించే కథనాలు రావడం తీవ్రంగా బాధిస్తోంది. పార్టీలో జరుగుతున్న కొన్ని పరిణామాల పట్ల నాకు అసంతృప్తి ఉన్నప్పటికీ ఎక్కడా ఈ విషయాలను పంచుకోలేదు. ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అసెంబ్లీలో, స్వాతంత్ర్య దినోత్సవాల సందర్భంగా రాజ్‌భవన్‌లో, తెలంగాణ ఏర్పాటు విషయంలో చిదంబరం నేతృత్వంలో జరిగిన అఖిలపక్ష సమావేశంలో తప్ప నేనెప్పుడూ సీఎం కేసీఆర్‌ను కలవలేదు. ఎప్పుడూ మాట్లాడలేదు. చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో యుద్ధ విమాన పైలట్‌గా ఇండియన్ ఎయిర్‌ఫోర్స్‌లో ప్రాణాలను పణంగా పెట్టి పనిచేయడం గర్వంగా భావిస్తాను. రాష్ట్రపతి భవన్‌లోనూ సీనియర్ ఆఫీసర్‌గా వెంకట్రామన్, శంకర్‌దయాళ్‌శర్మ వద్ద పనిచేశాను. ఉన్నత స్థాయి ఉద్యోగానికి స్వచ్ఛందంగా రాజీనామా చేసి ప్రజాసేవ కోసం కాంగ్రెస్‌లో చేరాను. కాంగ్రెస్ నాయకుడికి సన్నిహితంగా ఉండే రెండు యూట్యూబ్ చానళ్లు, కొన్ని మీడియా సంస్థలు నాపై తప్పుడు కథనాలు ప్రసారం చేస్తున్నాయి' అని ఉత్తమ్‌తోపాటు ఆయన సతీమణి పద్మావతి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

కవిత లిక్కర్ స్కాంపై ప్రశ్నిస్తే సస్పెండ్ చేశారు



జిట్టా బాలకృష్ణారెడ్డి

నాంపల్లి (హైదరాబాద్): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ ఉద్యమకారుడు, సస్పెన్షన్‌కు గురైన బీజేపీ నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి ఆరోపించారు. శనివారం ఆయన గన్‌పార్కు ఎదుట విలేకరులతో మాట్లాడారు. మునుగోడు ఎన్నికల తర్వాత పార్టీ గప్‌చుప్ కావడానికి కారణమేమిటి? పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లిన బండి సంజయ్‌ను ఎందుకు తొలగించారు? ఎమ్మెల్సీ కవిత లిక్కర్ స్కామ్ ఏమైందని ప్రశ్నిస్తే తనను సస్పెండ్ చేశారని ఆరోపించారు. పార్టీని బలహీనపరిచే విధంగా వ్యాఖ్యలు చేసిన ఈటల రాజేందర్, రఘునందన్‌రావు, విజయశాంతి తదితర నేతలపై ఏం చర్యలు తీసుకున్నారో వివరణ ఇవ్వాల్సిన బాధ్యత కిషన్‌రెడ్డికి లేదా అని ప్రశ్నించారు. తానెక్కడా పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడలేదని స్పష్టం చేశారు. తాను ఇతర పార్టీల నేతలతో కిషన్‌రెడ్డి మాదిరిగా లోపా యికారీ ఒప్పందాలు కుదుర్చుకోలే దన్నారు. సీఎం కేసీఆర్ ఆదేశాల తోనే కిషన్‌రెడ్డి తనను బీజేపీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో ఎమ్మెల్సీ కవితను సీబీఐ ఎందుకు అరెస్టు చేయలేదని ప్రశ్నించారు. లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే కవిత కేసును నిర్వీర్యం చేశారని, ఈ ఒప్పందంలో భాగంగానే కిషన్‌రెడ్డికి బీజేపీ అధ్యక్ష పదవి వచ్చిందని జిట్టా వ్యాఖ్యానించారు. హిందుత్వ పార్టీగా చెప్పుకునే బీజేపీ గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌పై సస్పెన్షన్ ఎందుకు ఎత్తివేయటం లేదని ప్రశ్నించారు.

గ్రూప్‌-2 పరీక్షలు వాయిదా వేయాలి: బల్మూరి

సాక్షి, హైదరాబాద్: ఆగస్టు 29, 30 తేదీల్లో జరగనున్న గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని భారత జాతీయ విద్యార్థి సంఘం (ఎన్ఎస్‌యూఐ) రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ డిమాండ్ చేశారు. గురుకులాల ఉద్యోగ పరీక్షలు ఆగస్టు 1 నుంచి 26వ తేదీ వరకు జరుగుతున్న నేపథ్యంలో కనీసం నిరుద్యోగ అభ్యర్థులకు చదువుకునే సమయం కూడా దొరకడం లేదని, గురుకుల పరీక్షల షెడ్యూల్ నేపథ్యంలో గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేయాలని కోరారు. శనివారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆగస్టు 5వ తేదీలోపు గ్రూప్–2 పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించాలని లేదంటే నిరుద్యోగ అభ్యర్థుల పక్షాన ఉద్యమిస్తామని హెచ్చరించారు. అలాగే గురుకులాల్లో నియామకాల కోసం మూడు రోజుల పాటు వరుసగా మూడు పరీక్షలను మూడు వేర్వేరు సెంటర్లలో నిర్వహించడంతో అభ్యర్థులకు చాలా ఇబ్బంది కలుగుతోందని, ఈ నేపథ్యంలో గురుకుల నియామకాల కోసం ఒకే అభ్యర్థి రాయాల్సిన మూడు పరీక్షలను ఒకే పరీక్షా కేంద్రంలో నిర్వహించాలని వెంకట్ ప్రభుత్వాన్ని కోరారు.

బీసీల పక్షాన కాంగ్రెస్‌కు మద్దతివ్వండి

ఆర్.కృష్ణయ్యను కలసిన రాష్ట్ర కాంగ్రెస్ ఇన్‌చార్జి ఠాక్రే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని బీసీ సంఘాల పక్షాన తమకు మద్దతివ్వాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్యను కాంగ్రెస్ పార్టీ కోరింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, మాజీ ఎంపీ వి.హనుమంతరావు శనివారం సాయంత్రం విద్యానగర్‌లోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయానికి వెళ్లి ఆర్. కృష్ణయ్యను కలిశారు. బీసీల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉందని, బీసీల కులగణన చేపట్టాలన్న డిమాండ్‌కు రాహుల్‌గాంధీ మద్దతు ప్రకటించారని వారు గుర్తు చేసి.. తమకు సంఘీభావం తెలపాలని కృష్ణయ్యను కోరారు. ఇందుకు స్పందించిన ఆయన బీసీలకు సంబంధించిన 18 డిమాండ్లను కాంగ్రెస్ నేతల ముందుంచి వాటిని పార్టీ మేనిఫెస్టోలో పెట్టాలని కోరారు. కాగా, వచ్చే ఎన్నికల్లో బీసీల మద్దతు కూడగట్టే వ్యూహంలో భాగంగానే కృష్ణయ్య ఆఫీసుకి, ఇంటికి ఠాక్రే, వీహెచ్ వెళ్లారనే చర్చ గాంధీభవన్ వర్గాల్లో జరుగుతోంది.

రాజకీయాలకు సంబంధం లేదు: కృష్ణయ్య

ఠాక్రే, వీహెచ్‌లతో సమావేశం అనంతరం ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ తమ మధ్య రాజకీయ చర్చ జరగలేదని, బీసీ డిమాండ్లపైనే చర్చ జరిగిందని చెప్పారు. బీసీ సంఘం అధ్యక్షుడిగా మాత్రమే వారు తనను కలిశారని స్పష్టం చేశారు. బీసీలకు సంబంధించిన 18 డిమాండ్లను కాంగ్రెస్ మేనిఫెస్టోలో పెట్టాలని కోరానని, అందుకు కాంగ్రెస్ నేతలు సానుకూలంగా స్పందించారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లో బీసీల పక్షపాతిగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వ్యవహరిస్తున్నారని, అందులో భాగంగానే పార్లమెంటులో వైఎస్సార్‌సీపీ పక్షాన బీసీ బిల్లు పెట్టి 14 పార్టీల మద్దతు కూడగట్టామని వెల్లడించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఠాక్రే చిత్రంలో ఆర్. కృష్ణయ్య, వీహెచ్ తదితరులు

బీసీల పట్ల కాంగ్రెస్ వైఖరి స్పష్టం: ఠాక్రే

ఆర్.కృష్ణయ్యతో చర్చల తర్వాత ఠాక్రే మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలోని ఓబీసీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని, అందుకే కృష్ణయ్యతో మాట్లాడేందుకు తాము వచ్చామన్నారు. బీసీల పట్ల కాంగ్రెస్ వైఖరి చాలా స్పష్టంగా ఉందన్నారు. కాగా, బీసీ సంఘం కార్యాలయం పైనే ఉన్న కృష్ణయ్య నివాసంలోకి ఠాక్రే, వీహెచ్‌లు వెళ్లి కొద్దిసేపు మాట్లాడారు.

ప్రజల కష్టాలు, వాన నష్టాలు పట్టని కేసీఆర్

● బీజేపీ నేత బూర నర్సయ్యగౌడ్ ధ్వజం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో భారీవర్షాలు, వరదలతో ప్రాణ, ఆస్తినష్టం జరుగుతుంటే సీఎం కేసీఆర్ మహారాష్ట్ర రాజకీయాల్లో బిజీగా ఉన్నారని బీజేపీ నేత, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మండిపడ్డారు. ఇక్కడ ప్రజలు వరదల్లో మునిగిపోతుంటే కేసీఆర్ అక్కడ రాజకీయాల్లో మునిగిపోయారని ఎద్దేవా చేశారు. శనివారం ఇక్కడ నర్సయ్యగౌడ్ మీడియాతో మాట్లాడుతూ తనకు రాజకీయ భవిష్యత్ ఇచ్చిన ఉత్తర తెలంగాణ వరదల్లో మునిగిపోయినా కేసీఆర్ పట్టించుకోవడంలేదన్నారు. వరదల్లో మరణించినవారి కుటుంబాలకు వెంటనే పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరంపై ఎంత ఖర్చు చేశారు, దాని వల్ల ఎంత ప్రయోజనం చేకూరింది, సమ్మక్క బ్యారేజి వల్ల లాభమెంత, ఖర్చెంత అనే అంశాలపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికిప్పుడు లోక్‌సభ ఎన్నికలు జరిగితే రాష్ట్రంలో బీజేపీ పది సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంత కష్టపడినా జల్లెడలో నీరు పోసినట్టేనని, నెలరోజుల్లో అది ఖాళీ అవుతుందని వ్యాఖ్యానించారు.

బండికి జాతీయ పదవి.. పార్టీకి ఊతం!

● కార్యకర్తకు గుర్తింపు, గౌరవం: 'సాక్షి'తో బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: బండి సంజయ్‌ను బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమించడంతో ఆయనకు జాతీయ స్థాయిలో ప్రాధాన్యత దక్కిందనే అభిప్రాయాన్ని పార్టీ నాయకులు వ్యక్తం చేస్తున్నారు. రాబోయే 8, 9 నెలల్లో వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతోపాటు లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో (రెండు తెలుగు రాష్ట్రాలతో సహా) సంస్థాగతంగా పార్టీ పటిష్టమయ్యేందుకు ఈ నియామకం జరిగిందని భావిస్తున్నారు. రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలకు సమాయత్తం కావడంలో భాగంగా మరింత దూకుడుగా వెళ్లేందుకు ఈ నియామకం దోహదపడుతుందని అంటున్నారు. గతంలో తెలుగు రాష్ట్రాల నుంచి వెంకయ్యనాయుడు, మురళీధర్‌రావు, రామ్‌మాధవ్, పురందేశ్వరి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులుగా ఉన్నారు. ఇప్పుడు మళ్లీ తెలంగాణకు చెందిన సంజయ్‌కు ఈ అవకాశం లభించింది.

అధికారంలోకి రావడం లక్ష్యం: సాక్షితో బండి సంజయ్

బీజేపీలో ఓ సాధారణ కార్యకర్తకు ప్రధాని లేదా ముఖ్యమంత్రి, పార్టీ అధ్యక్షుడు, జాతీయ పార్టీలో కీలక పదవులు లభిస్తాయనడానికి తన నియామకమే తాజా ఉదాహరణ అని బండి సంజయ్ పేర్కొన్నారు. జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ... 'నేను పార్టీకి అందించిన సేవలకు తగిన గుర్తింపు, గౌరవం లభించింది. పార్టీలో గతంలో ఉన్న 11 మంది జాతీయ ప్రధాన కార్యదర్శుల సంఖ్యను కుదించి 8 చేసినా అందులోనూ నాకు ప్రాతినిధ్యం కల్పించినందుకు ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్ షా, అధ్యక్షుడు జేపీ నడ్డాకు కృతజ్ఞతలు. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, ముఖ్యంగా తెలంగాణలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడం, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి హ్యాట్రిక్ విజయం సాధించి పెట్టేలా రాష్ట్రం నుంచి అత్యధిక ఎంపీ సీట్లలో విజయం సాధించడం వంటివి నా ముందున్న లక్ష్యాలు. జాతీయ నాయకత్వం ఏ బాధ్యతలు అప్పగించినా అంకితభావంతో పూర్తిచేసేందుకు కృషి చేస్తా' అని సంజయ్ తెలిపారు.

త్వరలో బీజేపీలోకి జయసుధ?



సాక్షి, హైదరాబాద్: ఢిల్లీలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా సమక్షంలో సినీ నటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ త్వరలో బీజేపీలో చేరబోతున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ విషయమై తాజాగా కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో ఆమె చర్చలు జరిపినట్లు తెలిసింది. గతంలోనే బీజేపీలో చేరే అంశంపై పార్టీ ముఖ్యులతో జయసుధ ప్రాథమిక చర్చలు జరిపినట్లు పార్టీ నాయకులు వెల్లడించారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో నగరంలోని ఏదో ఒక నియోజకవర్గం నుంచి పోటీకి ఆమె ఆసక్తి కనబరుస్తున్నట్లు సమాచారం. మరో రెండు, మూడు రోజుల్లో మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు బీజేపీలో చేరనున్నట్లు తెలిసింది. మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే సంజీవరావు పార్టీలో చేరనున్నట్లు తెలిసింది. ఇప్పటికే వీరిద్దరూ పార్టీలో చేరే విషయంపై బీజేపీ ముఖ్యనేతలతో సంప్రదింపులు జరిపినట్లు చెబుతున్నారు. ఈ చేరికల కార్యక్రమం హైదరాబాద్‌లో కిషన్‌రెడ్డి, ఇతర ముఖ్యనేతల సమక్షంలో జరగనున్నట్లు తెలుస్తోంది.

వరద బాధితులకు అండగా నిలవండి

● పార్టీ శ్రేణులకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపు..

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాలకు వరదల్లో చిక్కుకొని నిరాశ్రయులైన వారి కుటుంబాలను అన్నివిధాలా ఆదుకోవాలని తెలుగుదేశం పార్టీ శ్రేణులకు టీటీడీపీ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ నుంచి అన్ని జిల్లాల టీడీపీ పార్టీ అధ్యక్షులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాలలో వరద, పంట నష్టం వివరాలను వారిని అడిగి తెలుసుకున్నారు. వరదల్లో చిక్కుకొని ప్రాణాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం వెంటనే ఎక్స్ గ్రేషియా చెల్లించి అన్నివిధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

బండి సంజయ్‌కు ప్రమోషన్

▶ మొదటి పేజీ తరువాయి

పక్కనబెట్టారు. అదేవిధంగా, కార్యదర్శులుగా ఉన్న యూపీ ఎంపీలు వినోద్ సోంకార్, హరీశ్ ద్వివేదిలు కూడా పార్టీ పదవులను పోగొట్టుకున్నారు. ఇంకా, పార్టీ ఉపాధ్యక్షులుగా మైనారిటీ వర్గం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించారు. వీరిలో ఒకరు కేరళకు చెందిన అబ్దుల్లా కుట్టీ, మరొకరు అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ మాజీ వైస్ చాన్స్‌లర్, యూపీ బీజేపీ ఎమ్మెల్సీ మన్సూర్. కాగా, జాతీయ స్థాయిలో బీజేపీ విధానాలు, ఎజెండాకు కీలకంగా ఉన్న సీటీ రవికి ఉద్వాసన పలకడం వెనుక కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ ఘోర పరాజయమే కారణమన్న అభిప్రాయం ఉంది. నాలుగు పర్యాయాలు ఎమ్మెల్యేగా ఎన్నికైన సీటీ రవి కూడా మొన్నటి ఎన్నికల్లో ఓడిపోయారు. ఇంకా కాంగ్రెస్ అధికారంలో ఉన్న ఛత్తీస్‌గఢ్‌లో మరికొద్ది నెలల్లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గిరిజన నేత లతా ఉసెండీకి పార్టీ ఉపాధ్యక్ష పదవి కట్టబెట్టారు. జాతీయ కార్యదర్శులుగా నియమితులైన 9 మందిలో ఏడుగురు పాతవారు కాగా, రాధా మోహన్ అగర్వాల్‌ను కొత్తగా తీసుకున్నారు.

బీజేపీ జాతీయ నూతన పదాధికారుల జాబితా

జాతీయ ఉపాధ్యక్షులు: రమణ్‌సింగ్, వసుంధరా రాజే సింధియా, రఘుబర్ దాస్, సౌదాన్ సింగ్, బైజయంత్ పాండా, సరోజ్ పాండే, రేఖా వర్మ, డీకే అరుణ, ఎం.చుబా ఎట, అబ్దుల్లా కుట్టీ, లక్ష్మీకాంత్ బాజ్‌పేయ్, లతా ఉసెండీ, తారిక్ మన్సూర్.

జాతీయ ప్రధాన కార్యదర్శులు: అరుణ్ సింగ్, కైలాశ్ విజయవర్గీయ, దుష్యంత్ కుమార్ గౌతమ్, తరుణ్ ఛుగ్, వినోద్ తావడే, సునీల్ బన్సల్, బండి సంజయ్‌కుమార్, రాధా మోహన్ అగర్వాల్.

జాతీయ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు): బీఎల్ సంతోష్

జాతీయ సహ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు): శివప్రకాశ్

జాతీయ కార్యదర్శులు: విజయా రాహట్కర్, సత్య కుమార్, అరవింద్ మీనన్, పంకజా ముండే, నరేంద్ర సింగ్ రైనా, అల్కా గుర్జర్, అనుపమ్ హాజ్రా, ఓం ప్రకాశ్ ధుర్వే, రుతురాజ్ సిన్హా, ఆశా లాకడా, కామాఖ్యా ప్రసాద్ తాసా, సురేంద్ర సింగ్ నాగర్, అనిల్ ఆంటోని.

కోశాధికారి: రాజేశ్ అగర్వాల్

సహ కోశాధికారి: నరేశ్ బన్సల్

కేసీఆర్ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీ

మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత



ఇల్లెందులో పర్యటిస్తున్న ఎంపీ కవిత

ఇల్లెందు: సీఎం కేసీఆర్ ఆదేశిస్తే ఎక్కడి నుంచైనా పోటీచేస్తానని, ఆయన నిర్ణయమే తనకు శిరోధార్యమని మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవిత అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులో శనివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఇప్పటివరకు ఎమ్మెల్యే, ఎంపీగా విజయం సాధించానని, పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి బంజారా మహిళగా తనకు గుర్తింపు లభించిందని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా పోటీ చేయాలని కార్యకర్తలు, ప్రజలు తనపై ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. మహబూబాబాద్, డోర్నకల్, ఇల్లెందు అసెంబ్లీ స్థానాలు తన పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోనే ఉన్నందున, ఆయా ప్రాంతాల ప్రజలందరికీ సుపరిచితురాలినేనని పేర్కొన్నారు. కాగా, ఎస్టీ జాబితా నుంచి బంజారాలను తొలగించాలన్న ఎంపీ సోయం బాపురావు వ్యాఖ్యలపై ఆమె మండిపడ్డారు. గిరిజనులకు నేరుగా లబ్ధి చేకూరేవిధంగా సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, ఈ తరుణంలో బాపురావు వైషమ్యాలు రెచ్చగొట్టడం దారుణమని అన్నారు. అంతకుముందు ఎంపీ కవిత ఇటీవలి వర్షాలకు కూలిపోయిన ఇళ్లను సందర్శించి, బాధితులను పరామర్శించారు.

ప్రజలతో మూడు ముక్కలాట ఆడుతున్నారు

● బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎంలది ముక్కోణపు ప్రేమకథ: కిషన్‌రెడ్డి
● బీజేపీ.. బీఆర్ఎస్‌తో ఎప్పటికీ కలవదని స్పష్టీకరణ
● బీజేపీలో చేరిన మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డి
● త్వరలోనే కేసీఆర్ కుటుంబం నుంచి తెలంగాణకు విముక్తి: తరుణ్ ఛుగ్



రంగారెడ్డి, ఆకుల రాజేందర్, జైపాల్‌రెడ్డి, లక్ష్మారెడ్డిల చేరిక సందర్భంగా వేదికపై అభివాదం చేస్తున్న బీజేపీ ముఖ్యనేతలు డీకే అరుణ, తరుణ్ ఛుగ్, ఈటల, కిషన్‌రెడ్డి, జవదేకర్, లక్ష్మణ్ తదితరులు

సాక్షి, న్యూఢిల్లీ: బీఆర్ఎస్, కాంగ్రెస్, ఎంఐఎం పార్టీలది ముక్కోణపు ప్రేమకథ అని... ఈ మూడు పార్టీలూ కలిసి తెలంగాణ ప్రజల జీవితాలతో మూడు ముక్కలాట ఆడుతున్నాయని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ధ్వజమెత్తారు. తెలంగాణలో ఆ మూడు పార్టీలు నాటకాలు ఆడు తూ అనేక రకాలుగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. తెలంగాణలో ఎన్నికలకు ముందు లేదా తర్వాత కలిసి ప్రయాణం చేసే ఈ మూడు పార్టీల మధ్య ముక్కోణపు ప్రేమ కథ నడుస్తోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రజలకు ఆయా పార్టీల అసలు స్వరూపం తెలిసిపోయిందని, అందుకే బీజేపీకి పెద్ద ఎత్తున మద్దతు లభిస్తోందన్నారు. శనివారం ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆకుల రాజేందర్ (మల్కాజ్‌గిరి), నేతలు జైపాల్ రెడ్డి (జహీరాబాద్), లక్ష్మారెడ్డి (రంగారెడ్డి) కాషాయ కండువా కప్పుకున్నారు. కిషన్ రెడ్డి, పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్ ఛుగ్, ఎన్నికల ఇన్‌చార్జి ప్రకాశ్ జవదేకర్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ లక్ష్మణ్ సమక్షంలో ఈ నలుగురు నాయకులకు పార్టీ సభ్యత్వ రశీదు అందించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీలో దశాబ్దాలుగా పనిచేసిన వారు బీజేపీలో చేరారని... మరిన్ని చేరికలు ఉండేలా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు వెళతామన్నారు.

జిట్టా ఆరోపణలకు స్పందించను

ఏ రోజు కూడా బీజేపీ, బీఆర్ఎస్‌తో కలిసి పనిచేయలేదని.. భవిష్యత్తులోనూ పనిచేయబోదని కిషన్‌రెడ్డి స్పష్టంచేశారు. బీఆర్ఎస్ పార్టీని గద్దె దించడమే లక్ష్యంగా బీజేపీ పనిచేస్తుందన్నారు. కాగా జిట్టా బాలకృష్ణారెడ్డి ఇచ్చే సర్టిఫికెట్ తనకు అవసరం లేదని.. అతను చేసే ఆరోపణలపై జవాబు చెప్పాల్సిన అవసరం కూడా లేదని కిషన్‌రెడ్డి వ్యాఖ్యానించారు. బీజేపీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్ ఛుగ్ మాట్లాడుతూ, 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు నమ్మి ఓట్లు వేస్తే కాంగ్రెస్ ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌లోకి వెళ్ళారని, అందుకే ఇప్పుడు తెలంగాణ ప్రజల్లో కాంగ్రెస్ పట్ల నమ్మకం పోయిందన్నారు. త్వరలోనే కేసీఆర్ కుటుంబం నుంచి తెలంగాణకు విముక్తి లభిస్తుందన్నారు.

చైతన్యంలేని రాహుల్ నేతృత్వంలో ఎలా పనిచేస్తాం

బీజేపీ కండువా కప్పుకున్న అనంతరం మాజీ ఎమ్మెల్సీ రంగారెడ్డి మాట్లాడుతూ, ఇన్నేళ్లలో కనీసం 50 సార్లు రాహుల్ గాంధీని కలిసినా... కనీసం తనను గుర్తుపట్టలేరన్నారు. రాజకీయ చైతన్యం లేని రాహుల్‌గాంధీలాంటి నేత నేతృత్వంలో ఎవరైనా ఎలా పని చేస్తారని ప్రశ్నించారు. ఒరిజినల్ కాంగ్రెస్ నేతలు ఇప్పుడు బీజేపీలో ఉన్నారని... డూప్లికేట్లు, అన్ని పార్టీలు తిరిగొచ్చిన నేతలు, మిక్స్‌డ్ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో ఉన్నారని రంగారెడ్డి వ్యాఖ్యానించారు.

పురపాలక కమిషనర్లకు పదోన్నతులు, బదిలీలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలువురు మునిసిపల్ కమిషనర్లకు పదోన్నతులు ఇవ్వగా, మరికొందరిని బదిలీ చేశారు. ఈ మేరకు 27 మంది అధికారులకు సంబంధించి ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గ్రేడ్‌-1 మునిసిపల్ కమిషనర్లుగా పదోన్నతి పొందిన ఆరుగురిలో ఇస్లావత్ నమ్యను పీర్జాదిగూడ కమిషనర్‌గా బదిలీ చేయగా, జి.ఆంజనేయులును జీహెచ్‌ఎంసీకి తిరిగి పంపించారు. బి.రాజేష్‌కుమార్‌ను జీహెచ్‌ఎంసీకి పోస్టింగ్ ఇవ్వగా, బి.గోపాల్‌రావును నిజామాబాద్ డిప్యూటీ కమిషనర్‌గా నియమించారు. కోరుట్ల మునిసిపల్ కమిషనర్ మహ్మద్ అయాజ్‌ను సిరిసిల్లకు పదోన్నతిపై పంపించారు. కె.లక్ష్మిని జీహెచ్‌ఎంసీకి తిరిగి పంపించారు. గ్రేడ్ -2 కమిషనర్లుగా పదోన్నతి పొందిన వారిలో టి.మల్లికార్జున్‌ను సుల్తానాబాద్‌కు, బి.నరేష్‌బాబుకు కరీంనగర్ అసిస్టెంట్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. పెద్దపల్లి మునిసిపల్ కమిషనర్ ఎం.శ్రీనివాస్‌ను పెద్దపల్లి మెప్మా పీడీగా నియమించారు. జి.అనిల్ బాబును జగిత్యాల కమిషనర్‌గా నియమించారు. స్పెషల్ గ్రేడ్ మునిసిపల్ కమిషనర్‌గా పదోన్నతి పొందిన శ్రీపాద రామేశ్వర్ నిజామాబాద్ కార్పొరేషన్ కార్యదర్శిగా నియమితులయ్యారు. పెద్దపల్లి మెప్మా పీడీగా ఉన్న శ్రీపాద ఈశ్వర్‌ను ఉన్నతాధికారులకు రిపోర్టు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. వీరు కాకుండా మరో 11 మంది కమిషనర్లను వివిధ మునిసిపాలిటీలు, కార్పొరేషన్లకు బదిలీ చేశారు. ఇటీవల బదిలీ చేసిన ముగ్గురు కమిషనర్లను వివిధ కారణాలతో వేరే చోట్లకు బదిలీ చేస్తూ పోస్టింగ్‌లు ఇచ్చారు. నందికొండకు బదిలీ అయిన కె.వేణుమాధవ్‌ను కొత్తపల్లి మునిసిపాలిటీకే తిరిగి పంపిస్తూ ఉత్తర్వులు ఇవ్వగా, లక్సెట్టిపేట నుంచి కొత్తపల్లికి బదిలీపై వచ్చిన ఎ.వెంకటేశ్‌ను పెద్దపల్లికి బదిలీ చేశారు. పదోన్నతిపై జీహెచ్‌ఎంసీ డీసీగా బదిలీ చేసిన సి.సత్యబాబుకు నిజామాబాద్ అదనపు కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు.

'రేషన్ డీలర్లకు రూ.50 వేల గౌరవ వేతనం ఇవ్వాలి'

సాక్షి, న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఉన్న 5 లక్షల మంది రేషన్ డీలర్లకు నెలకు రూ.50 వేల గౌరవ వేతనం ఇవ్వాలని, లేని పక్షంలో క్వింటాలుకు రూ.440లు కమీషన్ ఇవ్వాలని రేషన్ డీలర్ల సంఘం జాతీయ అధ్యక్షుడు కాచం క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. ఈ అంశాల పరిష్కారం కోసం శనివారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కలిసి వినతిపత్రాన్ని అందించారు. అలాగే రేషన్ షాపుల్లో ఇచ్చే నిత్యావసర వస్తువులు పెంచాలని, దేశవ్యాప్తంగా రేషన్ వ్యవస్థ ఒకే విధంగా ఉండాలన్నారు.

క్లుప్తంగా...

సంపూర్ణంగా కోలుకున్న లాలూ

న్యూఢిల్లీ: కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్స తర్వాత ఆర్‌జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ అనారోగ్యం నుంచి సంపూర్ణంగా కోలుకున్నారు. చాలా హుషారుగా బ్యాడ్మింటన్ ఆడుతూ కనిపించారు. లాలూ ఆడుతున్న వీడియోని ఆయన కుమారుడు, బిహార్ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''దేనికీ భయపడరు. దేనికీ తలవంచరు. పోరాడారు. పోరాడుతూనే ఉంటారు. జైల్లో పెట్టినా బెదరలేదు. అంతిమంగా విజయమే సాధించారు'' అని తేజస్వి యాదవ్ క్యాప్షన్ పెట్టారు.

నేడే పీఎస్‌ఎల్‌వీ సీ-56 ప్రయోగం



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): పీఎస్‌ఎల్‌వీ సీ-56 ఉపగ్రహ వాహకనౌకకు శనివారం ఉదయం 5.01 గంటలకు కౌంట్‌డౌన్ ప్రక్రియ మొదలైంది. భారత అంతరిక్ష పరిశోధనాసంస్థ (ఇస్రో), న్యూస్పేస్ ఇండియా తిరుపతి జిల్లా సతీష్ ధవన్ స్పేస్ సెంటర్‌లోని మొదటి ప్రయోగ వేదిక నుంచి ఆదివారం ఉదయం 6.31 గంటలకు దీనిని ప్రయోగించనున్నారు. 25.30 గంటలపాటు కౌంట్‌డౌన్ సాగుతుంది. శుక్రవారం సాయంత్రం ఇస్రో ఛైర్మన్ ఎస్ సోమనాథ్ షార్‌కు చేరుకున్నారు. శాస్త్రవేత్తలతో సమీక్ష నిర్వహించి కౌంట్‌డౌన్ ప్రక్రియను ప్రారంభించారు. ప్రస్తుతం ఈ ప్రక్రియ సజావుగా కొనసాగుతోంది. ఇందులో భాగంగా రాకెట్‌కు నాలుగో దశలో 0.8 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపే ప్రక్రియను చేపట్టారు. శనివారం రాత్రికి రాకెట్‌కు రెండో దశలో 41 టన్నుల ద్రవ ఇంధనాన్ని నింపుతారు. ఈ ప్రయోగంలో సింగపూర్‌కు చెందిన 7 ఉపగ్రహాలను నియో ఆర్బిట్‌లోకి ప్రవేశ పెట్టనున్నారు.



హరియాణా నుంచి వచ్చిన మహిళలతో సరదాగా ముచ్చటిస్తున్న సోనియా గాంధీ, ప్రియాంక



తాము తెచ్చిన తినుబండారాలను రాహుల్‌కు తినిపిస్తున్న దృశ్యం

మీరే పిల్లను చూడండి..!

రాహుల్ పెళ్లి ప్రస్తావన తెచ్చిన హరియాణా మహిళా రైతులతో సోనియా గాంధీ ముచ్చట్లు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ పెళ్లి ప్రస్తావన మరోసారి నవ్వులు పూయించింది. హరియాణాకు చెందిన కొందరు మహిళలు ఢిల్లీలోని టెన్ జన్‌పథ్‌కు వచ్చి సోనియాగాంధీ కుటుంబంతో కాసేపు గడిపారు. వారిని సాదరంగా ఆహ్వానించిన గాంధీ కుటుంబం ఆతిథ్యమిచ్చింది. ఆ మహిళలతో కలిసి సోనియా, ప్రియాంక, రాహుల్ భోజనాలు చేశారు. ఆ తర్వాత కాసేపు వారితో ముచ్చటించారు. వారి కష్టసుఖాలు అడిగి తెలుసుకున్నారు. ఓ మహిళ సోనియాతో ''రాహుల్‌కి పెళ్లి చేద్దామా'' అని అడిగారు. దానికి సోనియా నవ్వుతూ ''మీరే పిల్లని చూడండి'' అని వాళ్లతో చెప్పారు. పక్కనే ఉండి ఇదంతా వింటున్న రాహుల్ ''అవుతుంది. అవుతుంది'' అని అన్నారు. దీంతో ప్రియాంక రాహుల్ స్వీట్‌గా కనిపిస్తున్నా చాలా కొంటెవాడని చెప్పారు. వారి సమావేశం అంతా ఆహ్లాదకరమైన వాతావరణంలో సాగింది. రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో పాల్గొన్నప్పుడు హరియాణా సోనిపట్ జిల్లాకు చెందిన మహిళలతో ముచ్చటించారు. వ్యవసాయ క్షేత్రాల్లో మహిళా కార్మికులతో కలిసి నాట్లు వేశారు. తాము ఇప్పటివరకు దేశ రాజధాని ఢిల్లీని చూడలేదని వారు చెబితే అప్పట్లోనే రాహుల్ వారికి ఢిల్లీకి పిలుస్తానని హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు వారికి ఢిల్లీ చూపించాక తమ నివాసంలో భోజన ఏర్పాట్లు చేశారు. కొందరు మహిళలు రాహుల్‌కు ప్రేమగా తినిపించారు. దీనికి సంబంధించిన వీడియోని రాహుల్ సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''మా ఇంటికి ప్రత్యేక అతిథులు వచ్చారు. ఈ రోజు మా అందరికీ బాగా గుర్తుండిపోతుంది. వారితో కలిసి భోజనం చేశాం. ముచ్చట్లు చెప్పుకున్నాం. వారంతా మాకు ఎంతో అమూల్యమైన కానుకలు ఇచ్చారు. దేశీ నెయ్యి, స్వీట్ లస్సీ, ఇంట్లో చేసిన ఊరగాయలు ఎంతో ప్రేమతో ఇచ్చారు'' అని రాహుల్ ట్వీట్ చేశారు. ఆ మహిళలతో కలిసి సోనియా, ప్రియాంక స్టెప్పులు వేశారు.

ఇదీ నేపథ్యం...

నా ఇంటిని ప్రభుత్వం లాగేసుకుంది

జూలై 8న భారత్ జోడో యాత్రలో భాగంగా రాహుల్ గాంధీ హరియాణాలోని సోనిపట్ జిల్లా మదినా గ్రామానికి వెళ్లారు. అక్కడి గ్రామస్తులతో మాట్లాడారు. వ్యవసాయ క్షేత్రాల్లో రైతులు, రైతు కూలీలతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కొందరు మహిళలు ఢిల్లీలోని రాహుల్ సొంతింటిని గురించి అడిగారు. అందుకు రాహుల్..తనకు సొంతిల్లు లేదని, దానిని ప్రభుత్వం తీసేసుకుందని బదులిచ్చారు. ఢిల్లీలోని తన సోదరి ప్రియాంకా గాంధీ వాద్రాకు ఫోన్ చేశారు. రైతు మహిళలు భోజనానికి రావాలనుకుంటున్నారని చెప్పారు...ఇదంతా 12 నిమిషాల నిడివున్న వీడియోలో ఉంది.



వారితో కలిసి నృత్యం చేస్తూ..

ఆ పాప నా మనవరాలే : బైడెన్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కుటుంబ వ్యవహారంపై గత కొన్నాళ్లుగా జరుగుతున్న చర్చకు ఆయన ఎట్టకేలకు తెర దించారు. నేవీ జాన్ రాబర్ట్స్ అనే నాలుగేళ్ల చిన్నారి తన మనవరాలేనని అంగీకరించారు. ఆ పాప తన ఏడవ మనవరాలని ఒక ప్రకటనలో వెల్లడించారు. '' నా కుమారుడు హంటర్ బైడెన్, లండెన్ రాబర్ట్స్‌లకు 2018లో కలిగిన సంతానమే చిన్నారి నేవీ. హంటర్, లండెన్‌లు తమ కుమార్తె క్షేమం కోసం వారిద్దరి మధ్య సంబంధాలను పెంపొందించుకునే ప్రయత్నాలు చేస్తున్నారు'' అని ఆ ప్రకటనలో చెప్పారు. ఇదేమీ రాజకీయ వ్యవహారం కాదని, కుటుంబ వ్యవహారమని స్పష్టం చేశారు. నేవీతో పాటుగా తమ మనవలు, మనవరాళ్లు అందరికీ అంతా మంచి జరగాలని తాను, జిల్ బైడెన్ కోరుకుంటున్నామని బైడెన్ పేర్కొన్నారు. నేవీ రాబర్ట్స్ పెంపకం బాధ్యత తలపై తల్లి లండెన్ రాబర్ట్ కోర్టుకెక్కిన సమయంలో వారిద్దరి మధ్య సంబంధం వెలుగులోకి వచ్చింది. అప్పట్లోనే డీఎన్ఏ పరీక్షలు నిర్వహించిన కోర్టు నేవీ తండ్రి హంటర్ బైడెనేనని నిర్ధారించింది. హంటర్ బైడెన్ 2021లో తాను రాసిన పుస్తకంలో లండెన్‌తో సంబంధం గురించి రాశారు. డ్రగ్స్‌కు బానిసగా ఉన్న సమయంలో ఆమె తన జీవితంలోకి వచ్చిందని ఆ తర్వాత ఆమెని మర్చిపోయానని ఆ పుస్తకంలో రాశారు. అయితే కోర్టు ఆదేశాల మేరకు పాప బాధ్యతను తాను కూడా తీసుకున్నానని అందులో రాసుకొచ్చారు. ఇంత జరిగినా అధ్యక్షుడు బైడెన్ ఈ వ్యవహారంపై స్పందించకపోవడం చిన్నారి నేవీని మనవరాలిగా స్వీకరించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో బైడెన్ ఈ ప్రకటన చేశారు.



బైడెన్ హంటర్



నేవీ

ఆర్‌టీఐ దరఖాస్తుకు 40 వేల పేజీల సమాధానం

ఎస్‌యూవీలో నింపుకుని తీసుకెళ్లిన దరఖాస్తుదారు

ఇండోర్: సమాచార హక్కు చట్టం(ఆర్‌టీఐ)కింద అడిగిన ప్రశ్నకు అధికారులు 40 వేల పేజీల సమాధానం ఇచ్చారు. దీంతో, దరఖాస్తుదారు వాటన్నిటినీ ఎస్‌యూవీ వాహనంలో కుక్కి ఇంటికి తీసుకెళ్లాల్సి వచ్చింది. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌లో ఘటన చోటుచేసుకుంది. కోవిడ్ మహమ్మారి ప్రబలిన సమయంలో కొనుగోలు చేసిన మందులు, వైద్య పరికరాలు, అనుబంధ సామగ్రికి సంబంధించిన వివరాలు కోరుతూ ధర్మేంద్ర శుక్లా అనే వ్యక్తి ఇండోర్ ప్రధాన వైద్య, ఆరోగ్య అధికారి(సీఎంహెచ్‌వో)కు దరఖాస్తు చేసుకున్నా రు. నిబంధనల ప్రకారం నెల రోజుల్లోగా అధికారుల నుంచి ఆయనకు సమాధానం రాలేదు. దీంతో, శుక్లా మొదటి అప్పిలేట్ అధికారి డాక్టర్ శరద్‌గుప్తా దృష్టికి తీసుకెళ్లారు. సమాచారాన్ని ఉచితంగా శుక్లాకు అందజేయాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సీఎంహెచ్‌వో నుంచి అందిన సమాచారం మేరకు శుక్లా కార్యాలయానికి వెళ్లారు. అధికారులు ఆయనకు 40 వేల పేజీల సమాచారాన్ని అందజేశారు. వాటన్నిటినీ తన ఎస్‌వీయూలో కుక్కి ఇంటికి తీసుకెళ్లారు. తన వాహనంలో డ్రైవర్ సీటుకు మినహా అంతా కాగితాలతోనే నిండిపోయిందని శుక్లా శనివారం తెలిపారు. అధికారులు అడిగిన సమాచారాన్ని నెల రోజుల్లోగా ఇవ్వనందునే నిబంధనల ప్రకారం పేజీకి రూ.2 చొప్పున రుసుము ఇవ్వలేదని కూడా ఆయన వివరించారు. కాగా, దరఖాస్తు దారు అడిగిన సమాచారాన్ని సకాలంలో అందివ్వకుండా ప్రభుత్వ ఖజానాకు రూ.80 వేల మేరకు నష్టం కలిగేందుకు కారణమైన అధికారిపై తగు చర్యలు తీసుకోవాలంటూ సీఎంహెచ్‌వోను ఆదేశించినట్లు అప్పిలేట్ అధికారి తెలిపారు.

ఎన్‌ఈపీలో ప్రతి భారతీయ భాషకు తగు గౌరవం



ఢిల్లీలో అఖిలభారతీయ శిక్షా సమాగంలో చిన్నారులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వెల్లడి

న్యూఢిల్లీ: నూతన జాతీయ విద్యా విధానం (ఎన్‌ఈపీ) ద్వారా దేశంలోని ప్రతి భాషకూ సముచిత గౌరవం లభిస్తుందని ప్రధాని మోదీ చెప్పారు. స్వార్థ ప్రయోజనాల కోసం భాషపై రాజకీయం చేసే వారు తమ దుకాణాలను మూసేసుకోవాలని ఆయన వ్యాఖ్యానించారు. శక్తి సామర్థ్యాల ఆధారంగా కాకుండా భాష ప్రాతిపదికన ప్రతిభను అంచనా వేయడం వల్ల విద్యార్థులకు తీరని అన్యాయం జరుగుతోందని చెప్పారు. ఎన్‌ఈపీ ప్రారంభమై మూడో వార్షికోత్సవా న్ని పురస్కరించుకుని ఏర్పాటైన 'అఖిల భారతీయ శిక్షా సమాగమ్'నుద్దేశించి ఆయన ప్రసంగించారు. 'మాతృభాషలో విద్యా బోధన ద్వారా భారతీయ విద్యార్థులకు న్యాయం చేసే కొత్త రూపానికి నాంది పలుకుతోంది. సామాజిక న్యాయం దిశగా ఇది చాలా ముఖ్యమైన అడుగు'అని ప్రధాని అన్నారు. ప్రపంచంలోని అనేక భాషలు, వాటి ప్రాముఖ్యతను ప్రస్తావిస్తూ ప్రధానమంత్రి.. అనేక అభివృద్ధి చెందిన ముఖ్యంగా యూరప్ దేశాలు విద్యాబోధన స్థానిక భాషల్లో జరుగుతున్నందునే ఒక అడుగు ముందుకు వేశాయని చెప్పారు. మన దేశంలో అనేక ప్రాచీన భాషలున్నప్పటికీ, వాటిని వెనుకబాటుకు చిహ్నంగా చూపుతు న్నారని, ఇంగ్లిష్ మాట్లాడలేని వారిని విస్మరించారని, వారి ప్రతిభను గుర్తించడం లేదని మోదీ విచారం వ్యక్తం చేశారు. 'ఫలితంగా గ్రామీణ ప్రాంతాల్లోని చిన్నారులు ఎక్కువగా నష్టపోతున్నారు. ఎన్‌ఈపీ రాకతో దేశం ఇప్పుడు ఈ నమ్మకాన్ని విస్మరించడం ప్రారంభించింది. ఐక్యరాజ్యసమితిలో కూడా నేను భారతీయ భాషలోనే మాట్లాడతాను' అని చెప్పారు. సామాజిక శాస్త్రాల నుంచి ఇంజినీరింగ్ విద్య వరకు అన్ని సబ్జెక్టుల్లోనూ భారతీయ భాషల్లోనే బోధిస్తున్నారని తెలిపారు. భాషపై విద్యార్థులు పట్టుసాధించగలిగితే, ఎలాంటి అవరోధాలు లేకుండా వారిలో నైపుణ్యం, ప్రతిభ బయటికొస్తాయని ప్రధాని అన్నారు. ప్రపంచం భారతదేశాన్ని కొత్త అవకాశాల వేదికగా చూస్తోంది. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) క్యాంపస్‌లను ఏర్పాటు చేయాలంటే అనేక దేశాలు కేంద్ర ప్రభుత్వాన్ని సంప్రదిస్తున్నాయని వెల్లడించారు. ఇప్పటికే టాంజానియా, అబుధాబిల్లో ఐఐటీ క్యాంపస్‌లు నెలకొల్పారని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ శ్రీ (ఎస్‌హెచ్‌ఆర్‌ఐ) పథకం కింద మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ నిధులను విడుదల చేశారు.

నెలకు రూ.5లక్షలు చొప్పున 25 ఏళ్లపాటు

భారతీయుడిని వరించిన లాటరీ




దుబాయ్: యూఈఏలో ఉంటున్న ప్రవాస భారతీయుడిని అనుకోని అదృష్టం వరించింది. ఆయన కొనుగోలు చేసిన లాటరీ టికెట్ బంపర్ ఆఫర్ గెలుచుకుంది. నెలకు రూ.5.5 లక్షల చొప్పున 25 ఏళ్లపాటు అందుకునే అవకాశం లభించింది. ఉత్తరప్రదేశ్‌లోని లక్నోకు చెందిన మహ్మద్ అదిల్ ఖాన్ ఆర్కిటెక్టుగా దుబాయ్‌లో పనిచేస్తున్నారు. ఆయన ఇటీవల ఫాస్ట్5 గ్రాండ్ లాటరీ టికెట్ కొనుగోలు చేశారు. ఈ నెల 22న తీసిన డ్రాలో ఆదిల్ టిక్కెట్ మొదటి బహుమతి గెలుచుకుంది. దీని కింద ఆదిల్‌కు నెలకు 25 వేల దిర్హామ్‌లు(సుమారు రూ.5.5 లక్షలు) వచ్చే 25 ఏళ్లపాటు అందుతుంది. ఈ విషయం తెలిసిన ఆదిల్ ఆనందానికి అవధుల్లేకుండా పోయాయి. 'నా కష్టాలు తీరాయి. వృద్ధులైన తల్లిదండ్రులతోపాటు తమ్ముడు చనిపోవడంతో అతడి కుటుంబ భారం కూడా నాపైనే పడింది. నాకు భార్య, ఒక కొడుకు ఉన్నాడు. ఈ డబ్బుతో ఇక్కడే ఇల్లు కొనుక్కుంటాం. నా కుటుంబాన్ని యూఏఈకి తీసుకువస్తా'అని ఆదిల్ అంటున్నారు. 'నేను లాటరీ టికెట్ కొనడం, దానికి ఇంత భారీ ప్రైజ్ దక్కడం ఇదే మొదటిసారి'అని ఆదిల్ తెలిపారు. ఈయన 2018లో సౌదీ అరేబియా నుంచి దుబాయ్ వెళ్లారు.

'ఇండియా' కూటమి భేటీ వాయిదా?

న్యూఢిల్లీ: ముంబైలో ఆగస్టులో జరగాల్సిన ప్రతిపక్ష ఇండియా కూటమి నేతల భేటీ సెప్టెంబర్ మొదటి వారానికి వాయిదా పడే అవకాశాలు కన్పిస్తున్నాయి. కూటమిలోని కొందరు నేతలు ఇతర కార్యక్రమాలతో బిజీగా ఉన్నామంటున్నందున ఆగస్టు 25, 26వ తేదీల్లో సమావేశం జరక్కపోవచ్చని విశ్వసనీయ వర్గాలంటున్నాయి. 2024 లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని ఢీకొట్టే లక్ష్యంగా ప్రతిపక్ష పార్టీల నేతల మొదటి రెండు సమావేశాలు పట్నా, బెంగళూరుల్లో జరిగిన విషయం తెలిసిందే.

ఫ్లాట్‌కు అడ్వాన్స్ రూ.25 లక్షలా!

- షాకైన బెంగళూరు టెక్ కంపెనీ సీఈవో
- పెద్ద ఎత్తున స్పందించిన నెటిజన్లు



బెంగళూరు: ఫ్లాట్ అద్దె అడ్వాన్సు రూ.25 లక్షలంటూ వచ్చిన ట్వీట్‌పై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. కోవిడ్ అనంతరం టెక్ ఉద్యోగులు వర్క్‌ఫ్రం హోం నుంచి తిరిగి ఆఫీసులకు వస్తుండటంతో బెంగళూరులో ఇళ్ల అద్దెలు ఏ స్థాయిలో పెరిగాయనేందుకు ఉదాహరణ ఇది. నగరంలోని హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లో ఓ ఫ్లాట్‌కు అద్దె నెలకు రూ.2.5 లక్షలు కాగా, అడ్వాన్స్ రూ.25 లక్షలంటూ ఓ వ్యక్తి చేసిన ట్వీట్‌కు పెద్ద సంఖ్యలో యూజర్లు ఛలోక్తులు సంధించడంతోపాటు మండిపోతున్న ధరలపై ఆందోళన వ్యక్తం చేశారు. కరోనా అనంతరం ఐటీ కంపెనీలు వర్క్ ఫ్రం హోంతోపాటు ఆఫీసుల్లోనూ విధులకు హాజరవ్వాలంటూ ఉద్యోగులకు ఆప్షన్ ఇచ్చాయి. చాలా వరకు కంపెనీలు మళ్లీ ఆఫీసులకొచ్చి డ్యూటీ చేయాలంటూ ఆదేశాలిచ్చాయి. ఉద్యోగులు తిరిగి ఆఫీసులకు చేరుతుండటంతో ఇళ్ల అద్దెలకు ఒక్కసారిగా రెక్కలొచ్చాయి. ఖరీదైన ప్రాంతాల్లోనైతే యజమానులు మరీ ఎక్కువగా డిమాండ్ చేస్తున్నారు. ఇదే విషయాన్ని తేజస్వీ శ్రీవాస్తవ అనే టెక్ కంపెనీ సీఈవో ట్విట్టర్‌లో ప్రస్తావించారు. హెచ్‌ఎస్‌ఆర్ లేఔట్‌లోని 4 బీహెచ్‌కే ఫ్లాట్‌కు నెల వారీ రెంట్ రూ.2.5 లక్షలు, డిపాజిట్ రూ.25 లక్షలంటూ ఉన్న ప్రకటనను చూసి ఆయన షాకయ్యారు. అడ్వాన్స్‌కు అవసరమైన మొత్తానికి లోన్ ఆప్షన్ కూడా ఉండటం ఆయన్ను మరింత షాక్‌కు గురి చేసింది. ఆయన ఈ ప్రకటనను స్క్రీన్ షాట్ తీసి ట్విట్టర్‌లో పెట్టారు. 'కిడ్నీ అమ్ముకోవడానికి కూడా ఆప్షన్ ఉంటే బాగుండేది'అంటూ శ్రీవాస్తవ క్యాప్షన్ ఇచ్చారు. ఆ ట్వీట్లపై కామెంట్లు పోటెత్తాయి. కొందరు నెటిజన్లు ఇంటి అద్దెలపై ఆగ్రహాన్ని వ్యక్తం చేయగా ఇంకొందరు రుణం కోసం దరఖాస్తు చేసుకునే ఆప్షన్‌పై మండిపడ్డారు.చివరి రెండు సున్నాల ముందు చుక్క పెట్టడం మరిచిపోయారేమో అంటూ మరో వ్యక్తి వ్యంగ్యంగా కామెంట్ చేశారు.

బాణాసంచా యూనిట్‌లో పేలుడు

తమిళనాట 8 మంది మృతి



హోసూరు: తమిళనాడులోని క్రిష్ణగిరి జిల్లాలో ఘోర విషాదం చోటుచేసుకుంది. క్రిష్ణగిరి పట్టణంలో ఓ టపాకాయల తయారీ యూనిట్‌లో పేలుడు సంభవించి 8 మంది మృతి చెందగా, మరో 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. క్రిష్ణగిరి పాతపేటకు చెందిన రవి అదే ప్రాంతంలో అనధికారికంగా టపాకాయల తయారీ యూనిట్‌ను నిర్వహిస్తున్నాడు. ఇందులో కుటుంబ సభ్యులతో కలిపి 10 మందికి పైగా పనిచేస్తున్నారు. శనివారం ఉదయం 9.45 గంటల ప్రాంతంలో ఆ భవనంలో భారీ విస్ఫోటం సంభవించింది. ఆ తాకిడికి భవనంతో పాటు పక్కనే ఉన్న మూడిళ్లు నేలమట్టమయ్యాయి. కొన్ని ద్విచక్ర వాహనాలు తుక్కుతుక్కయ్యాయి. ప్రమాదంలో యజమాని రవి, కొడుకు రుతీష్, కూతురు రుతిక, ముగ్గురు పనివారు, అలాగే దగ్గరలో టీ హోటల్ నిర్వాహకులు ఇద్దరితో కలిపి మొత్తం 8 మంది అక్కడికక్కడే మృతి చెందారు. మరో 20 మందికి పైగా గాయాలపాలయ్యారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తోనే పేలుడు జరిగిందని అంచనా. ప్రమాదంపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేల చొప్పున ప్రధానమంత్రి సహాయ నిధి నుంచి పరిహారంగా ప్రకటించారు.

మణిపూర్‌లో ఇండియా

- 20 మంది ఎంపీల బృందం పర్యటన
- శిబిరాల్లో బాధితులతో మాటామంతి
- ఈ హింసతో దేశ ప్రతిష్ట దెబ్బ తింది
- అయినా మౌనమే మోదీ భాష: కాంగ్రెస్
- వాళ్లది ఫక్తు రాజకీయ నాటకం: బీజేపీ



ఇంఫాల్: కొంతకాలంగా హింసాకాండతో అట్టుడుకుతున్న మణిపూర్‌లో విపక్ష 'ఇండియా' కూటమి రెండు రోజుల పర్యటన శనివారం మొదలైంది. ఇందుకోసం కాంగ్రెస్‌తో పాటు పలు పార్టీలకు చెందిన 21 మంది ఎంపీల బృందం శనివారం మణిపూర్ రాజధాని ఇంఫాల్ చేరింది. కాంగ్రెస్ నేత అధీర్ రంజన్ చౌదరితో పాటు కనిమొళి (డీఎంకే), సుష్మితా దేవ్ (తృణమూల్ కాంగ్రెస్), ఆర్జేడీ, ఆరెల్డీ, జేఎంఎం, సీపీఎం, సీపీఐ, ఆరెస్పీ తదితర పార్టీల ఎంపీలు వీరిలో ఉన్నారు. రాజకీయాలు చేసేందుకు రాలేదని అధీర్ స్పష్టం చేశారు. ''కేవలం బాధితులను కలిసి వారి సమస్యలను అర్థం చేసుకోవడమే మా ఉద్దేశం. సమస్యకు పరిష్కారానికి అన్ని పార్టీలూ చిత్తశుద్ధితో కృషి చేద్దాం'' అని పిలుపునిచ్చారు. మణిపూర్ కల్లోలం దేశ ప్రతిష్టను దెబ్బ తీస్తోందన్నారు. శనివారం తొలి రోజు ఇంఫాల్‌తో పాటు మొయిరంగ్, విష్ణుపూర్ జిల్లాలతో పాటు తాజాగా హింసాకాండ చెలరేగిన చౌరాచంద్‌పూర్‌లో కూడా ఎంపీల బృందం పర్యటించింది. కుకీ తెగకు చెందిన బాధితులతో మాట్లాడి వివరాలు సేకరించింది. వారికి ధైర్యం చెబుతూ గడిపింది. మణిపూర్‌లో రాష్ట్రపతి పాలన విధించేలా ఒత్తిడి తేవాలని బాధితులు వారిని కోరారు. అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో హింసాకాండ బీజేపీ ఉద్దేశపూర్వకంగా అమలు చేస్తున్న కుట్ర ఫలితమేనని ఆరోపించారు. మణిపూర్ అంశంపై ప్రధాని, కేంద్ర మంత్రులు దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని అధీర్ దుయ్యబట్టారు. ''మమ్మల్ని పార్లమెంటులో నోరెత్తనివ్వడం లేదు. అందుకే నేరుగా ప్రభావిత ప్రాంతాలకే వచ్చి, బాధితులతో మమేకమవుతున్నాం. వారు అనుభవించిన చిత్రహింసలకు సంబంధించిన దారుణ గాథలను వారి నోటే విని చలించిపోయాం'' అని చెప్పారు. భద్రతా కారణాల రీత్యా ఇంఫాల్ నుంచి హెలికాప్టర్‌లో బృందం పర్యటన సాగింది. ఆదివారం వారు గవర్నర్ అనసూయా ఉయికెను కలిసి సమస్యపై చర్చిస్తారని సమాచారం. సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు గవర్నర్ తెలిపారు. ఇరు తెగత వారితోనూ చర్చలు జరుపుతున్నట్టు చెప్పారు. శనివారం చౌరాచంద్‌పూర్‌లో పునరావాస శిబిరాన్ని ఆమె సందర్శించారు.

భారీ ర్యాలీ

విపక్ష ఎంపీలు మణిపూర్‌లో అడుగు పెట్టిన రోజే రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన వేలాది మంది కుకీ తెగ ప్రజలు ఇంఫాల్‌లో భారీ ర్యాలీ జరిపారు. తమ ప్రాబల్యమున్న ప్రాంతాలకు ప్రత్యేక పరిపాలన కావాలంటూ నినదించారు. మణిపూర్ సమగ్ర సమన్వయ కమిటీ సారథ్యంలో ఐదు కిలోమీటర్ల మేర ర్యాలీ జరిగింది.

ఈ గొంతులు అప్పుడేమైనట్టు: బీజేపీ

మణిపూర్‌లో విపక్ష ఎంపీల పర్యటన ఫక్తు రాజకీయ నాటకమని బీజేపీ దుయ్యబట్టింది. గత ప్రభుత్వాల హయాంలో మణిపూర్ భగ్గున మండి నెలల తరబడి స్తంభించినప్పుడు వీరంతా పార్లమెంటులో కనీసం నోరైనా ఎత్తలేదెందుకని కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ప్రశ్నించారు. బీజేపీ విమర్శలను ఇండియా బృందం తిప్పికొట్టింది. ''ప్రధాని సారథ్యంలో అఖిలపక్ష బృందం మణిపూర్‌లో పర్యటిస్తే అందులో ఆనందంగా భాగస్వాములం అయ్యేవాళ్లం. కానీ అందరికంటే ముందుగా, ఎక్కువగా స్పందించాల్సిన ఆయన అసలు సోదిలో కూడా లేకుండాపోయారు'అంటూ దుయ్యబట్టింది.

భర్త, కొడుకుల మృతదేహాలు చూపించండి

తన కుమారుడు, భర్త మృతదేహాలనైనా చూపించండంటూ అత్యాచార బాధితురాలు విపక్ష ఎంపీలను కోరారు. మణిపూర్‌లో ఇద్దరు మహిళలను ప్రత్యర్థి తెగకు చెందినవారు నగ్నంగా ఊరేగించడం తెలిసిందే. వారిలో ఒక మహిళను ఎంపీలు కనిమొళి (డీఎంకే), సుష్మితాదేవ్ (టీఎంసీ) కలిసి ధైర్యం చెప్పారు. అనంతరం ఎంపీలు మీడియాతో మాట్లాడుతూ ఆమె భర్తను, కొడుకును చంపడంతో పాటు ఆమె కూతురిపై కూడా అత్యాచారనికి ఒడిగట్టారన్నారు. ఈ కేసు విచారణను శనివారం సీబీఐ చేపట్టింది. మణిపూర్ హింసపై ఆరు కేసులను సీబీఐ దర్యాప్తు చేస్తోంది.

సాక్షి కరీంనగర్

ఆదివారం । 30 । జూలై । 2023



మంత్రిని కలిసిన ఎస్‌బీఐ

కరీంనగర్: కరీంనగర్ కమిషనరేట్‌కు బదిలీపై వచ్చిన స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్ మంత్రి గంగుల కమలాకర్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు.



..పారుతున్న 'అన్నల' చెరువులు

రాజన్న సిరిసిల్ల జిల్లాలో 26ఏళ్లక్రితం అన్నలు తవ్విన చెరువులు అలుగుపారుతున్నాయి. జలకళ సంతరించుకుని పంటలకు ఉపయోగకరంగా ఉన్నాయి.

8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/24.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో వర్షం కురిసే అవకాశం ఉంది. గాలిలో తేమ అధికంగా ఉంటుంది. గాలి వేగంగా వీస్తుంది.

న్యూస్‌రీల్

కలెక్టరేట్ పనులు తనిఖీ



వివరాలు ఆరా తీస్తున్న కలెక్టర్ బి.గోపి

కరీంనగర్ అర్బన్: సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణ పనులను కలెక్టర్ బి.గోపి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రస్తుత కలెక్టరేట్‌తో పాటు నూతన భవన నిర్మాణ పనులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను ఆర్‌అండ్‌బీ అధికారులు, గుత్తేదారులతో కలిసి పరిశీలించారు. సమీకృత భవన నిర్మాణం, రెసిడెన్షియల్ క్వార్టర్స్ నిర్మాణ పనులకు సంబంధించిన టెండర్, నిధుల కేటాయింపు తదితర వివరాలను ఆరా తీశారు. త్వరలోనే ఐడీఓసీ భవన నిర్మాణాన్ని పూర్తిచేస్తానని గుత్తేదారు తెలపడంతో తాత్కాలికంగా కలెక్టరేట్‌ను తరలించడం కోసం జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ స్టేడియంలో నిర్మించిన స్పోర్ట్స్ కాంప్లెక్స్ గదులను పరిశీలించారు.

మత్స్యరంగ అభివృద్ధికి మరింత కృషి



మాట్లాడుతున్న చైర్మన్ పిట్టల రవీందర్

హుజూరాబాద్/మానకొండూర్: మత్స్యరంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని మత్స్యకార సంస్థ చైర్మన్ పిట్టల రవీందర్ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో పరంకుశ కిరణ్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సభలో రవీందర్ మాట్లాడుతూ.. మత్స్యకారులకు ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు పంటల విరామ సమయంలో కాలువల్లో చేపల పెంపకానికి చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ ఆధ్వర్యంలో రవీందర్‌ను సత్కరించారు. ఆవునూరి సమ్మయ్య, ముక్కెర రాజు, పలకల ఈశ్వర్‌రెడ్డి, పాక సతీశ్, వేల్పులరత్నం, చీమ శ్రీనివాస్, జ్యోతిరెడ్డి, సురేందర్ పాల్గొన్నారు. అనంతరం మానకొండూర్‌లోని పెద్దమ్మతల్లి ఆలయాన్ని సందర్శించారు. అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

'ఉపాధి' ఉద్యోగులకు పే స్కేల్ ఏది?



వినతిపత్రం ఇస్తున్న ఈజీఎస్ ఉద్యోగులు

కరీంనగర్ అర్బన్: పే స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ ఉద్యోగులు మంత్రులు గంగుల కమలాకర్, కొప్పుల ఈశ్వర్, టీఎన్జీవోల సంఘం ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్‌లకు శనివారం వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్రంలో 3,874 మంది ఉద్యోగులు ఉపాధి పథకంలో పనిచేస్తున్నారని, తామంతా జిల్లా సెలక్షన్ కమిటీ ద్వారా ఎంపికై రాత పరీక్ష, ఇంటర్వ్యూ, రోస్టర్ విధానంలో ఉద్యోగులుగా ఎంపికయ్యామని వివరించారు. 17 సంవత్సరాలుగా నిరంతరం పేదలకు కోసం పని చేస్తున్నామని రాష్ట్ర జేఏసీ కో కన్వీనర్‌లు కృష్ణాగౌడ్, వెంకటేశ్‌గౌడ్, రమేష్, జగదీష్‌లు వాపోయారు. వేల కుటుంబాలు సీఎం వైపు ఆశగా చూస్తున్నాయని, తమకు భరోసా కల్పించాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు మమతారెడ్డి, సత్యప్రకాష్, హరీశ్, చంద్రమౌళి, హసన్, హరికృష్ణ, రమేష్, కొమురయ్య, సాయికృష్ణ, సునీల్ పాల్గొన్నారు.

సదరం షెడ్యూల్ ఖరారు

కరీంనగర్‌టౌన్: జిల్లా ఆస్పత్రిలో నిర్వహించే ఆగస్టు నెల సదరం శిబిరం షెడ్యూల్‌ను మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణప్రసాద్ వెల్లడించారు. 3న ఆర్థో, 8న మానసిక రోగులు, 16న కంటి చూపు, 22న వినికిడి, మూగ సమస్యలున్నవారు నిర్ధారణ కోసం హాజరు కావాలన్నారు. ఇందు కోసం ఈనెల 31వ తేదీన మీసేవ కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని, స్లాట్ రసీదు, ఆధార్‌కార్డు, ఫొటోతో హాజరుకావాల్సిందిగా కోరారు.

బల్దియా అసిస్టెంట్ కమిషనర్‌గా నరేశ్

కరీంనగర్ కార్పొరేషన్: నగరపాలకసంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా బి.నరేశ్ బాబు నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం బదిలీ ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇప్పటి వరకు అసిస్టెంట్ కమిషనర్ గా ఉన్న రాజేశ్వర్ పదోన్నతిపై కోరుట్ల మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వెళ్లారు.

హుజూరాబాద్ ఆర్డీవోగా రాజు

కరీంనగర్ అర్బన్: హుజూరాబాద్ ఆర్డీవోగా సోలిపేట రాజును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్డీవో హరిసింగ్‌ను సీసీఎల్ఎలో రిపోర్ట్ చేయాల్సిందిగా ఆదేశించింది. ఎస్.రాజు గతంలో వేములవాడ తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు.

- సమస్య ఏదైనా పరిష్కారం బలవన్మరణం అన్న భావన
- కరీంనగర్ సిటీలో వారానికొకరు
- జూన్ చివరి వరకు 31 మంది 'చితి'కి..
- ఒక్క క్షణం ఆలోచించాలంటున్న మానసిక నిపుణులు


జీవితం భారం.. బతుకు దూరం!

ఆత్మహత్య

'కరీంనగర్‌లోని మంకమ్మతోటలో ఇటీవల ఓ యువకుడు తాను ప్రేమించిన అమ్మాయి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుందని మనస్తాపానికి గురయ్యాడు. క్షణికావేశంలో ఉరేసుకొని, ఆత్మహత్య చేసుకున్నాడు.'

'కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో నివాసం ఉండే ఓ వృద్ధురాలు అనారోగ్య సమస్యలతో బాధ పడింది. ఎంతకీ నయం కాకపోవడంతో ఇటీవల క్రిమిసంహారక మందు తాగి, చికిత్స పొందుతూ మృతిచెందింది.'

అప్పటి వరకు కళ్లముందు కనిపించిన వారు అకస్మాత్తుగా ప్రాణాలు తీసుకుంటున్నారు. చలాకీ మాటలు.. కలివిడిగా ఉండేవారు అంతలోనే మాయమవుతున్నారు.



వ్యాపారం, పెట్టుబడులు.. మానసిక ఒత్తిడి.. కుటుంబ సమస్యలు.. బతకలేమన్న భావన ఉరితాళ్లవుతున్నాయి. మనోవేదన భరించలేక చాలామంది బలవంతంగా లోకాన్ని వీడుతున్నారు. తీరని విషాదాన్ని మిగుల్చుతున్నారు. మృతుల్లో ముక్కుపచ్చలారని వారు ఉండడం కలిచివేస్తోంది.

అప్పుల బాధతో వ్యక్తులు, కుటుంబాలను బలితీసుకుంటున్న ఉదంతాల్లో ఎక్కువగా భూ వ్యవహారాలకు సంబంధించినవే ఉంటున్నాయి. భూ లావాదేవీలు, క్రయ విక్రయాల దగ్గర విభేదాలు వచ్చినప్పుడు అప్పుల పాలవుతున్నారు. తెలిసిన వారి చేతిలో మోసపోవడం, అప్పుల బాధ పెరగడంతో ఏం చేయలేని స్థితిలో ఒత్తిడికి గురై కుంగిపోయి బలిపీఠమెక్కుతున్నారు.

కరీంనగర్ క్రైం:

కరీంనగర్ నగరంలో ఐదు రోజుల వ్యవధిలో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. క్షణికావేశంలో నూరేళ్ల జీవితాన్ని ముందే ముగించేశారు. చుట్టుముడుతున్న మానసిక ఒత్తిడి, కుటుంబ పరిస్థితులు, అనారోగ్యం, అప్పుల బాధ, కెరీర్‌లో ఎత్తుపల్లాలు, వివాహేతర సంబంధాలు ఇలా రకరకాల కారణాలతో తనువు చాలిస్తున్నారు. భవిష్యత్తు కోసం కష్టపడకుండానే చిన్న చిన్న సమస్యలకు తమ జీవితం అంధకారమైందని భావించి, బలన్మరణానికి పాల్పడుతున్నారు. కరీంనగర్ సిటీలో వారానికొకరు ఆత్మహత్య చేసుకుంటుండటం కలిచివేస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి జూన్ వరకు 31 మంది బలిపీఠమెక్కారు. వీరిలో ఎక్కువ మంది అనారోగ్య కారణాలతోనే ఆత్మహత్య చేసుకున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి.

మగవాళ్లే ఎక్కువ..

ఈ ఏడాది ఇప్పటివరకు 28 మంది మగవాళ్లు, ముగ్గురు ఆడవాళ్లు ఆత్మహత్య చేసుకున్నారు. వీరిలో 10 మంది అనారోగ్యం భరించలేనివారు, చికిత్స తీసుకునే పరిస్థితిలో లేనివారే. ఆర్థిక పరిస్థితులు, అప్పుల బాధతో ఆగురుగు తమ జీవితాన్ని అర్ధంతరంగా ముగించారు. ఆరుగురు కుటుంబ కలహాలు, ఒకరు ప్రేమ వ్యవహారంతో, 8 మంది ఇతర కారణాలతో మొత్తం 31 మంది బలవన్మరణానికి పాల్పడ్డారు.

జీవితాన్ని ముగించడం సరికాదు

ఆత్మహత్య చేసుకునే ముందు ఒక్క క్షణం తల్లిదండ్రులు, పిల్లల గురించి ఆలోచించాలని, సమస్యలకు పరిష్కార మార్గాలు వెతకాలి తప్ప జీవితాన్ని ముగించడం సరికాదని మానసిక వైద్యులు అంటున్నారు. ప్రతి కుటుంబంలో ఆర్థిక క్రమశిక్షణ ఉండాలని, చెడు వ్యసనాలు, వ్యాధుల బారిన పడి, ముందుకుసాగలేక చాలా మంది తమ జీవితాన్ని మధ్యలోనే ఆపేస్తున్నారని చెబుతున్నారు.

మానసికంగా దృఢంగా ఉండాలి



సమస్యలు వచ్చాయని ఒత్తిడికి గురికావొద్దు. మానసికంగా దృఢంగా ఉండి, వాటికి పరిష్కారం వెతకాలి. అనవసర విషయాలకు ఆందోళన చెందొద్దు. ఆత్మహత్యే సమస్యలకు పరిష్కారం కాదని గుర్తించాలి. కాగ్నిటివ్ బిహేవియరల్ థెరపీతో బలవన్మరణ ఆలోచనలు తగ్గించుకోవచ్చు.

– ఎ.శ్రీనివాస్‌రెడ్డి, మానసిక వైద్య నిపుణులు

ఆత్మహత్య పరిష్కారం కాదు



ప్రతీ సమస్యకు పరిష్కారం ఉంటుంది. చిన్న చిన్న విషయాలకు మానసిక వేదనకు గురికావొద్దు. సమస్యల పరిష్కారం కోసం ఆలోచన చేయాలి. ఆ దిశగా ప్రయత్నం చేస్తే సులువుగా బయటపడొచ్చు. కానీ సమస్యలు వచ్చాయని ఆత్మహత్యలు చేసుకోవడం సరికాదు. అన్నింటికి చావే పరిష్కారం కాదు. బతికి సాధించాలి.

– కె.రామచందర్‌రావు, కరీంనగర్ టూటౌన్ సీఐ

చెక్‌డ్యాంకు గండి.. ప్రమాదకరంగా చెరువు



మల్లారెడ్డిపల్లి మానేరువాగులో గండిపడి వృథాగా పోతున్న నీళ్లు



తెగుతున్న కొత్తపల్లి చెరువు బండకట్టు

వీణవంక:మండలంలోని మల్లారెడ్డిపల్లి గ్రామం మానేరువాగులో నిర్మించిన చెక్‌డ్యాంకు ఇటీవల కురిసిన వర్షాలతో పాటు ఎగువనుంచి వచ్చిన వరదకు శనివారం గండి పడింది. మండల పరిధిలోని మల్లారెడ్డిపల్లి, కోర్కల్, విలాసాగర్ గ్రామాలలో మానేరువాగుపై చెక్‌డ్యాంలు నిర్మించారు. మల్లారెడ్డిపల్లి చెక్‌డ్యాంకు భారీ వరద చేరడంతో సైడ్‌వాల్ పూర్తిగా కూలిపోయింది. దీంతో నీరు దిగువనకు వెళ్తోంది.

ప్రమాదకరంగా కొత్తపల్లి చెరువు మత్తడి

కొత్తపల్లి: కొత్తపల్లి చెరువు మత్తడి ప్రాంతం ప్రమాదకరంగా మారింది. వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఎగువప్రాంతం నుంచి వచ్చిన వరదలతో చెరువు మత్తడి దూకింది. రికార్డుస్థాయిలో వరదచేరడంతో రెండు, మూడు రోజుల పాటు ప్రమాదకరంగా అలుగు పారింది. ఈ వరద ఉధృతికి తూం సమీపంలోని మత్తడి ప్రాంతం కొట్టుకుపోయింది. తూం ప్రాంతంలో చెరువు మత్తడిని కలుపుతూ నిర్మించిన సిమెంట్ బండకట్టు గోడ కొట్టుకుపోయింది. దీంతో వరద నీటి ఉధృతి మత్తడి, బండకట్టు మధ్య నుంచి కొనసాగుతోంది. రానున్న రోజుల్లో మరిన్ని వర్షాలు కురిస్తే తూం సమీపంలోని బండకట్టు తెగిపోయే ప్రమాదం ఉంది. నీటిపారుదలశాఖ అధికారులు స్పందించి, చెరువు పరిసరాలను పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు.

కల్వల ప్రాజెక్టుకు పదిరోజుల్లో నిధులు



గండిని పరిశీలిస్తున్న వినోద్‌కుమార్, తదితరులు

శంకరపట్నం(మానకొండూర్): గండి పడిన కల్వల ప్రాజెక్టుకు పదిరోజుల్లో నిధులు మంజూరు అయ్యేలా కృషిచేస్తానని ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. శంకరపట్నం మండలం కల్వల ప్రాజెక్ట్‌ను శనివారం ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సతీశ్‌బాబు, ఎమ్మెల్సీ కౌశిక్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ.. 1970 ఏడాదిలో కల్వల ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, వీణవంక మండలంలోని 15 గ్రామాల పరిధిలోని 3,500 ఎకరాలకు 30 ఏళ్లుగా సాగునీరు అందుతోందని అన్నారు. ఇటీవల కురిసిన భారీవర్షాలు, వరదలతో ప్రాజెక్టు మత్తడి గండిపడిందని తెలిపారు. తాత్కాలిక మరమ్మతులు చేసే అవకాశం లేకుండా మత్తడి కొట్టుకుపోయిందని వివరించారు. ప్రాజెక్ట్ రీ డిజైన్ చేసి నిధులు మంజూరు చేసేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. భారీ నీటి పారుదలశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉందని, వారంపదిరోజుల్లో నిధులు మంజూరు చేయించి టెండర్లు నిర్వహించి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ జీవీ.రామకృష్ణారావు, సర్పంచ్ భద్రయ్య, జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, శేఖర్‌గౌడ్, వైస్‌ఎంపీపీ రమేశ్ పాల్గొన్నారు.

బాధితులను ఆదుకోవాలి: ఈటల



దెబ్బతిన్న బ్రిడ్జిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజేందర్

జమ్మికుంట/ఇల్లందకుంట/హుజూరాబాద్‌రూరల్: వర్షం.. వరదలతో నష్టపోయిన ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. జమ్మికుంట హౌసింగ్‌బోర్డు, అంబేద్కర్‌కాలనీ వరద బాధితులను పరామర్శించారు. నష్టపోయిన వారికి ప్రభుత్వం రూ.25 వేల తక్షణ సాయం అందించాలని సూచించారు. అంతకుముందు హుజూరాబాద్ మండలం చెల్పూర్ గ్రామంలో పెద్ద చెరువు, చిన్న చెరువును పరిశీలించారు. చెరువుల మధ్య శాశ్వత లింకు కెనాల్ నిర్మించాలని సర్పంచ్ నేరేళ్ల మహేందర్‌గౌడ్ ఎమ్మెల్యేను కోరారు. ఇల్లందకుంట మండలం పాతర్లపల్లిలో దెబ్బతిన్న లోలెవల్ బ్రిడ్జి, రోడ్లు, ఇండ్లను పరిశీలించారు. మరమ్మతు పనులు యుద్ధప్రాతిపాదికన పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఆయన వెంటన బీజేపీ నాయకులు, స్థానికులున్నారు.

వరద, బురద రాజకీయాలు మానుకోండి

- అభివృద్ధిలో భాగస్వాములు కాకపోతే డిపాజిట్లు గల్లంతు
- అప్రోచ్ రోడ్డు కుంగితే ఇంత రాద్ధాంతమా..?
- మేయర్ యాదగిరి సునీల్ రావు



మాట్లాడుతున్న మేయర్ సునీల్‌రావు

కరీంనగర్: కాంగ్రెస్, బీజేపీ నేతలు వరద, బురద రాజకీయాలు మానుకోవాలని, లేకుంటే వచ్చే ఎన్నికల్లో వారికి డిపాజిట్లు గల్లంతవ్వడం ఖాయమని మేయర్ వై.సునీల్‌రావు అన్నారు. శనివారం ఓ ఫంక్షన్‌హాల్‌లో మాట్లాడుతూ.. గతంలో ఎన్నడూ లేని విధంగా 16సెంటీమీటర్ల వర్షం కురిసిందని, అయినా కరీంనగర్ సిటీలో ఆస్తినష్టం, ప్రాణనష్టం జరగలేదన్నారు. గతంలో 4, 5 సెంటిమీటర్ల వర్షపాతానికే నగరం జలమయమయ్యేదని గుర్తుచేశారు. తొమ్మిదేళ్లలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్ ప్రత్యేక చొరవ తీసుకొని వేల కోట్లతో అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నారని అన్నారు. రూ.240 కోట్లతో నిర్మించిన కేబుల్ బ్రిడ్జి, అప్రోచ్ రోడ్డు వర్షాలకు కుంగితే, సంకుచిత రాజకీయాలతో ధర్నాలు, ఆందోళనలు చేయడం కాంగ్రెస్, బీజేపీలకే చెల్లిందని విమర్శించారు. రూ.2,500కోట్ల నిధులతో నగరవ్యాప్తంగా పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు జరుగుతున్నాయని తెలిపారు. అందులో దాదాపు 80శాతం పనులు పూర్తి చేయగా... మిగిలిన 20శాతం పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. కార్పొరేటర్లు గంట కల్యాణి, గుగ్గిల్ల జయశ్రీ, కంసాల శ్రీనివాస్, వాల రమణరావు తదితరులున్నారు.



పీర్లకు దట్టీకట్టి మొక్కులు చెల్లిస్తున్న ప్రజలు



షర్బత్ పంపిణీ చేస్తున్న మంత్రి గంగుల కమలాకర్

ఘనంగా మొహర్రం

కరీంనగర్ కల్చరల్: నగరంలో మొహర్రం వేడుకలు ఘనంగా జరిగాయి. అలంకరించిన పీరీలు, ఇమామ్ హసన్, ఇమాంహుసేన్‌ల త్యాగనిరతిని కీర్తిస్తూ ప్రత్యేక ప్రార్థనలతో పాతబజార్ జామా మజీద్ ప్రాంగణం కిటకిటలాడింది. పురవీధుల్లో ఊరేగించిన పీరీలకు దట్టీ కట్టి, బెల్లం, పూలమాలలు సమర్పించారు. తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ షర్బత్ పంపిణీ చేశారు. ఈ వేడుకలో మంత్రి గంగుల కమలాకర్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్లా హరిశంకర్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ షమీ, కార్పొరేటర్లు బండారి వేణు, తోట రాములు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

యాదవ యుద్ధభేరి జయప్రదం చేయండి



పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న నాయకులు

కరీంనగర్‌: రానున్న ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన అన్ని రాజకీయ పార్టీలు యాదవులు, యాదవ ఉపకులాలాలకు 22 ఎమ్మెల్యే, 7 ఎమ్మెల్సీ, 5 లోకసభ, రాజ్యసభ సీట్లు ఇవ్వాలని డిమాండ్‌ చేస్తూ ఆగస్టు 13న హైదరాబాద్‌లో నిర్వహించే యాదవ యుద్ధభేరిని జయప్రదం చేయాలని యాదవ విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు చలకాని వెంకట్‌యాదవ్‌ కోరారు. శనివారం కరీంనగర్‌లోని కృషి భవన్‌లో నిర్వహించిన రౌండ్‌ టేబుల్‌ సమావేశంలో యుద్ధభేరి పోస్టర్‌ ఆవిష్కరించి మాట్లాడారు. యాదవులకు నష్టం కలిగించే ఈడబ్ల్యూఎస్‌ రిజర్వేషన్లు వెంటనే రద్దు చేయాలని, యాదవుల విద్య, ఉద్యోగ అభివృద్ధికి ప్రత్యేక నిధి ఏర్పాటు చేయాలని డిమాండ్‌ చేశారు. జిల్లా కన్వీనర్‌ బండ రాజుయాదవ్‌, బుస అంజయ్య యాదవ్‌, ప్రసాద్‌యాదవ్‌, సత్యంయాదవ్‌, మహేష్‌యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని ఎండగట్టడంలో ప్రతిపక్షాలు విఫలం



మాట్లాడుతున్న వేణుగోపాల్‌

కరీంనగర్‌: కరీంనగర్‌ నియోజకవర్గంలో అభివృద్ధి మాటున పెద్ద ఎత్తున అవినీతి జరుగుతుందని, అధికార పార్టీ అవినీతిని ఎండగట్టడంలో ప్రతిపక్షాలు వైఫల్యం చెందాయని ప్రజామిత్ర ప్రోగ్రెసివ్‌ డెమోక్రటిక్‌ ఫ్రంట్‌ రాష్ట్ర అధ్యక్షుడు కొరివి వేణుగోపాల్‌ అన్నారు. శనివారం సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కరీంనగర్‌ నియోజకవర్గంలో సమస్యలపై ప్రశ్నించడంలో ప్రతిపక్షాలైన కాంగ్రెస్‌, బీజేపీ, సీపీఐ, సీపీఎంలు మౌనం వహించడంపై మర్మమేమిటో వెల్లడించాలని డిమాండ్‌ చేశారు. ప్రతిపక్ష పాత్ర పోషించని పార్టీలకు కరీంనగర్‌లో ఎమ్మెల్యేలుగా పోటీ చేసే అర్హత లేదన్నారు. సమావేశంలో కడపల విజయకుమార్‌, శ్రీధర్‌, బోయినపల్లి చంద్రయ్య, రామ్మూర్తి, రామ్‌ రెడ్డి, మూర్తి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం, కారు ఢీ


మానకొండూర్‌: రాజమండ్రి నుంచి రాజస్తాన్‌కు వెళ్తున్న ఓ ద్విచక్ర వాహనదారు రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. స్థానికుల వివరాలు.. రాజస్తాన్‌కు చెందిన ఎండీ గబ్బర్‌, ఎండీ మోసిన్‌ ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి దాబాలో పని చేస్తున్నారు. తమ రాష్ట్రానికి ద్విచక్రవా హనంపై బయలుదేరారు. శనివారం రాత్రి మార్గమధ్యలోని మానకొండూర్‌ చెరువు కట్ట వద్ద వీరి బైక్‌, ఎదురుగా వచ్చిన కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గబ్బర్‌కు గాయాలైనాయి. 108 సిబ్బంది వెంటనే క్షతగాత్రులను కరీంనగర్‌ ఆసుపత్రికి తరలించారు.



రంగంపేట మార్గండి చెరువు మత్తడివద్ద చేపలు పడుతున్న స్థానికులు



జలకళ సంతరించుకున్న వట్టిమల్ల నారాయణ చెరువు



నిండుకుండలా రంగంపేట జంపన్న చెరువు



మత్తడి దూకుతున్న మద్దిమల్ల రాయిని చెరువు

అలుగుపారుతున్న అన్నల చెరువులు!

వర్షాలతో జలకళ సంతరించుకున్న జలవనరులు

సాక్షి, కరీంనగర్‌ డెస్క్‌:

'కాకతీయులు.. రెడ్డిరాజులు చెరువులు తవ్వించారని.. అశోకుడు మొక్కలు నాటించెను అని చదువుకున్నాం'.. కానీ.. సమసమాజ స్థాపన కోసం ఆయుధాలు చేతపట్టి, అడవుల్లో సంచరించే అన్నలు(నక్సలైట్లు) 26 ఏళ్ల క్రితం రాజన్నసిరిసిల్ల జిల్లాలో చెరువులు తవ్వారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో ఇదో అధ్యాయం. దీనిపై అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చ జరిగింది. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాలకు ఆ చెరువులు జలకళ సంతరించుకొని మత్తళ్లు దుంకుతున్నాయి. 1990–2000 మధ్య కాలంలో సిరిసిల్ల ప్రాంతంలో పట్టున్న సీపీఐ (ఎంఎల్‌) మావోయిస్టు, జనశక్తి విప్లవగ్రూపు నక్సలైట్లు పోటాపోటీగా మూడు చెరువులు తవ్వారు.

- తుపాకులు పక్కనపెట్టి.. తట్టాపారలు పట్టి
- 26 ఏళ్లక్రితం రంగపేట, వద్దిమల్ల, వట్టిమల్ల గ్రామాల్లో చెరువుల తవ్వకం
- ఆనాటి కరువును తీర్చిన నక్సలైట్లు

కరువు కోరల్లో పల్లెలు..

రాజన్నసిరిసిల్ల జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట మండలాల్లోని అటవీ గ్రామాల్లో మూడు దశాబ్దాల క్రితం అడవిలో అన్నలదే రాజ్యం. ఏళ్లగా బీడుగా మారిన భూములు.. కరువు కోరల్లో బతుకులు.. చెరువు నిర్మిస్తే బాగుండు.. బుక్కెడు బువ్వ దొరుకుతుందని ఆశించిన నిరుపేదలు.. ఏళ్ల తరబడి పాలకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. అలాంటి పరిస్థితుల్లో అడవిలో అన్నలు వీర్నపల్లి మండలంలోని రంగంపేటలో మార్గండి చెరువు (ప్రస్తుతం జంపన్న చెరువు), మద్దిమల్ల రాయిని చెరువు, కోనరావుపేట మండలంలోని వట్టిమల్లలో నారాయణ చెరువు తవ్వి కరువు తీర్చారు.

మొదట మద్దిమల్ల చెరువుకు శ్రీకారం..

వీర్నపల్లి మండలంలోని మద్దిమల్ల రాయిని చెరువు తవ్వకంలో అప్పటి పీపుల్స్‌వార్‌ పార్టీ (మావోయిస్టు) కీలక పాత్ర పోషించింది. గుట్టల ప్రాంతం నుంచి వచ్చే నీరు వృథాగా ఒర్రెల ద్వారా వెళ్లిపోతోంది. ఆ నీటిని ఆపితే ఊరందరికీ మేలు జరుగుతుందని అప్పటి పీపుల్స్‌వార్‌ దళ నాయకుడు మధు ఉరఫ్‌ కొట్టాల మోహన్‌రెడ్డి భావించారు. మద్దిమల్లలో కులాలవారీగా కమిటీలు వేసి, 11 మందికి ఒక గ్రూపు ఏర్పాటు చేశారు. టీమ్‌ లీడర్లను నియమించి, చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. 75 రోజులపాటు నిత్యం 600 మంది గ్రామస్తులు ఇందులో భాగస్వాములయ్యారు. సమీప గ్రామాలవారు కూడా నక్సలైట్ల ప్రోద్బలంతో శ్రమదానం చేశారు. సాయుధ నక్సలైట్లు తుపాకులను పక్కనపెట్టి, చెరువు కట్ట పోసేందుకు తట్టలు పట్టి, పని చేయడం విశేషం. ఈ ప్రాంత ట్రాక్టర్‌ యజమానులు సైతం సహకారం అందించడంతో చెరువు నిర్మాణం పూర్తయింది. నక్సలైట్ల నేతృత్వంలో తవ్విన తొలి చెరువు ఇదే. ఈ వానాకాలంలో కురుస్తున్న వర్షాలకు మత్తడి దుంకుతోంది.

నెలరోజుల్లో పూర్తయిన 'జంపన్న'..

మావోయిస్టులు మద్దిమల్లలో చెరువు నిర్మించడాన్ని స్ఫూర్తిగా తీసుకున్న సీపీఐ(ఎంఎల్‌) జనశక్తి అప్పటి జిల్లా కార్యదర్శి జంపన్న వీర్నపల్లి మండలంలోని రంగంపేట శివారులో మార్గండి చెరువు తవ్వకానికి శ్రీకారం చుట్టారు. ఊరిలోని కుల సంఘాలను ఏకం చేసి, వంతుల వారీగా పనుల్లో భాగస్వాములు కావాలని జనశక్తి పిలుపునిచ్చింది. దీంతో నెల రోజుల్లోనే చెరువు తవ్వకం పూర్తయింది. సాయుధ జనశక్తి నక్సలైట్లు సైతం శ్రమదానం చేశారు. నీరు వన్యప్రాణులకు, పశువులకు అందుబాటులోకి వచ్చింది. ప్రస్తుతం జలకళ సంతరించుకుంది. చెరువు మత్తడి వద్ద స్థానికులు చేపలు పడుతున్నారు.

నారాయణ చెరువుకు రెండేళ్లు..

కోనరావుపేట మండలంలోని వట్టిమల్ల శివారులో జనశక్తి నక్సలైట్లు నారాయణ చెరువు తవ్వారు. వారి పిలుపుతో తరలివచ్చిన ప్రజలు శ్రమదానం చేశారు. మండల ఇంజినీర్ల నుంచి సాంకేతిక సహకారం తీసుకున్నారు. ట్రాక్టర్లు, పరికరాలను పార్టీ పరంగా సమకూర్చారు. ఈ చెరువు పనులు రెండేళ్లపాటు జరిగాయి. చెరువు ప్రస్తుతం నిండుకుండను తలపిస్తోంది. నక్సలైట్లు నిర్మించిన ఈ మూడు చెరువులను అప్పట్లో మానవ హక్కుల సంఘం నేత బాలగోపాల్‌ బృందం సందర్శించింది. మావోయిస్టు దళనేత కొట్టాల మోహన్‌రెడ్డి, జనశక్తి నేత జంపన్న తమ సొంత గ్రామాల్లోనే చెరువులు తవ్వారని బాలగోపాల్‌ అప్పట్లో విమర్శనాత్మక వ్యాసాలు రాయడం చర్చనీయాంశమైంది.

నేనూ పనికి పోయిన



ఊరంతా చెరువు కోసం పని చేసినం. నేనూ నెలరోజుల పాటు పోయిన. ఆ చెరువే ఇప్పుడు ఆధారమైంది. నాకు రెండెకరాల పొలం ఉంది. జంపన్న చొరవతోనే చెరువు తవ్వినం. అందుకే దానికి ఆయన పేరు పెట్టినం.
– భూక్యా తేజనాయక్‌, రైతు, రంగంపేట

ఊర్లకు రోడ్డు వేశాం



రంగంపేటలో పార్టీ ప్రోద్బలంతో మార్గండి చెరువు తవ్వాం. అప్పటికే ఊరిలోకి రోడ్డు లేకుంటే వేశాం. ట్రాక్టర్లకు డీజిల్‌ను పార్టీ పరంగా సమకూర్చాం. జంపన్న నాయకత్వంలో కులాలవారీగా జనాన్ని కదిలించాం. – ఎడ్ల లక్ష్మీరాజం ఉరఫ్‌ సాగర్‌, జనశక్తి రాష్ట్ర మాజీ నాయకుడు



రంగంపేట మార్గండి చెరువు వద్ద జంపన్న స్మారక స్తూపం

రాజయ్య మృతదేహం లభ్యం

చిగురుమామిడి(హుస్నాబాద్‌): మండలంలోని నవాబుపేట్‌కు చెందిన ఏడేల్లి రాజయ్య (51) శుక్రవారం సాయంత్రం కరెంటు మోటారు పెట్టేందుకు వెళ్లి మోయతుమ్మెద వాగులో మునిగిన విషయం తెలిసిందే. గజ ఈతగాళ్ల వలలు, అంకెండ్లు వేసి వెతకగా శనివారం ఉదయం రాజయ్య మృతదేహం లభించింది. మృతుడి భార్య రాజవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.


నృత్య కళాకారుల సమస్యలు పరిష్కరించాలి



లోగో ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

విద్యానగర్‌(కరీంనగర్‌): జిల్లాలోని నృత్య కళాకారుల సమస్యలు పరిష్కరించి ప్రభుత్వం ఆదుకోవాలని జిల్లా నృత్య కళాకారుల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు లింగంపల్లి రామకృష్ణ కోరారు. శనివారం కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో సంఘం లోగో ఆవిష్కరించి మాట్లాడారు. 20 ఏళ్లుగా నృత్య కళనే నమ్ముకుని జీవనం సాగిస్తున్న తమకు సరైన ఆర్థిక భద్రత లేదన్నారు. ప్రైవేట్‌ స్కూల్స్‌లో పనిచేసేవారికి 10 నెలల జీతమే ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గౌరవ సలహాదారు సంగెం రాధాకృష్ణ మాట్లాడుతూ, నృత్య రంగాన్నే నమ్ముకున్న స్థానిక నృత్యకారులకు ప్రభుత్వపరంగా కరీంనగర్‌లో జరిగే కార్యక్రమాల్లో అవకాశం ఇవ్వాలన్నారు. ప్రోగ్రాంలు ఉంటేనే జీవనం గడిచే నృత్య కళాకారులకు డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సంఘం బాధ్యులు దర్శనాల రామకృష్ణ, గజ్జెల ధర్మరాజ్‌, సతీష్‌, భీష్మరాజ్‌, రజాక్‌, సరళ, సంధ్య, మధుకర్‌, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కవిత్వమే ఊపిరిగా జీవించిన వ్యక్తి సినారె



నివాళి అర్పిస్తున్న సాహితీవేత్తలు

కరీంనగర్‌ కల్చరల్‌: కవిత్వమే ఊపిరిగా జీవించిన వ్యక్తి సాహిత్యశక్తి డాక్టర్‌ సి.నారాయణరెడ్డి అని ప్రముఖ సాహితీవేత్త, అవధాని డాక్టర్‌ గంగ్ర లక్ష్మణరావు అన్నారు. శనివారం తెలంగాణ రచయితల సంఘం, తెలుగు పద్య కవితా సదస్సు సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన సినారె 92వ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సినారె సాహిత్య స్ఫూర్తి అన్ని తరాలవారికి మార్గదర్శకమన్నారు. రచయిత, విమర్శకుడు దాస్యం సేనాధిపతి మాట్లాడుతూ, సినారె గొప్ప మానవతావాది అని విశ్వంభర్‌ ద్వారా తెలుగు సాహిత్యాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లారన్నారు. రచయిత, విశ్లేషకుడు అన్నాడి గజేందర్‌రెడ్డి మాట్లాడుతూ సినారె సినీ గీతాలకు విశ్వప్రాచుర్యం కల్పించిన వ్యక్తి అన్నారు. అంతకు ముందు సినారే చిత్ర పటం వద్ద కవులు, రచయితలు నివాళి అర్పించారు. కవులు అనిల్‌కుమార్‌, దొమ్మాటి శంకరప్రసాద్‌, డి.రాజారాంమోహన్‌, నంది శ్రీనివాస్‌, కెఎస్‌ అనంతాచార్య, బొమ్మకంటి కిషన్‌, సత్యనారాయణ, ఎండీ ఖాలీద్‌ తదితరులున్నారు.

పోలింగ్‌ బూత్‌ ఏజెంట్లను నియమించండి



రాజకీయ పార్టీల నేతలతో అధికారులు

కరీంనగర్‌ అర్బన్‌: పోలింగ్‌ కేంద్రాల వారీగా బూత్‌ ఏజెంట్లను నియమించాలని కరీంనగర్‌ నియోజకవర్గ ఎలక్ట్రోరల్‌ రిజిస్ట్రేషన్‌ అధికారి, మున్సిపల్‌ కమిషనర్‌ సేవా ఇస్లావత్‌ అన్నారు. శనివారం రాజకీయ పార్టీల నేతలతో మునిసిపల్‌లో సమావేశం నిర్వహించారు. పోలింగ్‌ కేంద్రాల మార్పు, కేంద్రాల పేరు మార్పు వంటి వాటిపై చర్చించారు. రిటర్నింగ్‌ అధికారి, ఆర్డీవో కుందారపు మహేశ్వర్‌, ఏఈఆర్‌వోలు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పండుగ సాయన్న జయంతి



జయంతిలో పాల్గొన్న ముదిరాజ్‌ సంఘం నాయకులు

కరీంనగర్‌కల్చరల్‌: జిల్లా ముదిరాజ్‌ మహాసభ ఆధ్వర్యంలో తెలంగాణ సాయుధ పోరాటయోధుడు పండుగ సాయన్న జయంతిని శనివారం నగరంలోని అమరవీరుల స్తూపం వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం ముదిరాజ్‌ మాట్లాడుతూ, పండుగ సాయన్న చిన్ననాటి నుంచి అన్యాయాలను ఎదిరించి పేదల పక్షాన నిలిచారని, భూస్వాములకు ఎదురుతిరిగి ధాన్యం, ధనాన్ని పేద ప్రజలకు పంచిపెట్టిన నిస్వార్థ వీరుడు అని అన్నారు. కార్యక్రమంలో రైతు సమన్వయ వేదిక జిల్లా అధ్యక్షుడు గుడెల్లి తిరుపతిముదిరాజ్‌, కరీంనగర్‌ మార్కెట్‌ కమిటీ ఛైర్మన్‌ రెడ్డవేని మధు ముదిరాజ్‌, జెడ్పీటీసీ పిట్టల కరుణరవీందర్‌ ముదిరాజ్‌, ఉమ్మడి జిల్లా యువత అధ్యక్షుడు పండుగ బాలుముదిరాజ్‌, కొలకని నరసయ్యముదిరాజ్‌, పోలు లక్ష్మణ్‌ముదిరాజ్‌, పండుగ నాగరాజు ముదిరాజ్‌, బండారి నరేందర్‌ముదిరాజ్‌, బండారి భూమేష్‌ముదిరాజ్‌, పిట్టల లింగయ్య ముదిరాజ్‌ తదితరులున్నారు.

ముదిరాజులు రాజకీయంగా ఎదగాలి

సైదాపూర్‌(హుస్నాబాద్‌): ముదిరాజులు రాజకీయంగా, ఆర్థికంగా ఎదగాలని ముదిరాజు మహాసభ జిల్లా అధ్యక్షుడు గుర్రాల మల్లేశం అన్నారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ముదిరాజు మహాసభ మండల అధ్యక్షుడిగా రేగుల అశోక్‌ను నియమించినట్లు ప్రకటించారు. అనంతరం అశోక్‌ను కుల సంఘం నాయకులు, బీఆర్‌ఎస్‌వీ నాయకులు సన్మానించారు. ముదిరాజు మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడిగా కొనసాగుతున్న పెసరు కుమారస్వామి కులంలో గ్రూపులు కట్టి విభేదాలు సృష్టిస్తున్న కారణంగా అతడిని పదవి నుంచి తొలగిస్తున్నట్లు మల్లేశం ప్రకటించారు.

'బీఆర్‌ఎస్‌ నాయకుల అవినీతికి సాక్ష్యం కేబుల్‌ బ్రిడ్జి'



మాట్లాడుతున్న నగేశ్‌

విద్యానగర్‌(కరీంనగర్‌): బీఆర్‌ఎస్‌ నాయకుల అవినీతికి కరీంనగర్‌లోని కేబుల్‌ బ్రిడ్జి ప్రత్యక్ష సాక్ష్యమని వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డా.కె.నగేశ్‌ ఆరోపించారు. శనివారం కరీంనగర్‌ ప్రెస్‌భవన్‌లో మాట్లాడారు. కోట్లాది రూపాయలతో నిర్మించిన కేబుల్‌ బ్రిడ్జి వర్షాలకు కుంగిపోయి పగుళ్లు బారడం వారి అవినీతికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. నిర్మాణం పూర్తి చేసుకుని ప్రారంభించి నెల రోజులు కాకముందే పగులు బారడాన్ని తీవ్రంగా విమర్శించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వర్షాలకు వరద నీరు కూడ వెళ్లడానికి వీలులేని విధంగా కాలువలు, రోడ్లు నిర్మించడం విచిత్రంగా ఉందన్నారు. కేసీఆర్‌తో పాటు ఆ పార్టీ మంత్రులు, నాయకులు కూడా సూపర్‌ ఇంజినీర్లుగా తమ పనితనం నిరూపించుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రజల సొమ్మును, స్మార్ట్‌ సిటీ నిధులను మంత్రులు తమ మిడిమిడి ఇంజినీరింగ్‌ పరిజ్ఞానంతో వృథా చేస్తున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో అవినీతి ప్రభుత్వానికి ప్రజలు ఘోరీ కడతారని అన్నారు. సమావేశంలో నాయకులు రియాజొద్దీన్‌, మీర్జాబేగ్‌, శ్రీనివాస్‌, ఆంజనేయులు, రవీందర్‌రెడ్డి, నందిరెడ్డి, ఆరిఫ్‌, కుమార్‌, ప్రవీణ్‌, అంజలి, స్వరూప పాల్గొన్నారు.

'ప్రభుత్వ నిర్ణయం సరికాదు'



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కరీంనగర్‌కల్చరల్‌: ప్రభుత్వ పాఠశాలల్లోకి మీడియా, విద్యార్థి సంఘాలను రానివ్వొద్దు అంటూ విద్యాశాఖ, ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం సరికాదని, ఇందుకు నిరసనగా శనివారం ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణచౌక్‌లో ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థి సంఘాలు, మీడియాను చూస్తే ప్రభుత్వానికి ఎంత భయం వేస్తుందో అర్థమవుతుందని, తెలంగాణ ఉద్యమంలో ఆంధ్రవాళ్లు ఇలాగే వ్యవహరిస్తే ఈ రోజు కేసీఆర్‌ బతుకు ఎలా ఉండేదో ఆలోచించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి చేసింది ఏమీ లేదు కాబట్టి, ఎక్కడ తమ ప్రభుత్వంపై వ్యతిరేకత వస్తుందో అని భయపడి విద్యాశాఖ ఈ నిర్ణయం సిగ్గుచేటన్నారు. స్కూళ్లను సందర్శించి సమస్యలపై పోరాటాలు చేస్తాయని, ఎన్ని కేసులు పెట్టినా ఆగేది లేదని హెచ్చరించారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరపు వెంకటేష్‌, మచ్చ రమేష్‌, హేమంత్‌, శ్రీనివాస్‌, సందీప్‌రెడ్డి, సంపత్‌, వినయ్‌రెడ్డి, సాయికృష్ణ, సచిన్‌ తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌ పాలనలో బీసీలకు అన్యాయం



మాట్లాడుతున్న మధుసూదన్‌

జమ్మికుంట(హుజూరాబాద్‌): బీఆర్‌ఎస్‌ ప్రభుత్వ పాలనలో బీసీ కులాలకు అన్యాయం జరిగిందని తెలంగాణ బీసీ సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గజవెల్లి మధుసూదన్‌ ఆరోపించారు. శనివారం సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ముంజాల కుమార్‌స్వామిగౌడ్‌ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల కార్పొరేషన్‌తో పాటు 11 బీసీ కులాల ఫెడరేషన్‌, కోఆపరేటివ్‌ సొసైటీలకు సంబంధించి సబ్సిడీ ఆర్థికసాయం ప్రకటించిందని, కానీ నిధులు విడుదల చేయలేదని ఆరోపించారు. 2018–19లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు సబ్సిడీ బడ్జెట్‌ విడుదల చేయాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామన్నారు. సమావేశంలో రాష్ట్ర విశ్వబ్రాహ్మణ ప్రాథమిక సహకార సంఘాల సంక్షేమ అధ్యక్షుడు తౌవిటి సదానందచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి కాసుల కిరణ్‌ కుమార్‌, పాపయ్య, శివకుమార్‌, అరుణ, అపర్ణ, సమ్మయ్య, శారద, సరోజన, లక్ష్మి పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉర్సు ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న మంత్రి గంగుల కమలాకర్

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ కేబుల్ బ్రిడ్జి వద్ద గల షేర్ అలీబాబా దర్గాలో ఆగస్టు 4, 5 తేదీల్లో నిర్వహించే ఉర్సు ఉత్సవాల పోస్టర్‌ను శనివారం మంత్రి గంగుల కమలాకర్ తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో షేక్ నబి, మొహమ్మద్ మజీద్ హుస్సేన్, మొహ్మమద్ ఖదీర్, నవాజ్ హుస్సేన్, దర్గా కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



కొత్తపల్లి: కొత్తపల్లి మండలం చింతకుంట శాంతినగర్‌కు చెందిన అరిగెల్ల జ్యోతి అనారోగ్యానికి గురై ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేసుకోగా రూ.1లక్ష ఖర్చు అయ్యాయి. మంత్రి సహకారంతో ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.20 వేల చెక్కు మంజూరు కాగా ఆమెకు శనివారం ఎంపీటీసీ, సుడా డైరెక్టర్ భూక్యా తిరుపతి నాయక్ అందజేశారు.

వైద్య శిబిరం


వైద్య పరీక్షలు చేస్తున్న రెడ్‌క్రాస్ బాధ్యులు

కరీంనగర్‌టౌన్: నగరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో గల వీరబ్రహ్మేంద్రస్వామి అనాథ వృద్ధుల ఆశ్రమంలో శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారికి రక్త పరీక్షలు, మూత్ర పరీక్షలు నిర్వహించి మందులు అందజేసి పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ పి.కేశవరెడ్డి, సెక్రటరీ ఉట్కూరి రాధాకృష్ణారెడ్డి, ట్రెజరర్ పి.శ్రీహరిరెడ్డి, డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీవోను కలిసిన బీఆర్ఎస్ నాయకులు




విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టిన మహేశ్వర్‌ను శనివారం కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, సంకెనపల్లి సర్పంచ్ ముల్కల గంగారాం, బీఆర్ఎస్ నాయకులు మారుముల్ల సాంబయ్యలు మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందించి శాలువతో సత్కరించి అభినందించారు.

పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలి


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కరీంనగర్: నగరంలో కోఎడ్యుకేషన్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి గంగుల కమలాకర్‌కు బీసీ విద్యార్థి సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారోజు రాకేశ్ ఆధ్వర్యంలో శనివారం వినతిపత్రం అందజేశారు. ఉమ్మడి జిల్లా పరిధిలో సిరిసిల్లలో మాత్రమే కోఎడ్యుకేషన్ ప్రభుత్వ పాఠశాల ఉందన్నారు. ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్, కంప్యూటర్ సైన్స్ కోర్సులతో కళాశాల ఏర్పాటు చేస్తే ఈ కోర్సుల్లో చేరి ఉపాధి పొందుతారని తెలిపారు. మంత్రి సానుకూలంగా స్పందించి కరీంనగర్‌కు పాలిటెక్నిక్ కళాశాలతో పాటు జేఎన్‌టీయూను తీసుకవస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎన్నం ప్రకాశ్, నాగుల కనకయ్య గౌడ్, ఆనంద్, సంజీవ్, ప్రశాంత్, తిరుపతి, వెంకన్నగౌడ్, బ్రహ్మచారి, ప్రజ్యోత్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో నివాళి



కరీంనగర్‌కల్చరల్: మణిపూర్‌లో జరుగుతున్న హింసాకాండకు నిరసనగా శనివారం నగరంలోని కోర్టు చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. నాయకులు రాజమల్లు, శంకర్, కనకయ్య, పవన్, సత్యం తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో పిచికారీ.. ఉపాధికి దారి

- వ్యవసాయంలో ఆదర్శం యువ రైతు
- వివిధ ప్రాంతాల్లో సేవలు



కరీంనగర్ అర్బన్: సాంకేతికను ఉపాధిగా మలచుకున్నాడీ యువకుడు. అయితే అతివృష్టి లేదా అనావృష్టి వ్యవసాయాన్ని పట్టి పీడిస్తోంది. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి. ఈ క్రమంలో సాగు రంగాన్ని వదిలేస్తున్నవారెందరో. ఇక యువత ఇతర రంగాలను ఎంచుకుంటుండగా పలువురు యువ రైతులు ఆదర్శంగా నిలుస్తున్నారు. 'పోగొట్టుకున్న చోటే వెతుక్కోవాలన్నట్లు' నష్టాల్లో ఉన్న సాగురంగంలో వినూత్నంగా సస్యరక్షణ చర్యలు చేపడుతూ ఉపాధి పొందుతున్నారు. తన వ్యవసాయ క్షేత్రమే కాకుండా జిల్లాలోని రైతులకు సేవలందిస్తున్నారు. డ్రోన్‌తో గడ్డి, పైమందు పిచికారీ చేస్తూ ఉపాధి పొందుతున్నాడు.



నగరంలోని విద్యానగర్‌లో ఉండే కరుణాకర్‌రెడ్డిది కొత్తపల్లి హవేలి స్వస్థలం. తల్లిదండ్రులు కర్ర మల్లారెడ్డి–మణెమ్మలది వ్యవసాయ కుటుంబం. ఉన్నది 12గుంటలే అయినా కూరగాయలు, ఇంటి అవసరాల కోసం వరి, ఇతర భూములను కౌలుకు తీసుకుని పంటలు పండించేవారు. కాలక్రమేణా కూలీల కొరత ఏర్పడటం.. మల్లారెడ్డి మరణించడంతో అతడి కుమారుడు కరుణాకర్‌రెడ్డిపైనే భారం పడింది. పదో తరగతి వరకు చదివిన కరుణాకర్ విత్తన కంపెనీలో పనిచేస్తుండగా పూర్తిగా వ్యవసాయం వైపు దృష్టి మళ్లించాడు. కూలీల కొరత తీవ్రంగా ఉండటంతో పనుల ఆలస్యంతో దిగుబడిపై ప్రభావం చూపేది. ఈ క్రమంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్న కరుణాకర్‌రెడ్డి పిచికారీకి డ్రోన్, ట్రాక్టర్ అచ్చుతో పత్తి వేసి ట్రాక్టర్‌తోనే కలుపు దున్నడం, దౌర తోలడం పూర్తిగా కూలీలు లేకున్నా సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్నాడు.

సమయం ఆదా

డ్రోన్‌తో పిచికారీ వల్ల ఎంతో సమయం ఆదా అవుతోంది. వర్షాల వల్ల చేనులో అడుగు పెట్టే పరిస్థితి లేదు. 20 నిమిషాల్లో 5ఎకరాల వరకు పిచికారీ అవుతుండగా రైతు ఇతర పనులను చేసుకోవచ్చు. చార్జింగ్ ద్వారా డ్రోన్ పని చేస్తుండగా పెట్రోల్, డీజిల్ ఖర్చు లేదు. ప్రస్తుతం వర్షాలు ఎక్కువగా కురుస్తున్నందున దాదాపు చేలన్నీ కలుపుతో నిండిపోయాయి. మందు కొట్టాలంటే నేల తడిగా ఉండటంతో కాలు పెట్టలేరు. ఈ సమయంలో డ్రోన్ ద్వారా పిచికారీ చేయడం సులభం. కేవలం 18లీటర్లతో ఎకరం పిచికారీ చేయడం దీని ప్రత్యేకత. దీంతో రైతులు డ్రోన్ వైపే మొగ్గుచూపుతున్నారు.

నాలుగు నిమిషాల్లోనే ఎకరం..

మామూలుగా ఇద్దరు వ్యక్తులు పైమందు పిచికారీ చేస్తే పదెకరాలకు మించి పని చేయలేరు. కానీ డ్రోన్‌తో వంద ఎకరాల వరకు పిచికారీ చేస్తున్నాడు. నాలుగు నిమిషాల్లో ఎకరం పిచికారీ అవుతుండగా కేవలం ఒక్కరే పిచికారీ చేసుకోవచ్చు. గడ్డి మందు, పైమందు దీంతో సులువు కావడంతో తోటి రైతులు ఇదే విధానాన్ని అనుసరిస్తున్నారు. రైతులకు కూలీ ఖర్చులు తప్పుతుండగా అతి తక్కువ సమయంలో పిచికారీ పూర్తవుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో వర్షాలు ఏ సమయంలో కురుస్తాయో తెలియని పరిస్థితి. అతి వర్షంలో నేల తడిచిపోగా కాలు పెట్టలేని పరిస్థితి. దీంతో అడుగుపెట్టకుండానే గాలిలోనే పిచికారీ చేయొచ్చు. కరీంనగర్ రూరల్, మానకొండూరు, శంకరపట్నం, జమ్మికుంట, గంగాధర, రామడుగు మండలాలతో పాటు రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలోని రైతులకు సాయమందిస్తూ.. ఉపాధి పొందుతున్నాడు.

డ్రోన్‌తో ఉపాధి



పిచికారీ చేయడం అదో సవాల్‌గా మారింది. కూలీలు దొరకడం లేదు. సకాలంలో పిచికారీ చేస్తేనే పంటను కాపాడుకోగలం. అందుకే యూట్యూబ్ ద్వారా డ్రోన్ గురించి తెలుసుకుని రూ.13లక్షలకు కొనుగోలు చేశా. నా చేనుతో పాటు దాదాపు ఉమ్మడి జిల్లా తిరుగుతూ సేవలందిస్తున్నా. చాలా సంతోషంగా ఉంది.

– కర్ర కరుణాకర్‌రెడ్డి, యువ రైతు

నాణ్యతలేని పనులపై బీజేపీ నిరసన


నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: నెల రోజులు గడవక ముందే కేబుల్ బ్రిడ్జి అప్రోచ్ రోడ్డు పగుళ్లు రావడాన్ని నిరసిస్తూ అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని శనివారం కేబుల్ బ్రిడ్జి వద్ద బీజేపీ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బాస సత్యనారాయణరావు, కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్‌గౌడ్‌లు పాల్గొని మాట్లాడుతూ వందేళ్లు నిలవాల్సిన నిర్మాణ పనులు నాణ్యత లేని కారణంగా నెలరోజులకే పగుళ్లు బయటపడ్డాయని విమర్శించారు. పనులపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులైన అధికారులు, కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కళ్లెం వాసుదేవరెడ్డి, దూబల శ్రీనివాస్, యెన్నం ప్రకాశ్, మంథని కిరణ్, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్, సుధాకర్ పటేల్, బొంతల కళ్యాణ్ చంద్ర, జానపట్ల స్వామి, కొలగాని శ్రీనివాస్, కచ్చు రవి, జితేందర్, జాడి బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ బ్రిడ్జి పగుళ్లపై విచారణ జరిపించాలి

విద్యానగర్: కేబుల్ బ్రిడ్జ్ పగుళ్లు, వంతెన అప్రోచ్ రోడ్డు కుంగి పోవడం, సిమెంట్ గోడలకు పగుళ్లు రావడం సిగ్గుచేటని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కల్యాడపు ఆగయ్య ఒక ప్రకటనలో విమర్శించారు. విచారణ జరిపించి అవినీతిపరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రేకుర్తిలో పేద ముస్లింల కోసమే ఎకరం భూమి


మాట్లాడుతున్న అన్నేమల్ల సురేశ్

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ రేకుర్తిలోని సర్వే నంబర్ 194లో గల 88 ఎకరాల 3 గుంటల భూమిలో ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ అడిగిన ఎకరం భూమి పేద ముస్లిం ఇళ్ల నిర్మాణం కోసమేనని ఎంఐఎం పార్టీ 43వ డివిజన్ అధ్యక్షుడు అన్నేమల్ల సురేశ్ అన్నారు. శనివారం కరీంనగర్‌లోని ఎంఐఎం పార్టీ కార్యాలయం దారుస్సలాంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గులాం అహ్మద్‌పై మంత్రి ప్రోద్బలంతో రేకుర్తి భూముల విషయంలో అసత్యాలు ప్రచారం చేస్తున్నరని ఆరోపించారు. 2018లో ముస్లిం సమాజానికి ఇచ్చిన హామీలు అమలు చేయమంటే ఎంఐఎంపై, ముస్లింలపై విష ప్రచారం చేయించడం సిగ్గుచేటన్నారు. రేకుర్తి భూముల విషయంలో మంత్రి అనుచరుడైన రియల్ ఎస్టేట్ వ్యాపారి బారాజు రత్నాకర్‌రెడ్డి ఎంఐఎం పార్టీపై, కరీంనగర్ నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్‌పై చేసిన విమర్శలను ఖండించారు. ఈ సమావేశంలో ఎంఐఎం నాయకులు అహ్మద్ ఖాన్, ఎండి సాజిద్, ఫర్హాజ్ అలీ, సాజిద్ మాజిద్, నోమాన్, నియాజ్, బాస్, ఇస్మాయిల్, మీర్జా పాషా, షేఖ్ సమీ, జాకీర్, 20 డివిజన్ల నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ శ్రేణుల సంబరాలు



కరీంనగర్‌టౌన్: భారతీయ జనతా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ నియమితులైన సందర్భంగా శనివారం కరీంనగర్‌లో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. తెలంగాణ చౌక్‌లో టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీజేపీలో అతి సామాన్య కార్యకర్త నుంచి రాష్ట్ర అధ్యక్షుడిగా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా, నేడు జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎదిగిన తీరు, ప్రజా ఆశీస్సులతో కార్పొరేటర్ నుంచి ఎంపీగా కొనసాగుతున్న బండి సంజయ్ క్షేత్రస్థాయిలో దిగ్విజయ నేత అని కొనియాడారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

3, 4వ తేదీల్లో పద్మ బ్రాహ్మణ పౌరోహిత సంఘం మహాసభలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సంఘం బాధ్యులు

విద్యానగర్(కరీంనగర్): అఖిల భారత పద్మ బ్రాహ్మణ పౌరోహిత సంఘం 25వ మహాసభలు ఆగస్టు 3, 4వ తేదీల్లో కర్ణాటకలోని గోకర్ణ పుణ్యక్షేత్రంలో జరుగుతాయని ఆ సంఘం ప్రధాన కార్యదర్శి చిలుక నర్సప్ప తెలిపారు. శనివారం మహాసభలకు సంబంధించిన కరపత్రాలను కరీంనగర్‌లో ఆవిష్కరించారు. రెండు రోజుల పాటు జరిగే మహాసభలో పద్మ బ్రాహ్మణ పౌరోహితులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కరపత్రాల ఆవిష్కరణలో కామినీ అనిల్, గాంజెగి భూపతి, మంచకట్ల కోటేశ్వర్, మచ్చ మల్లేశం, పురుషోత్తం, శంకర్, రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి గంగులకు సన్మానం


మంత్రిని సన్మానిస్తున్న నాయకులు

విద్యానగర్(కరీంనగర్): దుర్గమ్మ గడ్డ అంబేడ్కర్ యువజన సంఘం భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరు చేసిన రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌ను శనివారం ఆ సంఘం బాధ్యులు మీ సేవ కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు కల్వల రాంచందర్, ముఖ్య సలహాదారుడు సుంకె సత్యనారాయణ, సలహాదారుడు తాండ్ర శంకర్‌బాబు, అధ్యక్షుడు సుంచు నరేశ్, ఉపాధ్యక్షుడు కాశపాక శ్యాం, ప్రధాన కార్యదర్శి వినోద్, కోశాధికారి ఆముదాల సుదర్శన్, కొల్లాపూర్ శ్రీనివాస్, ఫారునందు, రమేశ్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కొనసాగనున్న వేణుమాధవ్

కొత్తపల్లి: కొత్తపల్లి మున్సిపల్ కమిషనర్‌గా కట్ల వేణుమాధవ్ కొనసాగనున్నారు. బదిలీల్లో భాగంగా కొత్తపల్లి కమిషనర్‌గా బదిలీ అయిన ఎ.వెంకటేశ్ పెద్దపల్లికి బదిలీ కాగా ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న వేణుమాధవ్‌ను తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు కొనసాగిస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది.

నియామకం


నియామకపత్రం అందజేస్తున్న ఆది మల్లేశం

కరీంనగర్‌కల్చరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా ఉపాధ్యక్షురాలిగా చుక్కల గంగాభవానీని ఎంపిక చేసినట్లు సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఆది మల్లేశం తెలిపారు. శనివారం సంఘం కార్యాలయంలో నియామక పత్రం అందజేశారు. కార్యక్రమంలో యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సంక్షేమ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చిగుర్ల శ్రీనివాస్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్య పాఠశాలకు మరో అవార్డు


అవార్డు అందుకుంటున్న ముస్తాక్ అలీ

కరీంనగర్: నగరంలోని లక్ష్య ఇంటర్నేషనల్ స్కూల్ తాజాగా మరో అవార్డు అందుకుంది. అత్యంత ప్రభావవంతమైన అభ్యసన పద్ధతులను అనుసరిస్తున్నందుకు గ్లోబల్ స్కూల్ లీడర్స్ కన్సార్టియం వారి జ్యూరీ నిపుణులు 'బెస్ట్ స్కూల్ ఆఫ్ ద ఇయర్ విత్ మోస్ట్ ఇంపాక్టివ్ లెర్నింగ్ మెథడ్స్' అవార్డుకు ఎంపిక చేశారు. అవార్డును స్వీకరించిన పాఠశాల చైర్మన్ ముస్తాక్ అలీ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా అనేక రకాల పోటీల్లో విద్యార్థులను పాల్గొనేటట్లు చేసి ప్రోత్సహించడం తృప్తినిచ్చే విషయమన్నారు. ఇలాంటి అవార్డులు మేము విద్యారంగంలో సాధిస్తున్నటువంటి విజయాలకు గీటురాయి అని వెల్లడించారు.

ఆధ్యాత్మికం

వైభవంగా లక్ష్మీనారాయణ యాగం



కరీంనగర్‌కల్చరల్: పరమ పవిత్రమైన అధిక శ్రావణ మాసం ఏకాదశి శనివారం పురుషోత్తమ మాసంను పురస్కరించుకొని బొమ్మకల్‌రోడ్డులోని పరంధామాశ్రమం పంచముఖ ఆంజనేయ స్వామి ఆలయంలో అత్యంత వైభవంగా లక్ష్మీనారాయణ యాగం నిర్వహించారు. పరబ్రహ్మనందగిరి స్వామీజీ, శతాధిక ప్రతిష్ఠాపన చార్యులు జ్యోతిష్యవాస్తు ఆగమ శాస్త్ర పండితులు నమిలకొండ రమణచార్య ఆధ్వర్యంలో ఉదయం విశ్వక్సేన పూజా, పుణ్యాహవాచనం, లక్ష్మీనారాయణ కళశ స్థాపన, పంచసూక్త పంచామృత పంచోపనిషత్ అభిషేకాలు, అర్చనలు, ఆరాధనలు లక్ష్మీనారాయణ హోమాలు జరిగాయి. చాలా ఏళ్ల తర్వాత అధిక శ్రావణమాసం రావడం, అందులో ఏకాదశి శనివారం రావడం భగవంతునికి చాలా ప్రీతకరమైనదని అందుకోసమే లోకకల్యాణార్థం ఈ యాగాన్ని సంకల్పించామని రమణాచార్యులు తెలిపారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విష్ణు సహస్రనామ పారాయణాలు, హనుమాన్ చాలీసా పారాయణాలు, భజనలు, హరినామ సంకీర్తనలు చేశారు. అనంతరం తీర్థప్రసాదాలను అర్చకులు అందించారు. ఈ కార్యక్రమంలో యాగ్నీకులు రామకృష్ణమాచార్యులు కలకుంట్ల గోపాల కృష్ణమాచార్యులు, రమేశ్‌స్వామి, ఆలయ కమిటీ సభ్యులు అధ్యక్షుడు బుస్స శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పిట్ల స్వామి, కోశాధికారి దేవిశెట్టి హనుమాన్లు, విద్యాసాగర్, విశ్వనాథం, రాజేందర్, వెంకటేశ్వర్లు. రమేశ్‌స్వామి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మొహర్రం



కొత్తపల్లి: కొత్తపల్లి పట్టణంలో మొహర్రం వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పుర వీధుల్లో పీరీలను ఊరేగించారు. మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు ఎండీ ఫక్రుద్దీన్, మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు జమీలొద్దీన్, బీఆర్ఎస్ నాయకులు ఎస్కే బాబా, మునవర్‌ఖాన్, ముస్లీం మత గురువులు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.



షర్బత్ పంపిణీ


విద్యానగర్: కరీంనగర్‌లోని పురాతన జామా మసీద్ వద్ద ఎంఐఎం పార్టీ నాయకుడు సయ్యద్ హమారుద్దీన్ ఆధ్వర్యంలో షర్బత్ పంపిణీ చేశారు. ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్, ప్రధాన కార్యదర్శి బర్కత్ అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ ఫెరోస్, కార్పొరేటర్ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది డిమాండ్లు నెరవేర్చాలి


దీక్షకు సంఘీభావం తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

కరీంనగర్‌టౌన్: పంచాయితీ సిబ్బంది న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద 24 రోజులుగా చేస్తున్న దీక్ష శిబిరాన్ని శనివారం సందర్శించి మాట్లాడారు. పీఆర్సీలో నిర్ణయించిన విధంగా మినిమం బేసిక్ వేతనాలు కూడా చెల్లించకుండా గ్రామపంచాయతీల్లో అన్ని పనులు చేపించుకోవడం శ్రమదోపిడీకి గురిచేయడమేనని అన్నారు. న్యాయమైన డిమాండ్లు పరిష్కారమయ్యేంతవరకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూర అంజిరెడ్డి, కాశిపాక శంకర్, పడెల్లి సంపత్, మహేష్, లక్ష్మి, పోశమ్మ, రాజయ్య, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, ఎండీ చాంద్, మంద మహేష్, మామిడి సత్యనారాయణరెడ్డి, షేక్ శోహెన్ష, కమల్ తదితరులు పాల్గొన్నారు.

పవర్ కట్ ప్రాంతాలు



కొత్తపల్లి: కరీంనగర్‌లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు 11కేవీ విద్యానగర్ ఫీడర్ పరిధిలోని విద్యానగర్, విజయదుర్గకాలనీ, మామిడితోట, ఆదిత్యనగర్, ఆర్టీసీ వర్క్‌షాను వెనుక ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు. అదేవిధంగా స్మార్ట్‌సిటీ పనులు చేపడుతున్నందున 11 కేవీ అల్కాపురి ఫీడర్ పరిధిలోని అల్కాపురి, కోతిరాంపూర్, హనుమాన్‌నగర్, గణేశ్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నేడు 'బాలగేయ సారస్వతం' పుస్తకావిష్కరణ

కరీంనగర్‌కల్చరల్: భవానీ సాహిత్య వేదిక కరీంనగర్ ఆధ్వర్యంలో కవి, రచయిత, విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన బాలగేయ సారస్వతం గేయ సంకలనం ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం నగరంలోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు సంస్థ బాధ్యులు వైరాగ్యం ప్రభాకర్, గంగుల శ్రీకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ముఖ్యఅతిథిగా హాజరై గ్రంథాన్ని ఆవిష్కరిస్తారని అన్నారు. అలాగే గాంధీ గ్లోబల్ ఫ్యామిలీ, గాంధీ జ్ఞాన్ ప్రతిష్ఠాన్ వారి 2023 బాపు డైరీని ఆవిష్కరిస్తారని, విశిష్ట అతిథులుగా రాష్ట్ర విశిష్ట మహిళా పురస్కార గ్రహీత డాక్టర్ కందేపి రాణీప్రసాద్, అసిస్టెంట్ ప్రొఫెసర్ బూర్ల వెంకటేశ్వర్లు హాజరుకానున్నట్లు తెలిపారు. సాహిత్య అభిమానులు, కవులు హాజరు కావాలని కోరారు.

బైపాస్‌పై రాకపోకలు యథాతథం



కొత్తపల్లి శివారులోని కరీంనగర్–జగిత్యాల బైపాస్‌పై రాకపోకలు యథావిధిగా ప్రారంభమయ్యాయి. వారం రోజుల పాటు కురిసిన వర్షాలకు ఎగువ ప్రాంతం నుంచి వచ్చిన వరదతో లోలెవల్ వంతెన పూర్తిగా మునిగింది. వరద ఉధృతితో మూడు రోజుల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. రెండు రోజులుగా వాన దేవుడు కరుణించడంతో వరద ఉధృతి పూర్తిగా తగ్గుముఖం పట్టింది. దీంతో బైపాస్ రోడ్డులోని కాజ్‌వే పై రాకపోకలకు పోలీసులు అనుమతిచ్చారు. – కొత్తపల్లి



మను భాకర్‌కు రెండు స్వర్ణాలు

వరల్డ్ యూనివర్సిటీ గేమ్స్‌లో భారత అగ్రశ్రేణి షూటర్ మనూ భాకర్ రెండు పసిడి పతకాలతో మెరిసింది. ఓవరాల్‌గా ఈ పోటీల్లో శనివారం భారత్ ఖాతాలో 3 స్వర్ణాలు, ఒక కాంస్యం చేరాయి. భారత్ ఖాతాలో చైనాలోని చెంగ్డూలో జరుగుతున్న క్రీడల్లో భాకర్ 10 మీటర్ల ఎయిర్‌పిస్టల్ వ్యక్తిగత, మహిళల టీమ్ విభాగాల్లో స్వర్ణాలు సాధించింది. టీమ్ ఈవెంట్‌లో ఆమెతో పాటు యశస్విని సింగ్ దేశ్వాల్, అభింద్య అశోక్ పాటిల్ సభ్యులుగా ఉన్నారు. 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ విభాగంలోనూ భారత్‌కు చెందిన ఎలవెనిల్ వలరివన్ స్వర్ణ పతకం గెలుచుకుంది. మరో వైపు జూడో 57 కేజీల మహిళల విభాగంలో భారత్‌కు చెందిన యామిని మౌర్య కాంస్య పతకం సాధించింది.

భారత్ 181 ఆలౌట్

- రాణించిన ఇషాన్ కిషన్
- కట్టడి చేసిన షెఫర్డ్, మోతీ
- విండీస్‌తో రెండో వన్డే



బ్రిడ్జ్‌టౌన్: కరీబియన్‌లో భారత జట్టు ప్రపంచకప్ సన్నాహం పేలవంగా సాగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న వన్డే సిరీస్‌లో ఆశావహులే కాదు... కచ్చితంగా పరిశీలనలో ఉన్న క్రికెటర్లు కూడా నిరాశపరిచారు. శనివారం జరిగిన రెండో వన్డేలో పాండ్యా, జడేజా మినహా పూర్తి స్థాయిలో కుర్రాళ్ల జట్టునే బరిలోకి దించినా... వారి ఆటతీరు కూడా తీసికట్టుగా సాగింది. మొదట బ్యాటింగ్‌కు దిగిన భారత్ 40.5 ఓవర్లలో 181 పరుగులకే ఆలౌటైంది. ఇషాన్ కిషన్ (55 బంతుల్లో 55; 6 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ సాధించగా, శుబ్‌మన్ గిల్ (49 బంతుల్లో 34; 5 ఫోర్లు) రాణించాడు. రొమారియో షెఫర్డ్ (3/37), గుడకేశ్ మోతీ (3/36), అల్జారి జోసెఫ్ (2/35) కలిసికట్టుగా భారత్‌ను కట్టడిచేశారు. కుర్రాళ్లను పరీక్షించడం కోసం స్టార్ బ్యాటర్ కోహ్లి, కెప్టెన్ రోహిత్ శర్మలకు రెండో వన్డేలో విశ్రాంతి ఇవ్వడంతో హార్దిక్ పాండ్యా ఈ మ్యాచ్‌కు నాయకత్వం వహించాడు. ఆ ఇద్దరి స్థానాల్లో సంజూ సామ్సన్, అక్షర్ పటేల్‌లను తుది జట్టులోకి తీసుకున్నారు.

అనంతరం 182 పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్ కడపటి వార్తలందేసరికి 10 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 64 పరుగులు చేసింది.

ఓపెనర్లు మినహా...

టాస్ నెగ్గిన విండీస్ ఫీల్డింగ్ ఎంచుకోగానే... భారత బ్యాటింగ్ లైనప్ చూసుకొని సగటు క్రికెట్ అభిమాని గర్వం! ఇక మనవాళ్లు కుమ్మేస్తారనే గంపెడాశలు! కానీ 50 ఓవర్ల పాటు కూడా కరీబియన్ బౌలింగ్‌ను ఎదుర్కోలేకపోవడమే పెద్ద షాక్. ఇన్నింగ్స్ ఓపెన్ చేసిన ఇషాన్ కిషన్ గానీ, శుబ్‌మన్ గిల్ గానీ చెప్పుకోదగ్గ మెరుపులే మెరిపించలేదు. అయితే భారత ఇన్నింగ్స్‌లో వీళ్లిద్దరే కుదురుగా ఆడారు. దీంతో జోరు లేకపోయినా స్కోరు బోర్డు మందకొడిగా సాగింది. అడపాదడపా బౌండరీలే తప్ప అలరించే సిక్సర్లు కరువయ్యాయి. గుడ్డిలో మెల్ల అన్న చందంగా ఇషాన్ కొట్టిన ఏకైక సిక్సరే ఇన్నింగ్స్‌కు బంగారమైంది! ఆ తర్వాత హార్డ్ హిట్టర్లు సూర్యకుమార్, హార్దిక్ పాండ్యాల వల్ల కూడా ఒక్క సిక్సర్ అయినా నమోదు కాలేదు. 17వ ఓవర్లో ఇషాన్ ఇషాన్ ఫిఫ్టీ 51 బంతుల్లో పూర్తికాగానే... అదే ఓవర్లో శుబ్‌మన్ నిష్క్రమించాడు. దీంతో 90 పరుగుల ఓపెనింగ్ భాగస్వామ్యం ముగిసింది. మరుసటి ఓవర్లో ఇషాన్ ఆటకు షెఫర్డ్ చెక్ పెట్టాడు. వీళ్లిద్దరు ఉన్నంతసేపే పరుగులొచ్చాయి. ఆ తర్వాత వికెట్లే రాలాయి. అక్షర్ పటేల్ (1)ను నాలుగో స్థానంలో ప్రమోషన్‌గా దింపితే తీవ్రంగా నిరాశ పరిచాడు. 97 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయిన దశలో ఆదుకుంటాడనుకున్న పాండ్యా (7) కూడా ప్రత్యర్థి బౌలింగ్‌కు తలవంచాడు. సూర్యకుమార్ (25 బంతుల్లో 24; 3 ఫోర్లు) మెరిపించలేకపోయినా కాసేపు కుదురుగా ఆడాడు. జడేజా (10), శార్దుల్ (16; 2 ఫోర్లు) ఇలా అందరు వచ్చిన దార్లోనే పెవిలియన్ చేరడంతో మొదటి 90 పరుగుల వరకు వికెట్ కోల్పోని భారత్... తర్వాతి 91 పరుగులకే అన్ని వికెట్లు (10) కోల్పోయి సుమారు పది ఓవర్ల ముందే ఆలౌటైంది.



స్కోరు వివరాలు

భారత్ ఇన్నింగ్స్: ఇషాన్ (సి) అతనెజ్ (బి) షెఫర్డ్ 55; గిల్ (సి) జోసెఫ్ (బి) మోతీ 34; సామ్సన్ (సి) కింగ్ (బి) కరియ 9; అక్షర్ (సి) హోప్ (బి) షెఫర్డ్ 1; పాండ్యా (సి) కింగ్ (బి) సీల్స్ 7; సూర్యకుమార్ (సి) అతనెజ్ (బి) మోతీ 24; జడేజా (సి) కరియ (బి) షెఫర్డ్ 10; శార్దుల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) జోసెఫ్ 16; కుల్దీప్ నాటౌట్ 8; ఉమ్రాన్ (సి) కార్టీ (బి) జోసెఫ్ 0; ముకేశ్ (సి) హెట్‌మైర్ (బి) మోతీ 6; ఎక్స్‌ట్రాలు 11; **మొత్తం (40.5 ఓవర్లలో ఆలౌట్) 181. వికెట్ల పతనం:** 1-90, 2-95, 3-97, 4-113, 5-113, 6-146, 7-148, 8-167, 9-167, 10-181. **బౌలింగ్:** మేయర్స్ 5-0-18-0, సీలెస్ 6-0-28-1, జోసెఫ్ 7-0-35-2, గుడకేశ్ మోతీ 9.5-0-36-3, షెఫర్డ్ 8-1-37-3, కరియ 5-0-25-1.

పోరాడి ఓడిన లక్ష్యసేన్

జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్



టోక్యో: బీడబ్ల్యూఎఫ్ టూర్ సూపర్-750 జపాన్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో భారత షట్లర్ లక్ష్య సేన్ ఆట ముగిసింది. శనివారం జరిగిన సెమీఫైనల్లో లక్ష్య పోరాడి ఓడాడు. ఈ మ్యాచ్‌లో ఇండోనేసియాకు చెందిన ఐదో సీడ్ జొనాథన్ క్రిస్టీ 21-15, 13-21, 21-16 స్కోరుతో సేన్‌ను ఓడించాడు. 68 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన ఈ పోరు తొలి గేమ్‌లో క్రిస్టీ చేసిన పొరపాట్లతో సేన్ 7-4తో ముందంజ వేశాడు. ఆ తర్వాత ఒక్కసారిగా చెలరేగిన క్రిస్టీ 15-12తో ఆధిక్యంలోకి వచ్చేశాడు. రెండో గేమ్‌లో చక్కటి సర్వీస్, ర్యాలీలతో 11-5తో సేన్ ముందంజ వేశాడు. ఆపై పదునైన స్మాష్‌లతో చెలరేగి భారత షట్లర్ రెండో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. చివరి గేమ్‌లో మాత్రం మొదటినుంచి ఆధిక్యం ప్రదర్శించిన క్రిస్టీ చివరి వరకు దానిని నిలబెట్టుకున్నాడు.

భారత మహిళల ఘన విజయం

3-0తో ఇంగ్లండ్ చిత్తు

బార్సిలోనా: స్పానిష్ హాకీ ఫెడరేషన్ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా జరుగుతున్న టోర్నీలో భారత మహిళల జట్టుకు తొలి విజయం దక్కింది. శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 3-0 గోల్స్ తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. భారత్ తరఫున అన్నీ గోల్స్ తానే సాధించిన లాల్‌రెమ్‌సియామి 'హ్యాట్రిక్' నమోదు చేయడం విశేషం. మ్యాచ్ 13వ, 17వ, 56వ నిమిషాల్లో ఆమె మూడు ఫీల్డ్ గోల్స్ కొట్టింది. మొదటి, రెండో క్వార్టర్‌లో ఒక్కో గోల్ సాధించిన భారత్ చివరి క్వార్టర్‌లో మరో గోల్‌తో ముగించింది. ఈ టోర్నీలో రౌండ్ రాబిన్ లీగ్ దశలో ఇంగ్లండ్, స్పెయిన్‌లతో తొలి రెండు మ్యాచ్‌లను భారత్ 'డ్రా'గా ముగించింది. సవితా పూనియా నాయకత్వంలోని మన జట్టు తమ తర్వాతి పోరులో నేడు స్పెయిన్‌తో తలపడుతుంది.



లాల్‌రెమ్‌సియామి

వెర్‌స్టాపెన్‌కు పోల్

స్పా-ఫ్రాంకోర్‌చాంప్స్ (బెల్జియం): గత వారం హంగేరియన్ గ్రాండ్‌ప్రిలో పోల్ పొజిషన్ సాధించడంలో విఫలమైన మ్యాక్స్ వెర్‌స్టాపెన్ (రెడ్‌బుల్) ఈ సారి మళ్లీ ఆధిపత్యాన్ని ప్రదర్శించాడు. శనివారం జరిగిన బెల్జియన్ గ్రాండ్ ప్రి క్వాలిఫయింగ్ రేసులో అగ్ర స్థానంలో నిలిచిన అతను 0.011 సెకన్ల తేడాతో పోల్ పొజిషన్‌ను సాధించాడు. ల్యాప్‌ను అందరికంటే వేగంగా 1 నిమిషం 49.056 సెకన్లలో వెర్‌స్టాపెన్ పూర్తి చేశాడు. మెక్లారెన్ డ్రైవర్ ఆస్కార్ పియాస్ట్రీ (1 నిమిషం 49.067 సె.) రెండో స్థానంలో నిలవగా, కార్లోస్ సెయింజ్ (ఫెరారీ - 1 నిమిష 49.081 సె.)కు మూడో స్థానం దక్కింది.

అదరగొట్టిన ఇంగ్లండ్

- రెండో ఇన్నింగ్స్‌లో 389/9
- ఆసీస్‌తో చివరి 'యాషెస్' టెస్టు

లండన్: తొలి రోజునుంచే ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ప్రతిష్టాత్మక 'యాషెస్' సిరీస్‌లో మరో రసవత్తర ముగింపునకు రంగం సిద్ధమైంది. చివరిదైన ఐదో టెస్టును గెలుచుకునే ప్రయత్నంలో ఇంగ్లండ్ బలంగా పట్టు బిగించింది. పదునైన బ్యాటింగ్‌తో చెలరేగి ఆస్ట్రేలియా ముందు దాదాపు అసాధ్యమైన లక్ష్యాన్ని ఉంచేందుకు సిద్ధమైంది. మ్యాచ్ మూడో రోజు శనివారం ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 9 వికెట్ల నష్టానికి 389 పరుగులు చేసింది. అండర్సన్ (8 బ్యాటింగ్), బ్రాడ్ (2 బ్యాటింగ్) క్రీజ్‌లో ఉన్నారు. ఇప్పటికే ఆ జట్టు 377 పరుగుల ఆధిక్యంలో ఉంది. మిగిలిన రెండు రోజులు ఆసీస్ బ్యాటర్లు నిలబడి లక్ష్యాన్ని ఛేదిస్తారా లేక ఇంగ్లండ్ 2-2తో సిరీస్‌ను సమం చేస్తుందా చూడాలి.



బెయిర్‌స్టో

ఇంగ్లండ్ మరోసారి తమ బ్యాటింగ్‌లో తొలి బంతినుంచే 'బజ్‌బాల్' దూకుడును ప్రదర్శించింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (76 బంతుల్లో 73; 9 ఫోర్లు), బెన్ డకెట్ (55 బంతుల్లో 42; 7 ఫోర్లు) ఎప్పటిలాగే ధాటిగా ఇన్నింగ్స్‌ను ప్రారంభించారు. వీరిద్దరు తొలి వికెట్‌కు 17 ఓవర్లలోనే 79 పరుగులు జోడించారు. మూడో స్థానంలో వచ్చిన కెప్టెన్ బెన్ స్టోక్స్ (67 బంతుల్లో 42; 3 ఫోర్లు, 1 సిక్స్) కూడా జోరు తగ్గకుండా బ్యాటింగ్ కొనసాగించాడు. అనంతరం జో రూట్ (106 బంతుల్లో 91; 11 ఫోర్లు, 1 సిక్స్), జానీ బెయిర్‌స్టో (103 బంతుల్లో 78; 11 ఫోర్లు) ఇన్నింగ్స్‌లు ఇంగ్లండ్‌ను మరింత పటిష్ట స్థితికి చేర్చాయి. రూట్, బెయి ర్‌స్టో ఐదో వికెట్‌కు 110 పరుగులు జత చేశారు. 2019లోనూ ఇంగ్లండ్ గడ్డపై జరిగిన 'యాషెస్' సిరీస్ 2-2తో సమంగా ముగిసింది. ఇరు జట్లు చెరో 2 టెస్టులు గెలవగా, మరో టెస్టు 'డ్రా' అయింది. ఆ తర్వాత 2021లో తమ సొంతగడ్డపై జరిగిన 'యాషెస్'లో ఆస్ట్రేలియా 4-0తో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది.

'డెమెంతియా' బాధితులకు మద్దతుగా...

మూడో రోజు ఆటలో ఇంగ్లండ్ ఆటగాళ్లు భిన్నమైన రీతిలో డెమెంతియా (మతిమరపు) వ్యాధిగ్రస్తులకు సంఘీభావం ప్రకటించారు. ప్రతీ ఆటగాడు తమ పేరు రాసి ఉన్న జెర్సీ కాకుండా జట్టులోని మరో సభ్యుడి జెర్సీని ధరించి మైదానంలోకి దిగారు. మతిమరపు కారణంగా తమ వస్తువులను గుర్తించడంలో గందరగోళానికి గురి కావడం 'డెమెంతియా' లక్షణాల్లో ఒకటి. బ్రాడ్ పేరుతో అండర్సన్, స్టోక్స్ పేరుతో బెయిర్‌స్టో, వోక్స్ పేరుతో అలీ...ఇలా ఆటగాళ్లు టీ షర్ట్‌లు ధరించి ఆడారు.



జో రూట్

రిటైర్మెంట్ ప్రకటించిన బ్రాడ్

ఇంగ్లండ్ పేస్ బౌలర్ స్టువర్ట్ బ్రాడ్ 17 ఏళ్ల అంతర్జాతీయ క్రికెట్‌నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించాడు. ప్రస్తుతం ఓవల్‌లో జరుగుతున్న మ్యాచే తనకు చివరి టెస్టు అని 37 ఏళ్ల బ్రాడ్ వెల్లడించాడు. యాషెస్‌లో చివరి టెస్టుకు ముందు 166 టెస్టుల్లో 27.68 సగటుతో 600 వికెట్లు తీసిన బ్రాడ్, అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ల జాబితాలో ఐదో స్థానంలో కొనసాగుతున్నాడు. 2016లో చివరి వన్డే ఆడిన బ్రాడ్ అప్పటినుంచి ఒక్క టెస్టులకే పరిమితమయ్యాడు.

సినిమా

ప్రయోగం, పరిశోధన, భవిష్యత్ కాల ప్రయాణం, మరమనిషి... ఇలా సైంటిఫిక్ ఎలిమెంట్స్‌తో ముడిపడిపోయారు కొందరు నటీనటులు. సైన్స్ ఫిక్షన్ చిత్రాలకు సై అంటూ సైన్ చేశారు. ఈ స్టార్స్ చేస్తున్న వెండితెర సైన్స్ ప్రాజెక్ట్స్ వివరాలు తెలుసుకుందాం...

సైన్స్‌కి సై



ప్రభాస్



సూర్య



శివ కార్తికేయన్



విశాల్



తాప్సీ

28వ శతాబ్దంలో...

ఉన్నట్లుండి కొన్ని వందల సంవత్సరాలు ముందుకు వెళితే ఎలా ఉంటుంది? అసలు.. 28వ శతాబ్దంలో ప్రపంచం ఎలా ఉంటుంది? అనే ఓ ఊహాత్మక కథ వెండితెరపైకి వస్తే అదే 'కల్కి 2898 ఏడీ' చిత్రమట. ప్రభాస్, కమల్‌హాసన్, అమితాబ్ బచ్చన్, దీపికా పదుకోన్, దిశా పటానీ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న సైన్స్ ఫిక్షన్ అండ్ టైమ్ ట్రావెల్ ఫిల్మ్ 'కల్కి 2898 ఏడీ'. 'మహానటి' ఫేమ్ నాగ్ అశ్విన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. 18వ శతాబ్దంలో మొదలై 28వ శతాబ్దంలోకి ఈ కథ వెళ్తుందని ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. ఈ సినిమా రెండు భాగాలుగా రిలీజయ్యే చాన్స్ ఉందని టాక్. అశ్వనీదత్ నిర్మిస్తున్న ఈ చిత్రం వచ్చే ఏడాది విడుదల కానుంది.

చారిత్రాత్మక కంగువా

ఇటీవల విడుదలైన 'కంగువా' సినిమా వీడియో గ్లింప్స్‌ను బట్టి ఇది పూర్తి చారిత్రాత్మక నేపథ్యం ఉన్న సినిమా అనేది కొందరి ఊహ. కానీ చారిత్రాత్మక భాగం కొంతవరకే ఉంటుందని, ఎక్కువ శాతం సమకాలీన కాలంలోనే జరుగుతుందని తెలిసింది. అలాగే కొంత భాగం 18వ శతాబ్దంలో ఉంటుందని, పరాక్రమవంతుడైన ఓ యోధుడు అంతు చిక్కని వ్యాధితో మరణించి, అతనే మళ్లీ జన్మించి, గత జన్మలో తాను ఎలా మరణించాడో తెలుసుకునే అంశాల సమాహారంగా సైన్స్ ఫిక్షన్ ఎలిమెంట్స్‌తో 'కంగువా' కథనం ఉంటుందని భోగట్టా. సూర్య హీరోగా శివ దర్శకత్వంలో స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రంలో దిశా పటానీ హీరోయిన్. కాగా 'కంగువా' సినిమాలోని తొలి భాగం 2024 ఏప్రిల్ 12న విడుదల కానున్నట్లు సమాచారం.

ఫిక్షనల్ గ్యాంగ్‌స్టర్

సాధారణంగా సైన్స్ ఫిక్షన్ సినిమాలంటే.. విభిన్నమైన పేర్లతో ఆపరేషన్స్ చేయడం, పరిశోధనలు, ఆవిష్కరణలు వంటి అంశాలు మిళితమై ఉంటాయి. కానీ గ్యాంగ్‌స్టర్ యాక్షన్‌కు సైన్స్ ఫిక్షన్, టైమ్ ట్రావెల్ అంశాలను జోడించి ఓ కొత్త ప్రయత్నం చేశారు అధిక్ రవిచంద్రన్. విశాల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'మార్క్ ఆంటోనీ' టైమ్ ట్రావెల్ బేస్డ్ సైన్స్ ఫిక్షన్ యాక్షన్ డ్రామాగా రూపొందింది. అధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రంలో విశాల్ డిఫరెంట్ గెటప్స్‌లో కనిపిస్తారు. విశాల్‌కు జోడీగా రీతూ వర్మ నటించిన ఈ చిత్రం సెప్టెంబరు 15న రిలీజ్ కానుంది.

ఓ గ్రహాంతరవాసి కథ

ఓ గ్రహాంతరవాసి భూగ్రహంపై నివాసం ఉండాల్సి వస్తే ఏం జరుగుతుంది? అనే అంశం నేపథ్యంలో బాలీవుడ్‌లో గతంలో హృతిక్ రోషన్ 'కోయీ.. మిల్ గయా', ఆమిర్ ఖాన్ 'పీకే' వంటి సినిమాలు వచ్చిన సంగతి గుర్తుండే ఉంటుంది. కాస్త అటూ ఇటూగా ఈ చిత్రాల తరహాలోనే తమిళ సైన్స్ ఫిక్షన్ మూవీ 'అయలాన్' ఉంటుందట. శివ కార్తికేయన్ హీరోగా ఆర్. రవికుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రకుల్ ప్రీత్‌సింగ్ హీరోయిన్. ఈ సినిమాలో ఓ ఏలియన్ పాత్ర ఉన్నట్లు పోస్టర్స్ స్పష్టం చేస్తున్నాయి. ఈ ఏడాది దీపావళికి ఈ చిత్రాన్ని రిలీజ్ చేయాలనుకుంటున్నారు.

ఇండియాలో ఏలియన్స్ ఉంటే..

ఇండియాలో ఏలియన్స్ నివాసం ఏర్పాటు చేసుకోవాలనుకుంటే ఏం జరుగుతుంది? అనే పాయింట్‌తో తమిళ చిత్రం 'ఏలియన్' రూపొందుతోందట. తాప్సీ ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం ఇది. భరత్ నీలకంఠన్ దర్శకత్వం వహిస్తున్నారని తెలిసింది. ఆల్రెడీ షూటింగ్ జరుగుతోంది.



హన్సిక



కృతీ సనన్

రోబోలుగా హీరోయిన్లు

ఓ మనిషిని రోబో ప్రేమిస్తే ఎలా ఉంటుంది? అనే పాయింట్ రజనీకాంత్ 'రోబో'లో చూశాం. అయితే ఓ రోబోటిక్స్ ఎక్స్‌పర్ట్ రోబోతో ప్రేమలో పడితే, రోబోలు ప్రేమించుకుంటే.. అనే అంశాలతో హిందీలో ఓ సినిమా తెరకెక్కుతోందని టాక్. షాహిద్ కపూర్, కృతీ సనన్ జంటగా నటిస్తున్న ఓ సైన్స్ ఫిక్షన్ ఫిల్మ్ కథ ఇది అని సమాచారం. అమిత్ జోషి, ఆరాధన షా దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో రోబోగా కృతీ సనన్, రోబోటిక్ ఎక్స్‌పర్ట్ పాత్రలో షాహిద్ కపూర్ నటిస్తున్నారట. మరోవైపు 'ఎంవై 3' అనే సైన్స్ ఫిక్షన్ వెబ్ సిరీస్‌లో నటిస్తున్నారు హన్సిక. ఇందులో హన్సిక చేస్తున్న రెండు పాత్రల్లో రోబో పాత్ర ఒకటి. శ్రీశ్రీ

బిగ్ బుల్!



సంజయ్ దత్

రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వం వహిస్తున్న 'డబుల్ ఇస్మార్ట్'లో సంజయ్ దత్ కీలక పాత్ర చేయనున్నారనే వార్త శుక్రవారం గుప్పుమన్న విషయం తెలిసిందే. ఆ వార్త నిజమే అని, బిగ్ బుల్‌గా సంజయ్ దత్ పవర్‌ఫుల్ రోల్ చేస్తున్నారని ఈ చిత్ర యూనిట్ శనివారం ప్రకటించి, లుక్‌ని కూడా విడుదల చేసింది. ''డబుల్ ఇస్మార్ట్'లో సంజయ్ దత్ ఫుల్ లెంగ్త్ రోల్ చేస్తున్నారు'' అని చిత్ర యూనిట్ తెలియజేసింది. ''మాస్‌కే డైరెక్టర్ అయిన పూరి జగన్నాథ్, ఎనర్జిటిక్ రామ్‌తో కలిసి ఈ సైన్స్ ఫిక్షన్ మాస్ ఎంటర్‌టైనర్‌లో నటించడం ఆనందంగా, గర్వంగా ఉంది. వచ్చే ఏడాది మార్చి 8 ('డబుల్ ఇస్మార్ట్' విడుదల) కోసం ఎదురు చూస్తున్నాను'' అని సంజయ్ దత్ ట్వీట్ చేశారు. పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ జియాని జియానెల్లి పని చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రిలీజ్ కానుంది.

మిస్ అండ్ మిస్టర్ లేట్‌గా వస్తారు

మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి ఆగస్టు 4న థియేటర్లకు రావాలనుకున్నారు. అయితే కొన్ని పనులు మిగిలిపోయాయట. అందుకే కాస్త లేట్‌గా రావాలనుకుంటున్నారు. లేట్‌గా వచ్చినా వినోదం రెండింతలు ఇస్తామంటున్నారు. మిస్ శెట్టిగా అనుష్కా శెట్టి, మిస్టర్ పొలిశెట్టిగా నవీన్ పొలిశెట్టి నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. మహేశ్ బాబు పి. దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 4న రిలీజ్ కావాల్సింది. అయితే వాయిదా పడింది. ''పోస్ట్ ప్రొడక్షన్ పనులు పూర్తి కాకపోవడంతో సినిమాని వాయిదా వేయాల్సి వచ్చింది. అయితే అపరిమితమైన వినోదంతో వస్తాం. అతి త్వరలో థియేట్రికల్ ట్రైలర్, సినిమా విడుదల తేదీలను ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.



అనుష్క, నవీన్ పొలిశెట్టి

దర్శకుడు ఎన్.ఎస్.ఆర్. ప్రసాద్ కన్నుమూత



ఆర్యన్ రాజేష్ హీరోగా డా. డి. రామానాయుడు నిర్మించిన 'నిరీక్షణ' చిత్రం ద్వారా దర్శకుడిగా పరిచయమైన ఎన్.ఎస్.ఆర్. ప్రసాద్ (49) శనివారం తుది శ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్ పశ్చిమగోదావరి జిల్లాలోని జంగారెడ్డిగూడెం ప్రసాద్ స్వస్థలం. పలువురు ప్రముఖ దర్శకుల దగ్గర రచయితగా, ఘోస్ట్ రైటర్‌గా చేశారాయన. సీతారామ్‌గా ప్రసాద్ చిత్రపరిశ్రమవారికి సుపరిచితులు. తొలి చిత్రం 'నిరీక్షణ' తర్వాత శ్రీకాంత్ హీరోగా 'శత్రువు', నవదీప్‌తో 'నటుడు' చిత్రాలకు దర్శకత్వం వహించారు ప్రసాద్. ఆయన దర్శకత్వం వహించిన చివరి చిత్రం 'రెక్కీ'. ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. కాగా కొంత కాలంగా ప్రసాద్ కేన్సర్‌తో బాధపడుతున్నారని, ఆ వ్యాధితో పోరాడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో కన్నుమూశారని సమాచారం.

రీల్స్

అవకాశం ఇస్తే చేసి చూపిస్తాం



'దిల్' రాజు

తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి ఎన్నికలు నేడు హైదరాబాద్‌లో జరగనున్నాయి. నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్స్, ఎగ్జిబిటర్స్, స్టూడియో సెక్టార్స్ తెలుగు ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఉంటాయి. ఈ ఎన్నికల్లో నిర్మాతలు 'దిల్' రాజు, సి. కల్యాణ్ ప్యానల్స్ పోటీ పడుతున్నాయి. ఈ సందర్భంగా 'దిల్' రాజు మాట్లాడుతూ- ''చాంబర్‌లో ఉన్న నాలుగు సెక్టార్స్‌కి సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యల పరిష్కారానికి మాకు ప్రణాళికలు ఉన్నాయి. 'మా' (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్), సినీ కార్మికుల ఫెడరేషన్స్‌తో కో ఆర్డినేట్ అవుతాం. అలాగే యూఎఫ్‌ఓ, క్యూబ్ రేట్ల విషయంలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం. ఇండస్ట్రీని ముందుకు తీసుకువెళ్లేవారిని గెలిపించాలనేది మా ప్యానెల్ రిక్వెస్ట్. ఒక నిర్మాతకు ఎన్ని బ్యానర్స్ ఉన్నా కానీ ఒకే ఓటు ఉండాలి. కానీ కొందరు డిఫరెంట్ బ్యానర్స్ పెట్టుకోవడం వల్ల డబుల్ ఓట్స్ ఉన్నాయి. ఇది కరెక్ట్ కాదు. మాకు రెండేళ్లు అవకాశం ఇస్తే మేం ఏం చేస్తామో చూపిస్తాం'' అన్నారు.

చావని ప్రేమిది...



హెబ్బా, సుమన్

హెబ్బా పటేల్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సందేహం'. సతీష్ పరమవేద దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో సుమన్ ఊటుకూరు హీరో. సత్యనారాయణ పర్చా నిర్మించిన ఈ చిత్రం నుంచి సంగీత దర్శకుడు సుభాష్ ఆనంద్ స్వరపరచిన 'చచ్చినా చావని ప్రేమిది..' పాటను దర్శకుడు దశరథ్ విడుదల చేశారు. ''ఈ చిత్రంలో హెబ్బా పటేల్ డిఫరెంట్ క్యారెక్టర్ చేశారు. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్ర యూనిట్ పేర్కొంది.

సాఫ్ట్‌వేర్ టు సినిమా



రఘురామ్

రిష్వి తిమ్మరాజు, విస్మయ శ్రీ జంటగా నటించిన చిత్రం 'కృష్ణగాడు అంటే ఒక రేంజ్'. రాజేష్ దొండపాటి దర్శకత్వంలో పెట్లా కృష్ణమూర్తి, పెట్లా వెంకట సుబ్బమ్మ, పీఎస్‌కే శ్రీలత, పెట్లా రఘురామ్ మూర్తి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 4న రిలీజ్ కానుంది. పెట్లా రఘురామ్ మూర్తి మాట్లాడుతూ- ''నేను సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని. సినిమాలపై ఇష్టంతో ఇండస్ట్రీకి వచ్చి, ఘోస్ట్ రైటర్‌గా చేశాను. ఇక మా సినిమా కథ విషయానికి వస్తే... ఈ చిత్రంలో హీరో గొర్రెల కాపరి. కృష్ణగాడు అంటే ఒక రేంజ్ అని హీరో చెబుతుంటాడు. ఇదే మాటను అతను ఊరి జనంతో చెప్పించాడా లేదా? అనేది ఈ చిత్రకథ'' అన్నారు.

హీరోనా.. విలనా?



నిరోజ్

నిరోజ్ పుచ్చా హీరోగా ధీన రాజ్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'భారతీయన్స్'. శంకర్ ఎన్. అడుసుమిల్లి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 14న రిలీజ్ అయింది. శనివారం విలేకరుల సమావేశంలో నిరోజ్ పుచ్చా మాట్లాడుతూ- ''2019లో వచ్చిన ఓ షార్ట్ ఫిల్మ్‌తో నా యాక్టింగ్ జర్నీ మొదలైంది. 'భారతీయన్స్' చేస్తున్నప్పుడే నాకు విలన్‌గా చాన్స్ వస్తే, ఓకే చెప్పాను. ఎందుకంటే హీరోనా? విలనా అని కాదు.. యాక్టర్‌గా నిరూపించుకోవాలన్నదే నా లక్ష్యం'' అన్నారు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



కాపు/1st Marriage / 29y/ 5'9"/ M.Tech/SWE/36 Lakhs/PA/ కోట్ల ప్రాపర్టీ గల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9553652167 [H-788932]

SC హిందూ మాల/కట్న ప్రసక్తి లేదు/ B.Tech/C.Govt. గెజిటెడ్ ఆఫీసర్/ఇరిగేషన్ Dept/ 90,000/-PM/5'11"ఎత్తు/28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13967]

ముదిరాజ్/కట్న ప్రసక్తి లేదు/B.Tech/C. Govt.Asst. మేనేజర్/పంజాబ్ నేషనల్ బ్యాంక్/ 60,000/-PM/5'10" ఎత్తు/28సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-13967]

రాజులు/43/5'5"/B.Sc, ఫెయిర్/మేనేజర్/11L. PA, Hydలో సొంత ఇల్లు వరునికి రాజులు 1వ, 2వ(V). బ్రాహ్మణ, కమ్మ, కాపు, పద్మశాలి, రెడ్డి, A.Kక్షత్రియ 1వ వధువు కావలెను. డైరెక్ట్: 8885861136 [HA-13973]

క్రిస్టియన్ మాల/33/5'7"/B.Tech, MBA/Govt. బ్యాంక్ మేనేజర్/1 Lakh. PM/అందమైన వరునికి తగిన వధువు కావలెను. అర్జెంట్. 8919759359 [HA-13973]

క్రిస్టియన్/2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/BA, B.Ed/Govt. టీచర్/1 Lakh.PM/4 కోట్ల ఆస్తి / 5'7"ఎత్తు/41 సం॥ల పిల్లలు లేని వరుడికి తగిన వధువు కావలెను. 9550650024 [HA-13973]

యాదవ/B.Tech(సివిల్)/C.Govt.Asst. మేనేజర్/ SBI/65000/-PM/ 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-13973]

రెడ్డి/55y/ డైవర్సీ/CNB/ AP స్టేట్ Govt. లో గ్రూప్-1 ఆఫీసర్‌గా ఉంటూ, సెలవులో UK Govt.లో ఆఫీసర్‌గా జాబ్ చేస్తూ UK PR కలిగిన వరునికి ఇండియా / అబ్రాడ్‌లో సెటిల్ అయ్యేందుకు అందమైన Rich వధువు కావలెను. Ph:6303487992, నో బ్రోకర్స్. [HA-13954]

SC మాల & క్రిస్టియన్/M.Tech, NIT/Govt.AEE/ఇరిగేషన్ Dept/14 Lakhs. PA/5'9" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-13973]

SC మాదిగ & క్రిస్టియన్/B.Tech, C.Govt. మేనేజర్/యూనియన్ బ్యాంక్/ 85000/- PM/5'8" ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-13973]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Address: 106, A K Enclave, Phase II, 8-2-350, Road No. 3, Banjara Hills (Near Furniture Mall), Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/Builder/MBA/Very Handsome Boy/1995/6' feet/150 Cr *1993/6'/50Cr * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/Business.B.Tech/MBA/1997/5'9"/60Cr *1997/5'11"/100Cr *1995/5'9"/ 500 Cr *1994/5'11"/250Cr. * Cont: K.C.Reddy - Hyd. Ph: 9347807015/ 9849321309

Reddy/ MBBS/ PG*1995 /5'10"/400Cr *1989/5'9"/30Cr *1994/5'10"/75Cr*1993/ 5'10"/50Cr. *1993/5'10"/20Cr. *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/USA Doctor*1995/5'8" *1989/ 5'9" *1992/5'11" *1998/5'8" *1990/6' * 1991/5'10". * Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/ 9347807015

Reddy/B.Tech/MS/H1/USA *1991/ 5'11"/ 200Cr *1991/5'7"/60Cr *1995/ 5'7"/300K *1995/ 5'10"/260K/70Cr *1992/5'11/495K. *Cont : K.C. Reddy-Hyd. Ph: 9849321309

Reddy/Divorcee *B.Tech/MBA/Business/1981/5'8"/250Cr *IIT/B.Tech/ 1992/ 6'/ 200K/ 20Cr *IIT/ 1988/ 5'7"/42 L/yr. * Cont : K.C. Reddy-Hyd- Ph: 9347807015

Reddy/Divorcee/ MBBS/PG/1985/5'8"/ 50Cr *1994/5'9"/50Cr *MBA/ 1986/ 5'5"/ 1000Cr *1994/5'9"/300Cr. * Cont : K.C. Reddy-Hyd. Ph:9849321309/ 9347807015

Reddy/Divorcee/USA/H1/*MS/1992/6'/ 30Cr *1981/5'5"/300K *1986/ 6'/220K/20 Cr *USA/ Doctor/ 1982/ 5'8" *Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd. Ph: 9849321309

Reddy/Business.B.Tech/MBA/1993/5'7"/50Cr *1993/6'/50Cr *1988/5'8"/ 200Cr *1995 / 5'10" / 80Cr *1995 /6'/ 100 Cr. * Cont: K.C. Reddy-Hyd Ph: 9849321309

Reddy/B.Tech/MS/H1/USA/1994/5'11/150 Cr *1995/6'/130K/400Cr *1997/6'/400Cr * 1993/5'9"/150K/20Cr *1994/5'7"/ 230K/ 60Cr * Cont: K.C. Reddy-Ph: 9849321309 [D-524]

వరుడు కావలెను

Reddy/(Divorcee) MBBS / MD / 1986/ 5'4"/30Cr *1994/5'5"/100Cr *1986/5'6"/ 50Cr *1981/5'3" *Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/(Divorcee)B.Tech/1989 /5'5"/25Cr *1986/5'6"/20Cr*1993/5'6"/50Cr *1984/5'1"/ 20Cr *1985/5'5"/400Cr *1991/5'4"/ 15Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/USA/ MBBS/ MD/1993/ 5'8"/40Cr*1992/5'3"/9Cr *USA/B.Tech/MS / 1986/5'6"/20Cr *1993/5'7"/15Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/Divorcee/ B.Tech/SWE/ India/ 1993/5'4"/50L/yr/10Cr *1991/5'4"/10Cr *1987/ 5'6"/15Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/Divorcee/ MBBS/MD/ DM/1986/ 5'4"/Rich *1986/5'4"/30Cr *1993/5'8"/ Own Hospital/40Cr *1991/5'4"/10Cr. * Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309

Reddy/MBBS/PG/DM *1994/5'6"/100 Cr/ 1993/5'7"/100Cr *1995/5'5"/100Cr *1996/ 5'6"/60Cr *1995/ 5'7"/ 20Cr. * Cont: K.C. Reddy. Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/Rich Family/ *1993/5'3"/ 500Cr *1997/5'4"/150Cr *1998/5'5"/100Cr *1993/5'7"/100Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/MS/H1/USA/1999/5'6"/500 Cr *1996/5'8"/15Cr *1990/5'8"/30Cr *1996/ 5'7"/50Cr *1998/5'4"/30Cr. *Cont: K.C. Reddy-Hyd-Ph: 9849321309/9347807015

Reddy/B.Tech/1992/5'7"/20Cr *2001/5'3"/ 20Cr *1991/5'7"/10Cr *1997/5'5"/25Cr * 1999/ 5'8"/15Cr *1996/5'4"/30Cr. *Cont:K.C. Reddy-Hyd. Ph: 9849321309/9347807015

Reddy/IIT/2001/5'5"/42L/yr*1998/5'3" /70L/yr *1994/5'4"/150K*1996/5'7" * 1997/5'4"/200K *1995/5'6"/150K*Cont: K.C. Reddy-Hyd. Ph: 9849321309

వడ్డెర/కట్న ప్రసక్తి లేదు/B.Tech/C. Govt.ఎలక్ట్రికల్ ఇంజినీర్/రైల్వే/80,000/- PM/5'10" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13973]

బ్రాహ్మణ/2వ పెళ్లి / 35yrs / పిల్లలు లేరు/కట్న ప్రసక్తి లేదు/పురోహిత్ well settled వరుడికి వధువు కావలెను. Ph: 8688860224 [WB-14113]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి BE, MS, 28, 5' 8", Sr Engineer, 160 K, 30 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 28, 5' 11", Data Engineer, 13 L P/A, 4 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 10", SWE, 140 K, 35 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 6'2", Engineer, 150 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, Doctor, 24, 5' 2", USA, 50 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 25, 5'3", Analyst, 12 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5' 5", Software Developer, 120 K, H1, USA, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 23, 5' 4", Developer, 10.8 L P/A, Hyd, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



వధువు కావలెను

రెడ్డి BE, PGDM, 30, 5' 8", Sr Analyst, 30.3 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Citizen, BS, 27, 6' 1", Engineer, 150 K, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 29, 5' 10", P.G Doctor, Hyd, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 170 K, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 24, 5' 6", 64 L P/A, 10 Crores, Hyderabad, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 8", SWE, 120 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 28, 5' 3", P.G Doctor, 15 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, MS, 33, 5' 7", Data Manager, 200 K, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818. LETTER

రెడ్డి Male, 33 సం॥ Fair 5'-10", M.Tech, M.S (USA) 2.5 Cr ప్రాపర్టీ Rs. 3.L / PM గల వరుడుకి వధువు కావలెను. Cont: 94932 42896 [G-787556]

మాల : MBBS; MD (Gen. Medicine), 5'10 / 28 Y/ V.Fair / 5Cr. /నెలకు 2 లక్షల జీతంతో డాక్టర్‌గా చేస్తున్న వరుని కొరకు అర్జంట్‌గా సంప్రదించండి. సెల్ : 81065 01199, 92484 94810. [M-266]

వాల్మీకి బోయ/B.Tech, MBA/Govt. DEE/Engineer / 74,000 PM / 5'8" / 44y వరునికి 29-35 సం॥లోపు ఒంటరి వధువు కావలెను. సెల్: 91009 74477. [N-1189741]

Reddy, Now Hyd-28/5'10"/B.Tech-MS-USA. *32/5'10"/MBBS Residency USA. *28/ 5'10" /B.Tech IIT - MS - USA - 350K/ Rich. Cont: P.P.Reddy-9391198332. [H-189236]

Reddy, 25/5'4"/M.Com. *22 / 5'4"/ B.Com. *26/ 5'4"/ B.Tech/ SWE - Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-189236]

Reddy, 2nd Marriage-42/5'9"/ B.Tech-MS-USA Citizen. *32/5'10"/ B.Tech-MS USA. *32/5'9"/B.Tech-SWE-Hyd. Cont: P.P.Reddy-9391198332. [H-189236]

★

రెడ్డి: లేట్ మ్యారేజ్/34y నెలకు లక్ష రూపాయల ఆదాయం Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓక్టీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK కుల, కట్న ప్రసక్తి లేదు డైరెక్ట్ Ph: 7989079290 [H-189373]

కులపట్టింపు లేదు: 32y, 5.8", M.Sc, GBM, Own Business, Hyd, 60 Lacs P/A, 50Cr Property గల వరునికి కులపట్టింపులేని వధువు కావలెను. Ph: 9030315599 [H-189508]

రెడ్డి: 28y, 5.8", B.Tech, M.S(UK), SWE, 3 Lacs P/M, UK, 15Cr Property గల వరునికి తగిన వధువు కావలెను. (Now in India) Ph: 7207930999 [H-189508]

రెడ్డి: 28y, 5.10", M.Tech, SWE, Canada, 120K P/A, Well Settled వరునికి India/Abroad వధువు కావలెను. (PR HOLDER) Ph: 9701960229 [H-189508]

రెడ్డి: 35y, 5.9", M.S, Ph.d, Scientist, Canada, PR Holder, 20 Cr Property, గల వరునికి India/Abroad Any వధువు కావలెను. (Now in India) Ph: 9248064777 [H-189508]

36 సం॥ల బిజినెస్ చేస్తూ ఉన్న 50 to 1 Cr ప్రాపర్టీ ఉన్న వరునికి రెండవ/విడో పిల్లలు ఉన్న వారైనా సం॥ది॥ దొరీ, కుల ప్రసక్తి లేదు. Ph: 8885582668, 7396730091 [HA-30254]

క్రిస్టియన్ మాల 47, 5.3". విలేజ్‌లో 7 ఎకరాల వ్యవసాయ భూమి, ప్రైవేట్ పని, 4 గదుల పక్కా ఇల్లు. బైక్, కారు గల వరుడుకి వధువు కావలెను. కులం పట్టింపు లేదు. 9948604039 [Y-798244]

కులపట్టింపు లేదు: 2వ పెళ్ళి 37yrs/ Govt ఎంప్లాయ్ 3,00,000/-(PM) బాగా స్థిరపడికోట్ల ప్రాపర్టీస్ కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) సంప్రదించండి.Ph: 9502046384 [H-788794]

కాపు: 48yr/ కులపట్టింపు లేదు/ లేట్ మ్యారేజ్/ ఫెయిర్/Govt ఎంప్లాయ్ 1లక్ష (PM). వెల్ సెటిల్డ్ & 3 సొంత ఇల్లులు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st & 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర: Ph: 8374002603 [H-788794]

2వ పెళ్ళి కుల ప్రసక్తిలేదు: 42yr/M.A English, P.hd Govt లెక్చరర్ 2 లక్షలు (PM). పిల్లలు లేని తెల్లని అందమైన 30 కోట్ల ఆస్తి గల వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను(పిల్లలు ఉన్న&ఇల్లరికం OK) సంప్ర: 73862 13324 [H-788794]

రెడ్డి/విడో / 58y / పెన్షనర్/సొంత ఇల్లు/ పొలాలు/ఏ బాదరబందీలేని సాంప్రదాయ కుటుంబం గల వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. Ph: 9133521622 [H-788932]

రెడ్డి/52yrs/విడో/V.Fair/5'5"/Govt.Job/సొంత ఇల్లు & రెంట్స్/20 ఎకరాల పొలం ఏ బాదరబందీ లేని వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకు వరుడు కావలెను. కుల ప్రసక్తి లేదు. ఇల్లరికం OK. Ph: 9492718486 [H-788932]

కాపు/1st Marriage/24y/ 5'4"/ B.Tech / Very Fair/SWE/13.5 Lakhs/ PA/కోట్ల ప్రాపర్టీ గల వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9848226983 [H-788932]


క్రిస్టియన్ మాదిగ/B.Tech/C.Govt. డిప్యూటీ మేనేజర్/HAL/55000/-PM/5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9963410191 [HA-13967]

రజక/B.Tech/Govt.Jr.Asst./పంచాయతీరాజ్ Dept/35000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-13967]

క్రిస్టియన్ మాల/50 లక్షల ఆస్తి/B.Tech/ Govt.Asst.ఇంజినీర్/RWS/50,000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-13967]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ A: 30, Qly: డిగ్రీ/బిజినెస్‌లు కలిగిన అందమైన వధువుకి 1st or 2nd మ్యారేజ్ వరుడు కావలెను (ఇల్లరికం OK) Ph: 8143011223 [HA-13973]

వరుడు కావలెను



No Caste bar/1, 2వ 1 కోటి నుండి 100 కోట్ల ప్రాపర్టీ గల వధువులు కలరు. వారికి తగిన వరులు కావలెను. ఇల్లరికం Ok. త్వరగా చేసుకునే వారి కోసం మాత్రమే. Ph: 7794960803 [HA-29865]

రెడ్డి/1st మ్యారేజ్/Age: 27, Height. 5'4", Colour: Fair/Bank Job/ Single Person/అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9121300377 [HA-13973]

Reddy: 55yr/Widow/Fair/Hyd/Own-House Rents/ Own-Business (పాప-U.S.A సెటిల్డ్). Well Settled ఎటువంటి బాదరా బందీలేని అందమైన వైశ్య వధువుకు FC/BC వరుడు కావలెను(సపోర్టు ఉండును) సంప్ర: 8519983423 [H-788794]

రెండో పెళ్ళి/63y&60y & 58y & 56y & 54y & 52y& 50y&48y&46y&44y&42y&40y& 37 y& 35y &33y &31y&29y &27y&25y/"మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [H-780723]

యాదవ B.Tech/31yrs/5'.4"/ గవర్నమెంట్ ఉద్యోగినికి తగిన వరుడు (స్టేట్ లేక సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగి) కావలెను సంప్రదించండి: 7997486067 [T-1191487]


Reddy Br. 26/5'6"/B.Tech (Bits) MS-USA/200Cr. *24/5'5"/B.Tech- MS-USA. 20Cr. *25/5'6"/B.Tech, SWE, 20Cr. Cont: P.P.Reddy-9391198332 [H-189236]

Reddy/30/5'5"/MD (Pediatrics) 15Cr. *24/5'5"/MD (Radiology) 2nd yr. *25/5'5"/MD (Gynic). Cont : P.P.Reddy-9391198332 [H-189236]

★

రెడ్డి: 26y, 5.6", B.Tech, M.S, USA, SWE, 180K P/A H1B Visa, 50 Cr Property గల వధువుకి తగిన USA/India వరుడు కావలెను. Ph: 9246960888 [H-189508]

వేదికలు



ఫ్రీ...ఫ్రీ...ఫ్రీ...కమ్మ, కాపు, రెడ్డి, వైశ్య, బ్రాహ్మణ అన్ని కులాల 1వ, 2వ, లేటు, Govt, Doctor, SWE, రిచ్ & మిడిల్ క్లాస్ మ్యాచెస్ ఫాస్ట్ సెటిల్ సంప్ర: Ph: 9247217621 [H-788932]

వైశ్య రెండో పెళ్ళి: 35yr/ 5'6"/ SWE, 38y/ 5'10"/ SW/ 35y/5'6"/US/ 30Y/ 5'7"/ లెక్చరర్. CNB వధూవరులకై సం.ప్ర: Ph: 9247783541/ 9346019313 [H-788794]

వడ్డెర వధువు వివాహ సంబంధాలు కుదుర్చబడును. దేశ, విదేశ తక్షణ సంబంధాల కొరకు సంప్రదించండి : 9381553423 [HA-13973]

శుభమస్తు మ్యారేజ్ బ్యూరో TM/Est: 1995, గౌడ, ఈడిగ, శెట్టి బలిజ, 1st 2nd దేశ/విదేశ సంబంధాలకై సం॥ S.రాములు గౌడ్, లింగాల కాంప్లెక్స్, DSNR, Hyd. వ్యవస్థాపకురాలు: స్వర్గీయ S.శారదాగౌడ్, Ph: 8790690909 [H-788922]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాలవారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర: 8555980066/6302543297 [HA-10941]

ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 9949395407 [H-780945]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/గెజిటెడ్/MBBS/PG/NRI /PVT/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS/15 సం॥ Exp. Ph: 9989140444 [HA-30213]

"పెళ్లి" ఫాస్ట్ సెటిల్‌మెంట్ మా ప్రత్యేకత. Software, Doctors, Abroad, Rich, Group 1,2 వారికి పెళ్లి సంబంధాలు చూడబడును. పూర్ణ మాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-1481]

★

విశ్వ బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం (online) 13th August 2023, Free Registration. bhavanimatrimony.com Hyd. Ph: 9704656103, 9533608887 [HA-297]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt, Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి. Ph: 9704656103, 9533608887 (Whatsapp) [H-370]

రేపు కొత్త న్యాయమూర్తుల ప్రమాణం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హైకోర్టుకు కొత్తగా నియమితులైన ముగ్గురు అదనపు న్యాయమూర్తులు ఈనెల 31న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. సోమవారం ఉదయం 9.40 గంటలకు హైకోర్టు మొదటి హాల్‌లో సుజన కళాసికం, లక్ష్మీనారాయణ అలిశెట్టి, అనిల్‌కుమార్ జూకంటితో ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే ప్రమాణ స్వీకారం చేయిస్తారు. సుజన న్యాయాధికారుల కోటాలో, లక్ష్మీనారాయణ అలిశెట్టి, అనిల్ కుమార్ జూకంటి న్యాయవాదుల కోటాలో అదనపు జడ్జీలుగా నియమితులైన విషయం తెలిసిందే.

31 నుంచి 'క్రైస్తవులకు రూ.లక్ష' దరఖాస్తులు

తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ రాజీవ్‌సాగర్



సాక్షి, హైదరాబాద్: క్రైస్తవులకు వందశాతం సబ్సిడీతో రూ.లక్ష ఆర్థికసాయం అందించేందుకు రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ ఈ నెల 31 నుంచి ఆగస్టు 14వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తుందని తెలంగాణ ఫుడ్స్ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. http://tsobmmssbc.cgg.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని, ఇతర వివరాలకు జిల్లా మైనార్టీ కార్పొరేషన్ కార్యాలయాలను సంప్రదించాలని సూచించారు. క్రిస్టియన్ల అభివృద్ధి, ఆత్మగౌరవం కోసం సీఎం కేసీఆర్ అనేక పథకాలు ప్రవేశపెడుతున్నారని పేర్కొన్నారు. దీనిని జీర్ణించుకోలేక విపక్ష పార్టీల నేతలు ప్రభుత్వంపై అర్థరహిత విమర్శలు చేస్తున్నారని విమర్శించారు. ఏటా సుమారు 2.85 లక్షల కుటుంబాలకు కానుకలు, క్రిస్మస్ వేడుకల కోసం నియోజక వర్గానికి రూ.2 లక్షల చొప్పున కేటాయించిందని తెలిపారు. గడిచిన తొమ్మిదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 411 చర్చిలకు రూ.32.63 కోట్లు ప్రభుత్వం వెచ్చించిందని రాజీవ్‌సాగర్ వెల్లడించారు. క్రిస్టియన్ల ఆత్మగౌరవ భవనం కోసం ఉప్పల్ భగాయత్‌లో 2 ఎకరాల స్థలం, భవన నిర్మాణానికి తొలివిడతలో రూ.10 కోట్లు కేటాయించిన విషయాన్ని రాజీవ్‌సాగర్ గుర్తు చేశారు.

కాచిగూడ-నిజామాబాద్ రైలు రద్దు

సాక్షి, హైదరాబాద్: ట్రాక్ నిర్వహణ పనుల దృష్ట్యా కాచిగూడ-నిజామాబాద్ రైలును రద్దు చేయ నున్నట్లు దక్షిణమధ్య రైల్వే సీపీఆర్వో సీహెచ్.రాకేష్ ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 31 నుంచి ఆగస్టు 6వ తేదీ వరకు ఈ ట్రైన్ సేవలు నిలిచిపోనున్నట్లు పేర్కొన్నారు.

బీజేపీ శాపం కాంగ్రెస్ పాపం | కేసీఆర్ దీపం: హరీశ్

- తెలంగాణ ద్రోహులు కిరణ్, చంద్రబాబు చుట్టూ తిరుగుతారా..?
- ఈ ప్రాంత ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టడం సిగ్గుచేటు
- ప్రతిపక్షాల తీరుపై మంత్రి హరీశ్ ఆగ్రహం
- గజ్వేల్‌లో హోంమంత్రి మహమూద్ అలీతో కలిసి పర్యటన



గజ్వేల్‌లో ఏసీపీ కార్యాలయ భవనానికి హోంమంత్రి మహమూద్‌అలీతో కలిసి శంకుస్థాపన చేస్తున్న హరీశ్‌రావు

గజ్వేల్: ''తెలంగాణకు రూపాయి ఇయ్య.. ఏం చేసుకుంటావో చేసుకో అన్న కిరణ్‌కుమార్‌రెడ్డి ఇయ్యాల బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి గురువు, ఉచిత కరెంట్ వద్దన్న చంద్రబాబు రేవంత్‌రెడ్డికి గురువు. దీపం లాంటి కేసీఆర్ ఉండగా.. తెలంగాణ ద్రోహుల చుట్టూ తిరుగుతున్న శాపం లాంటి బీజేపీ, పాపం లాంటి కాంగ్రెస్ మనకెందుకు..?'' అని మంత్రి టి.హరీశ్‌రావు వ్యాఖ్యానించారు. శనివారం సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో హోంమంత్రి మహ మూద్ అలీతో కలిసి పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో హరీశ్‌రావు మాట్లాడుతూ.. మూడు నల్ల చట్టాలను తీసుకొచ్చి రైతాంగం ఉసురుపోసుకున్న బీజేపీ, మూడు గంటలే కరెంటు చాలంటున్న కాంగ్రెస్‌ను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గరపడ్డాయన్నారు. అసెంబ్లీలో తెలంగాణకు నిధులివ్వరా? అని అప్పట్లో తాను ప్రశ్నిస్తే ఒక్క రూపాయి ఇయ్య...ఏం చేస్తారో చేసుకోండి అన్న కిరణ్‌కుమార్‌రెడ్డిని కిషన్‌రెడ్డి తన ప్రమాణ స్వీకార కార్యక్రమానికి సోయి మరిచి ముఖ్య అతిథిగా ఆహ్వానించారని మండిపడ్డారు.

కిరణ్, బాబు కాళ్ల వద్ద ఆత్మగౌరవాన్ని తాకట్టుపెడతారా?

తెలంగాణను రాచి రంపాన పెట్టి, ఈ ప్రాంతానికి కరెంట్, నీళ్లు ఇయ్యకపోగా..వ్యవసాయం దండగ అన్న చంద్రబాబు నేడు రేవంత్‌రెడ్డికి గురువు అంటూ ఎద్దేవా చేశారు. తెలంగాణ ద్రోహులుగా ముద్రపడిన కిరణ్, చంద్రబాబు కాళ్ల దగ్గర ఈ ప్రాంత ఆత్మగౌరవాన్ని తాకట్టు పెడతారా..? ఇది సిగ్గుచేటు అంటూ వ్యాఖ్యానించారు. చంద్రబాబు ఇటీవల తెలంగాణపై ప్రేమ చూపినట్లు మాట్లాడుతున్నారని, అదీ ఏపీ సీఎం జగన్‌పై కోపంతో మాత్రమేనని, నిజంగా ఆయనకు తెలంగాణపై ప్రేమ లేదని, ముమ్మాటికీ ఆయన ఈ ప్రాంతానికి ద్రోహి అని పునరుద్ఘాటించారు. కార్యక్రమాల్లో కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్, ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ (టీఎస్ఎఫ్‌డీసీ) చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ తదితరులు పాల్గొన్నారు.



తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సోమయాజులు, జస్టిస్ వెంకట జ్యోతిర్మయి శనివారం దర్శించుకున్నారు.

కొడుకులు గంజి పోస్తలేరు సారూ..

- సిరిసిల్ల జిల్లాలో పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు




లింగాగౌడ్

ముస్తాబాద్(సిరిసిల్ల): 'ఇద్దరు కొడుకులకు ఆస్తి, ఇల్లు పంచి ఇచ్చినం. ఆ తర్వాత మా పోషణ గురించి వారు పట్టించుకుంటలేరు. కనీసం గంజి కూడా పోస్తలేరు. మమ్మల్ని ఇంటి నుంచి వెళ్లగొట్టింండ్రు సారూ..'అంటూ ఓ వృద్ధ దంపతులు పోలీసుల ముందు గోడు వెళ్లబోసుకున్నారు. ఈ ఘటన సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం చిప్పలపల్లిలో శనివారం చోటుచేసుకుంది. చిప్పలపల్లికి చెందిన కంచర్ల లింగాగౌడ్, సత్తవ్వ దంపతులకు ఇద్దరు కుమారులు, కూతురు సంతానం. కూతురికి వివాహమైంది. ఇద్దరు కొడుకులకు రెండు ఎకరాల పొలం, ఇల్లు, ఆస్తి పంచి ఇచ్చారు. అయితే కొన్నిరోజులుగా వారు తమ బాగోగులు చూడటంలేదని, కనీసం తిండి కూడా పెట్టడంలేదని, 20 రోజులుగా కూతురు ఇంట్లోనే ఉంటున్నామని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై జిల్లా ఎస్పీని కలిసి మొర పెట్టుకున్నారు. వృద్ధాప్యంలో ఉన్న తమకు న్యాయం చేయాలని ముస్తాబాద్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వేడుకున్నారు.

తెలంగాణ మొత్తం తిరగాల్సిందే..

- గురుకులాల రిక్రూట్‌మెంట్‌లో అభ్యర్థులకు కష్టాలు
- ఒక్కో పరీక్ష పేపర్‌కు ఒక్కో జిల్లా తిరగాల్సిన పరిస్థితి
- పరీక్ష కేంద్రాలు చూసి గగ్గోలు పెడుతున్న అభ్యర్థులు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఏళ్ల తరబడి ఎదురు చూపుల తరువాత విడుదలైన నోటిఫికేషన్ల ప్రకారం ఉద్యోగాలు సాధించేందుకు సిద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు ఆయా పోటీ పరీక్షలు రాసేందుకు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ఆగస్టు 1 నుంచి 23వ తేదీ వరకు 'తెలంగాణ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ రిక్రూట్‌మెంట్ బోర్డు'ఆధ్వర్యంలో గురుకులాల్లో డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, పీఎల్, ఆర్ట్స్, క్రాఫ్ట్స్, మ్యూజిక్, ఫిజికల్ డైరెక్టర్.. తదితర 9 రకాల ఉద్యోగాలకు ఆన్‌లైన్ విధానంలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ క్రమంలో ఈ నెల 24 నుంచి హాల్‌టికెట్లను ఆన్‌లైన్‌లో పెట్టారు. అయితే ఇప్పటికీ పలువురు అభ్యర్థులకు కొన్ని పరీక్షల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో చూపించడం లేదు. కొన్ని డౌన్‌లోడ్ కావటం లేదు. కొందరికి మాత్రం కొన్ని పరీక్షల హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ అయ్యాయి. ఇదిలా ఉంటే.. హాల్‌టికెట్లు చూసి పలువురు అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు. జేఎల్, డీఎల్, టీజీటీ, పీజీటీ, పీఎల్ పరీక్షలకు పేపర్-1 (జనరల్ స్టడీస్), పేపర్-2 (మెథడాలజీ), పేపర్-3 (సబ్జెక్టు) ఉన్నాయి. పరీక్షలు రాసే విషయంలో అభ్యర్థులకు కేటాయించిన కేంద్రాలు చూస్తే కళ్లు తిరిగే పరిస్థితి ఉందని అంటున్నారు.

మూడు పేపర్లకు మూడు జిల్లాలు..

మంచిర్యాలకు చెందిన నికిత అనే అభ్యర్థి టీజీటీకి దరఖాస్తు చేయగా, ఆమెకు పేపర్-1 హైదరాబాద్‌లో, పేపర్-2 మంచిర్యాలలో, పేపర్-3కి వరంగల్‌లో సెంటర్లు ఇచ్చారు. అలాగే నిజామాబాద్‌కు చెందిన రమాదేవి నిజామాబాద్‌లో పరీక్ష కేంద్రం ఆప్షన్ ఇచ్చుకోగా, ఆమెకు పేపర్-1 రంగారెడ్డి జిల్లా, పేపర్-2 మేడ్చల్ జిల్లా, పేపర్-3కి కరీంనగర్ జిల్లాలో సెంటర్లు ఇచ్చారు. అలాగే ఖమ్మంకు చెందిన బిందుకు పేపర్-1 ఖమ్మంలో, పేపర్-2 కొత్తగూడెంలో, పేపర్-3కి సత్తుపల్లిలో సెంటర్లు ఇచ్చారు. ఈ పరీక్షలను ఆగస్టు 4, 14, 22 తేదీల్లో రాయాల్సి ఉంది. ఇక్కడే మరో పెద్ద సమస్య వచ్చిపడింది. వీళ్లు టీజీటీతో పాటు పీజీటీ, డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పరీక్షలకు కూడా దరఖాస్తు చేశారు. ఈ పరీక్షల కేంద్రాలు ఏయే జిల్లాల్లో కేటాయిస్తారో తెలియక ఆందోళన చెందుతున్నారు.

తెలంగాణలో సగం జిల్లాల్లో తిరగాల్సిన పరిస్థితి..

మొత్తం 9 విభాగాల పరీక్షల్లో కీలకమైన పీజీటీ, టీజీటీ, డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పరీక్షలకు మూడు చొప్పున పేపర్లకు పరీక్ష రాయాల్సి ఉంది. అయితే ఈ పరీక్షలు ఒక క్రమ పద్ధతి ప్రకారం నిర్వహించడం లేదని విమర్శలు వస్తున్నాయి. టీజీటీ పరీక్షలు ఆగస్టు 4, 14, 22 తేదీల్లో ఉన్నాయి. కాగా, ఈ పరీక్షలు రాసే అభ్యర్థులు.. ఆగస్టు 9, 10, 16, 19, 21 తేదీల్లో పీజీటీ, డిగ్రీ లెక్చరర్, జూనియర్ లెక్చరర్ పరీక్షలు రాయాల్సి ఉంది. వీరికి టీజీటీ తరహాలోనే వివిధ జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు కేటాయిస్తే ఉత్తర తెలంగాణ నుంచి దక్షిణ తెలంగాణ వరకు వందల కిలోమీటర్ల మేర ఆగస్టు నెలంతా ప్రయాణాలు చేయాల్సిన పరిస్థితి ఉంటుందని అంటున్నారు. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు ఉన్న మహిళా అభ్యర్థులు నరకయాతన పడాల్సిన పరిస్థితులు కల్పించారని మండిపడుతున్నారు. ఒక అభ్యర్థి ఇలా పోటీ పరీక్షలు రాసేందుకు వివిధ జిల్లాలు తిరగాలంటే రూ. వేలల్లో ఖర్చు చేయాల్సి ఉంటుంది. దీంతో అభ్యర్థులు గగ్గోలు పెడుతున్నారు.

ఆగస్టు 13న పద్మశాలీల 'చలో కోరుట్ల'

నల్లకుంట: జనాభా దామాషా ప్రాతిపదికన పద్మశాలీలకు పార్లమెంట్‌లో 3, అసెంబ్లీలో 10, కౌన్సిల్‌లో 5 స్థానాల్లో సీట్లు కేటాయించాలని తెలంగాణ పద్మశాలీ సంఘం రాష్ట్ర సమన్వయకర్త రామ శ్రీనివాస్ అన్ని రాజకీయ పార్టీలను డిమాండ్ చేశారు. పద్మశాలీల రాజ్యాధికార సాధన కోసం ఆగస్టు 13న 'చలో కోరుట్ల పద్మశాలీ రాజకీయ యుద్ధభేరి' కార్యక్రమాన్ని చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో పద్మశాలీలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం నల్లకుంట టీఆర్టీ కాలనీలో జరిగిన సమావేశంలో పాల్గొన్న రామ శ్రీనివాస్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్‌తో కలిసి చలో కోరుట్ల రాజకీయ యుద్ధభేరి వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

పాలేరు జవహర్ నవోదయలో ఘటన



నాగేందర్ (ఫైల్)

కూసుమంచి: ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం పాలేరులోని జవహర్ నవోదయ విద్యాలయలో శనివారం విద్యుదాఘాతంతో ఓ విద్యార్థి మృతి చెందగా.. మరో ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. నవోదయ విద్యాలయలో వచ్చేనెల 3వ తేదీ నుంచి రీజినల్ స్థాయి క్రీడా పోటీలు జరుగనున్నాయి. ఇందుకోసం శనివారం సాయంత్రం ఫ్లెక్సీలను ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన గేటు వద్ద భారీ ఫ్లెక్సీ ఏర్పాటుకోసం 12వ తరగతి విద్యార్థులు హలావత్ దుర్గా నాగేందర్, శ్రీకుమార్, ఈశ్వర్ ఇనుప ఫ్రేమ్‌ను తీసుకొస్తున్నారు. ఫ్రేమ్‌ను నిలబెడుతుండగా పైన ఉన్న 11 కేవీ లైన్ తీగలకు తాకడంతో ముగ్గురూ షాక్‌కు గురయ్యారు. వీరిలో కూసుమంచి మండలంలోని కోక్యాతండాకు చెందిన నాగేందర్ తీవ్రమైన షాక్‌కు గురై పడిపోగా మిగిలిన ఇద్దరు తేరుకుని పక్కకు పడ్డారు. దీంతో స్థానికులు, విద్యాలయ ఉద్యోగులు నాగేందర్‌ను ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అయితే, ఆస్పత్రికి చేరుకునే సరికే నాగేందర్ మృతి చెందినట్లుగా వైద్యులు ధ్రువీకరించారు. కాగా, సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు, బంధువులు పెద్దసంఖ్యలో నవోదయ విద్యాలయకు చేరుకుని ఆందోళనకు దిగారు. డార్మిటరీల అద్దాలు, ఫర్నిచర్ ధ్వంసం చేశారు.

క్లుప్తంగా...

జాతీయ విద్యావిధానంపై వ్యాసరచన పోటీలు

రాష్ట్ర గవర్నర్ తమిళిసై



సాక్షి, హైదరాబాద్: సామాజిక, ఆర్థిక అసమానతలను రూపుమాపడంలో విద్య పాత్రపై విద్యార్థులు, సామాన్య ప్రజలకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తున్నట్టు రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ విద్యావిధానం- 2020 అమల్లోకి వచ్చి ఈ నెల 29వ తేదీతో నాలుగేళ్లు పూర్తి అయిన సందర్భంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంగ్లం, తెలుగులో వ్యాసాలు రాసి ఆగస్టు 6 లోగా tsrbessay contest@gmail. com కు మెయిల్ ద్వారా పంపాలని సూచించారు. విద్యార్థులు, సామాన్యులు..ఇలా రెండు కేటగిరీ కింద వేర్వేరుగా ప్రథమ బహుమతి కింద రూ.10,000, ద్వితీయ బహుమతి కింద రూ.5 వేలు, తృతీయ బహుమతి కింద రూ 3 వేలు, మరో 10 మందికి రూ.వెయ్యి చొప్పున కన్సొలేషన్ బహుమతులు అందజేస్తామని తెలిపారు. తమ వ్యాసాన్ని సొంతంగా రాశామని, ఎక్కడి నుంచి కూడా కాపీ చేయలేదని పేర్కొంటూ స్వీయ ధ్రువీకరణను అందజేయాలని కోరారు.

ఓయూ ఎంఈ, ఎంటెక్ దరఖాస్తుల గడువు పెంపు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్ ఇంజనీరింగ్ కాలేజీలో కొనసాగుతున్న ఈవినింగ్ ఎంఈ, ఎంటెక్ దరఖాస్తుల స్వీకరణ గడువును పొడిగించినట్లు ప్రిన్సిపల్ ప్రొ.శ్రీరామ్ వెంకటేష్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29తో ముగిసిన గడువును.. వర్షాల కారణంగా ఆగస్టు 8 వరకూ పెంచినట్లు పేర్కొన్నారు. ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

సెప్టెంబర్ 1 నుంచి అగ్నివీర్-2 రిక్రూట్‌మెంట్ ర్యాలీ

ఖమ్మంలో నిర్వహించనున్నట్లు డిఫెన్స్ అధికారుల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ రెండో ర్యాలీని సెప్టెంబర్ 1 నుంచి 8 వరకు నిర్వహించనున్నట్టు రక్షణ శాఖ అధికారులు తెలిపారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఈ ర్యాలీని నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ 17 నుంచి 26 వరకు నిర్వహించిన ఆన్‌లైన్ కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే ర్యాలీలో పాల్గొనేందుకు అర్హులని వివరించారు. సీఈఈలో అర్హత సాధించిన అభ్యర్థులకు ఈ-మెయిల్ ద్వారా అడ్మిట్‌కార్డులను పంపిస్తారని, రిక్రూట్‌మెంట్‌కి ఏ తేదీలో, ఏ సమయంలో హాజరుకావాలన్న వివరాలు అందులో ఉంటాయని, అవసరమైన అన్ని ధ్రువపత్రాలను తీసుకురావాల్సి ఉంటుందని వెల్లడించారు.

మిస్సింగ్ కేసుల్లో 87 శాతం మంది జాడ గుర్తింపు

మహిళా భద్రత విభాగం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా నమోదవుతున్న మహిళలు, బాలికల మిస్సింగ్ కేసుల్లో 87 శాతం అదృశ్యమైన వారి జాడను కనిపెట్టగలుగుతున్నట్లు రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఉన్నతాధికారులు తెలిపారు. మిస్సింగ్ కేసుల పరిష్కారంలో జాతీయ సగటు చూస్తే మహిళల జాడ గుర్తింపు 62 శాతం ఉండగా, బాలికల జాడ గుర్తింపు 53 శాతంగా ఉందని శనివారం మహిళా భద్రత విభాగం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపింది. అదృశ్యం, కిడ్నాప్ కేసుల విషయంలో పోలీసులు పూర్తి అప్రమత్తంగా ఉంటున్నట్లు పేర్కొంది.

గజాలు, ఎకరాల్లో కాదు.. కిలోమీటర్లలో భూకొనుగోళ్లు!

దొడ్డ శ్రీనివాసరెడ్డి

ప్రపంచవ్యాప్తంగా వివిధ ప్రాంతాలు, దీవులను కొన్న దేశాలు

సాధారణంగా ఎక్కడైనా భూమిని చదరపు అడుగులు, చదరపు గజాలు లేదా ఎకరాల్లో కొంటారని మనందరికీ తెలుసు.. కానీ ప్రపంచవ్యాప్తంగా కొన్ని దేశాలు ఇతర దేశాలు లేదా ద్వీపాలను కొనుగోలు చేశాయని తెలుసా?! దాదాపు 20 కోట్ల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపమైన గ్రీన్‌ల్యాండ్‌ను కొనేందుకు అమెరికా పలుమార్లు విఫలయత్నం చేసిందని మీరెప్పుడైనా విన్నారా?!! అలా దేశాలను లేదా ద్వీపాలను ఇతర దేశాలు కొనాల్సిన అవసరం.. దాని వెనకున్న ఉద్దేశం ఏమిటి? అందుకు ఎంత మొత్తం వెచ్చించాయి.. ఇలాంటి వెరైటీ భూకొనుగోళ్లలో కొన్నింటి గురించి క్లుప్తంగా...



అలాస్కా

ఉత్తర అమెరికా ఖండం ఎగువ భాగాన 17 లక్షల చ.కి.మీ.పైగా విస్తీర్ణం మేర విస్తరించిన ఈ ప్రాంతాన్ని అమెరికా 1867లో రష్యా నుంచి కొనుగోలు చేసింది. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న అప్పటి రష్యన్ చక్రవర్తి కేవలం 72 లక్షల డాలర్లకు ఈ ప్రాంతాన్ని అమ్మేశాడు. అమెరికా కొనుగోలు చేసిన అతిస్వల్పకాలంలోనే అలాస్కాలో అత్యంత విలువైన బంగారు గనులు బయటపడ్డాయి. అంతేకాదు.. ఆపై చమురు నిక్షేపాలతోపాటు అనేక ఖనిజాలు లభించాయి. ఇప్పుడు అలాస్కాలో ఏటా 8 కోట్ల టన్నుల చమురును అమెరికా వెలికితీస్తోంది.



ఫిలిప్పైన్స్

సుదీర్ఘ పోరాటం తరువాత స్వాతంత్ర్యం సాధించిన ఫిలిప్పైన్స్‌ను ఒకప్పుడు స్పెయిన్ నుంచి అమెరికా కొనుగోలు చేసింది. 1898లో ఇరుదేశాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా 2 కోట్ల డాలర్లు వెచ్చించి అమెరికా ఫిలిప్పైన్స్‌ను సొంతం చేసుకుంది.



ఆఖరి కొనుగోలు

ప్రపంచంలో ఇతర దేశాలను లేదా ప్రాంతాలను కొనుగోలు చేసే ప్రక్రియ చివరగా సౌదీ అరేబియా ఈజిప్టు మధ్య జరిగింది. 2017లో ఎర్ర సముద్రంలోని రెండు చిన్నదీవులైన టీరన్, సనఫిర్‌లను సౌదీకి అప్పగించేందుకు ఈజిప్టు అంగీకరించింది. దీనికోసం 2 కోట్ల అమెరికన్ డాలర్లను సాయంగా ఇచ్చేందుకు సౌదీ ఒప్పందం చేసుకుంది. అయితే ఇప్పటికీ ఈజిప్టు పౌరులు ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.



సింగపూర్

బ్రిటన్ 1819లో సింగపూర్‌ను కొన్నది. ఈస్టిండియా కంపెనీ వాణిజ్య అవసరాల కోసం మలేసియాలోని జోహర్ రాజ్యం నుంచి సింగపూర్‌ను కొనుగోలు చేసింది. దీనికోసం జోహర్ సుల్తాన్ హుస్సైన్‌షాకు ఏడాదికి 5,000 స్పెయిన్ డాలర్లు అదే రాజ్యానికి సైన్యాధికారి అయిన అబ్దుల్ రహమాన్‌కు 3,000 డాలర్లు ఇచ్చేట్లు బ్రిటన్ ఒప్పందం చేసుకుంది. అయితే రెండో ప్రపంచ యుద్ధం ఫలితంగా బ్రిటన్ సింగపూర్‌ను వదుకోవాల్సి వచ్చింది. తిరిగి మలేసియాలో భాగమైన సింగపూర్ 1965లో స్వతంత్ర్య దేశంగా ఆవిర్భవించింది.



గ్వదర్

బలూచిస్తాన్ రాష్ట్రంలో భాగమైన ఈ తీరప్రాంత పట్టణాన్ని పాకిస్తాన్ 1958లో ఒమన్ నుంచి కొనుగోలు చేసింది. దీనికోసం 550 కోట్ల పాకిస్తాన్ రూపాయలను వెచ్చించింది. చైనా బెల్ట్ అండ్ రోడ్డు ప్రాజెక్టులో భాగంగా గ్వదర్ పోర్టును పాకిస్తాన్ 2013లో చైనాకు అప్పగించింది. అప్పట్లో ఈ పోర్టు విలువను 4,600 కోట్ల డాలర్లుగా విలువ కట్టారు.




కట్నంగా నాటి బొంబాయి

ప్రస్తుత ముంబై ఒకప్పటి బొంబాయిని బ్రిటన్ రాజు చార్లెస్-2 కట్నంగా పొందారు. ప్రస్తుత ముంబైలో ఉన్న అనేక ప్రాంతాలు, ద్వీపాలు అప్పట్లో పోర్చుగీసు రాజ్యం అధీనంలో ఉండేవి. చార్లెస్-2 పోర్చుగీసు యువరాణి కేథరీన్‌ను పెళ్లి చేసుకున్నందుకు కట్నంగా కింగ్ జాన్-4 బొంబాయిని కట్నంగా రాసిచ్చారు. అప్పట్లో పోర్చుగీసు వాళ్లు బొంబాయిని బోమ్‌బెహియాగా పిలిచేవారు. తరువాత ఆంగ్లేయులు దాన్ని బాంబేగా మార్చారు. కట్నంగా పొందిన బొంబాయిని చార్లెస్... బ్రిటన్‌కు చెందిన ఈస్ట్ ఇండియా కంపెనీకి అప్పగించారు.



ఫ్లోరిడా

బ్రిటన్ సింగపూర్‌ను కొనుగోలు చేసిన 1819లోనే అక్కడ అమెరికా ఫ్లోరిడాను స్పెయిన్ నుంచి కొన్నది. దీనికోసం అమెరికా కేవలం 50 లక్షల డాలర్లను వెచ్చించింది. 1845లో ఫ్లోరిడా అమెరికా 27వ రాష్ట్రంగా అవతరించింది.



వర్జిన్ ఐలాండ్స్

అమెరికా 1917లో డెన్మార్క్ నుంచి వర్జిన్ ఐల్యాండ్స్‌ను కొనుగోలు చేసింది. దీనికోసం 2.5 కోట్ల డాలర్ల విలువైన బంగారాన్ని అమెరికా డెన్మార్క్‌కు అప్పగించింది. అప్పట్లోనే 10 కోట్ల డాలర్లతో గ్రీన్‌ల్యాండ్‌ను కూడా కొంటామని అమెరికా ప్రతిపాదించినా డెన్మార్క్ అంగీకరించలేదు. 1867 నుంచి 2019 వరకు అమెరికా పలుమార్లు గ్రీన్‌ల్యాండ్‌ను కొనే ప్రయత్నాలు చేసింది. కానీ గ్రీన్‌ల్యాండ్‌పై సార్వభౌమాధికారంగల డెన్మార్క్ మాత్రం ఈ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ వస్తోంది.

అమ్మకానికి మరెన్నో దీవులు

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో మానవరహిత దీవులు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయి. రియల్ ఎస్టేట్ మాదిరిగానే దీవుల అమ్మకం, కొనుగోళ్ల కోసం ఏజెంట్లు, ఆన్‌లైన్ వెబ్‌సైట్లు కూడా సేవలు అందిస్తున్నాయి. ధనవంతులు వెకేషన్ల కోసం ఇలాంటి దీవుల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. ప్రదేశాన్ని బట్టి వాటి రేట్లు ఉంటాయి. మధ్య అమెరికాలో కొంత తక్కువగా... యూరప్ కొంత ఎక్కువగా ఈ దీవుల రేట్లు ఉన్నాయి. ప్రైవేట్ ఐలాండ్స్ వంటి ఆన్‌లైన్ వెబ్‌సైట్ల ప్రకారం దక్షిణ అమెరికాలో అతితక్కువగా మన కరెన్సీలో రూ. 5 కోట్లుగా ఓ దీవి విలువ ఉంటే యూరప్‌లో రూ. 7 కోట్లకు ఎంచక్కా దీవిని సొంతం చేసుకోవచ్చు. ఎందరో హాలీవుడ్ స్టార్లతోపాటు బాలీవుడ్ స్టార్లు ఇలాంటి దీవులను కొనుగోలు చేశారు. షారుక్‌ఖాన్ దుబాయ్ సమీపంలో 70 కోట్ల డాలర్లకు ఓ దీవిని సొంతం చేసుకోగా బాలీవుడ్ నటి జాక్వెలిన్ ఫెర్నాండెజ్, పాప్‌సింగర్ మీకా కూడా దీవులు కొనుగోలు చేసిన వారిలో ఉన్నారు.

నటోవతు ద్వీపం

2014లో ఫిజికి చెందిన నటోవతు అనే దీవిలో 5,000 ఎకరాలను కిరిబటి రిపబ్లిక్ 87 లక్షల డాలర్లకు కొనుగోలు చేసింది. రానున్న రోజుల్లో సముద్ర మట్టాలు పెరిగితే తమ దేశం మునిగిపోతుందని ముందుజాగ్రత్త చర్యగా కిరిబటి తన జనాభా సంరక్షణ కోసం ఈ భూమిని కొనుగోలు చేసింది.



30 భద్రత, ఆర్థిక లేదా వాణిజ్య అవసరాల కోసం ఓ దేశం మరో దేశాన్ని మొత్తంగా లేదా కొంత భాగాన్ని కొన్న ఉదంతాలు 30కి పైగా ఉన్నాయి.

మన పులులు 21

'స్టేటస్ ఆఫ్ టైగర్స్ 2022' నివేదికలో వెల్లడి

- 2018లో 26 పులుల నుంచి తగ్గుదల...
- అభయారణ్యాల్లోనే కాకుండా టైగర్ కారిడార్లు కలిపితే... 28 పెద్దపులులు, 10 పిల్లలు ఉండొచ్చునని అధికారుల అంచనా



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో 21 పెద్ద పులులు ఉన్నట్టు 'స్టేటస్ ఆఫ్ టైగర్స్ 2022'నివేదిక వెల్లడించింది. ఈ మేరకు శనివారం కేంద్ర అటవీ, పర్యావరణశాఖ అధికారిక నివేదిక విడుదల చేసింది. ప్రస్తుతం రాష్ట్రంలో పులులు ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్‌లోనే ఉన్నాయని, కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో ఒక్క పులి కూడా శాశ్వత ఆవాసం ఏర్పరచుకోలేదని పేర్కొంది. కాగా ఈ నివేదిక చూస్తుంటే కేవలం రెండు టైగర్ రిజర్వ్‌లో స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్న పులుల సంఖ్యనే గుర్తించినట్టు కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు. అదేవిధంగా ఈ నివేదికలో రెండున్నరేళ్ల వయసుకు పైబడిన పులుల సంఖ్యనే పరిగణనలోకి తీసుకున్నట్టు తెలుస్తోందన్నారు. మొత్తంగా సవివరమైన వివరాలతో విడుదల చేసే 'అబ్ స్ట్రాక్ట్ నివేదిక'లో స్పష్టత వస్తుందనీ అది వచ్చేందుకు కొంత సమయం పట్టొచ్చునని పేర్కొంటున్నారు.

తాజా నివేదికపై అధికారుల్లో చర్చ

2018లో ఉన్న 26 పులుల సంఖ్య (కవ్వాల్ టైగర్ రిజర్వ్ పరిధిలో 19, ఆమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలో 7) నుంచి ఇప్పుడు గణనీయంగా పులుల సంఖ్య పెరిగి ఉంటుందని అధికారులు భావిస్తూ వచ్చారు. అయితే నివేదిక అందుకు భిన్నంగా రావడంపై రాష్ట్ర అటవీశాఖ అధికార వర్గాల్లో చర్చకు దారితీసింది. రాష్ట్రంలోని రెండు పులుల అభయారణ్యాల్లోనే కాకుండా టైగర్ కారిడార్లు, బఫర్ జోన్లు ఇతర ప్రాంతాలు కలిపితే 28 దాకా పెద్ద పులులు, దాదాపు పది దాకా పులి పిల్లలు ఉండొచ్చునని అటవీ అధికారులు చెబుతున్నారు. కిన్నెరసాని, పాకాల, ఏటూరునాగారం వంటి కొత్త ప్రాంతాల్లో పులి పాదముద్రలు రికార్డ్ అయ్యాయని, టైగర్ కారిడార్ ఏరియాలోని సిర్పూర్ కాగజ్‌నగర్, ఇతర ప్రాంతాల్లోనూ వీటి జాడలున్నాయని తెలిపారు. క్కడ పులల సంఖ్యలో వృద్ధికి సంబంధించి తాము క్షేత్రస్థాయిలో కెమెరా ట్రాపులు, ఫొటోలు, ఇమేజీ, ఇతర సాంకేతిక ఆధారాలతో ఈ అంచనాకు వచ్చినట్టుగా ఒక సీనియర్ అధికారి సాక్షికి వెల్లడించారు.

ప్రాజెక్ట్ టైగర్ ద్వారా సత్ఫలితాలు

- అటవీ సంరక్షణ ప్రధాన అధికారి ఆర్ఎం డోబ్రియాల్
- ములుగులో ఘనంగా రాష్ట్ర స్థాయి పులుల దినోత్సవం

ములుగు (గజ్వేల్): దేశ వ్యాప్తంగా పులుల సంఖ్య పెంపుదల కోసం చేపట్టిన ప్రాజెక్ట్ టైగర్ కార్యక్రమం సత్ఫలితాలనిస్తోందని అటవీ సంరక్షణ ప్రధాన అధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్)ఆర్.ఎం డోబ్రియాల్ తెలిపారు. సిద్దిపేట జిల్లా ములుగు అటవీ కళాశాల, పరిశోధన కేంద్రం (ఎఫ్‌సీఆర్ఐ)లో ప్రపంచ పులుల దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశంలో పులుల సంఖ్య 3,167కు పెరిందని తెలిపారు. అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వు ఫారెస్టలలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న సంరక్షణ చర్యలతో ఇక్కడ కూడా పులుల సంఖ్య పెరిగిందన్నారు. పులులను మనం కాపాడితే అడవిని, తద్వార మానవాళిని కాపాడుతాయన్నారు. రానున్న రోజులలో పులుల ఆవాసాలను మరింతగా అభివృద్ధి చేస్తామని వివరించారు. ములుగు ఎఫ్‌సీ ఆర్ఐ డీన్, సీఎం కార్యాలయ ఓఎస్‌డీ ప్రియాంక వర్గీస్ తదితరులు పాల్గొన్నారు.



జావెద్ అక్తర్‌కు సినారె పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న విద్యాసాగర్‌రావు. చిత్రంలో మంత్రి నిరంజన్‌రెడ్డి, రమణాచారి తదితరులు

భాషా పరిరక్షణే నిజమైన నివాళి

- సినారె జయంతి వేడుకల్లో మహారాష్ట్ర మాజీ గవర్నర్ విద్యాసాగర్‌రావు
- ప్రముఖకవి జావెద్ అక్తర్‌కు సినారె సాహిత్య పురస్కారం ప్రదానం

గన్‌ఫౌండ్రీ: తెలుగు భాషాపరిరక్షణే జ్ఞానపీఠ్ పురస్కార గ్రహీత డాక్టర్ సి.నారాయణరెడ్డికి నిజమైన నివాళి అని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్‌రావు అన్నారు. శనివారం ఇక్కడి రవీంద్రభారతిలో సుశీలానారాయణరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సినారె 92వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖకవి డాక్టర్ జావెద్ అక్తర్‌కు సినారె జాతీయ సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు. అనంతరం విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ తెలుగుభాష అంతరించిపోకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. సినారె ఎన్నో అంశాలు పరిశోధించి ఆణిముత్యాల్లాంటి రచనలు చేశారని కొనియాడారు. అక్షరాలు నక్షత్రాలుగా నిలుస్తున్నాయనడానికి సినారె కవితలే నిదర్శనమని అన్నారు. సినారె సొంత ప్రాంతంలో ఆయన పేరిట భవనాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ సాహిత్యలోకంలో రారాజు సినారె అని కొనియాడారు. ఆయన రచనలు సృజనాత్మకంగా ఉంటాయే తప్పా ఎదుటివారిని కించపరిచే విధంగా ఉండవని అన్నారు. జావేద్ అక్తర్ మాట్లాడుతూ సినారె సాహిత్య పురస్కారాన్ని అందుకోవడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా సమన్వయం అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, సంగీత నాటక అకాడమీ అధ్యక్షురాలు దీపికారెడ్డి, మాజీ ఎంపీ యార్లగడ్డ లక్ష్మీప్రసాద్, రచయిత దీపక్ మహాస్, మేనేజింగ్ ట్రస్టీ సి.గంగా, ప్రధాన కార్యదర్శి జె.చెన్నయ్య, సినారె కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

శ్రీవారి ఆలయంలో నూతన రూపంలో హుండీలు!

తరలింపునకు సులభంగా.. చోరీలకు దూరంగా..



తిరుమల: శ్రీవారి ఆలయంలో నూతన రూపంలో హుండీలను ఏర్పాటు చేసేందుకు టీటీడీ అధికారులు చర్యలు చేపట్టినట్లు సమాచారం. అందులో భాగంగా శనివారం శ్రీవారి ఆలయంలోకి స్టీల్‌తో తయారు చేసిన ఐదు అడుగుల హుండీని ప్రయోగాత్మకంగా తీసుకెళ్లి పరిశీలించారు. ప్రస్తుతం కొప్పెరలో భారీ గంగాళాలను ఉంచి అందులో భక్తులు కానుకలు సమర్పించేలా హుండీలను, మరికొన్ని ఇత్తడి హుండీలను ఏర్పాటు చేసి వినియోగిస్తున్నారు. వీటిని శ్రీవారి సేవకులు, బ్యాంకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల ద్వారా ట్రాలీల్లో శ్రీవారి ఆలయం నుంచి బయటకు, అక్కడి నుంచి లిఫ్టు ద్వారా లారీలో ఎక్కిస్తున్నారు. అక్కడి నుంచి నూతన పరకామణికి తరలిస్తున్నారు. అయితే ఇటీవల హుండీ తరలింపు సమయంలో కొన్ని ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఈ నేపథ్యంలో నూతన హుండీలను తయారు చేసినట్లు తెలుస్తోంది. అదేవిధంగా కొంత మంది ఆలయంలోకి ప్రవేశించి హుండీలో భక్తులు నగదు వేస్తున్న సమయంలో హుండీ లోపలకు చేయిపెట్టి చోరీ చేసిన సంఘటనలు తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ రెండు ఇబ్బందులు రాకుండా నూతన హుండీలను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. నూతన హుండీలో మూడు వైపులా భక్తులు నగదు వేయవచ్చు. అదే సమయంలో ఇందులో భక్తుడి చేయి పూర్తిగా దూరే అవకాశం లేదు. మధ్యలో ఓ ఇనుప చువ్వను ఏర్పాటు చేశారు. ఈ మేరకు నూతన హుండీ పనితీరును అధికారులు పరిశీలిస్తున్నారు. వినియోగం సులభంగా ఉంటే దీనినే ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

నేడు శ్రీవారి పాదాల వద్ద ఛత్రస్థాపనోత్సవం

తిరుమల నారాయణగిరిలోని శ్రీవారి పాదాల వద్ద ఆదివారం ఛత్రస్థాపనోత్సవం జరుగనుంది. ఏడాదికోసారి ఈ ఉత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఆలయంలోని బంగారు బావి నుంచి తీర్థాన్ని తీసుకొచ్చి శ్రీవారి పాదాలకు తిరుమంజనం నిర్వహించి, అలంకారం, పూజ, నైవేద్యం సమర్పిస్తారు.

ఇక శ్రీశైలం పవర్'ఫుల్'

- 4వ యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తి విజయవంతం
- మూడేళ్ల తర్వాత శ్రీశైలం హైడల్‌కు పూర్తి సామర్థ్యం



4వ యూనిట్‌లో విద్యుదుత్పత్తిని ప్రారంభించిన జెన్‌కో డైరెక్టర్లు సచ్చిదానందం, వెంకటరాజం

సాక్షి, హైదరాబాద్/దోమలపెంట: మూడేళ్ల కింద ఘోర అగ్నిప్రమాదంలో కాలిపోయిన 900 (6 x150) మెగావాట్ల శ్రీశైలం ఎడమగట్టు జల విద్యుత్ కేంద్రం.. ఎట్టకేలకు పూర్తి స్థాపిత సామర్థ్యాన్ని మళ్లీ అందిపుచ్చుకుంది. శ్రీశైలం రిజర్వాయర్‌లో లభ్యతగా ఉన్న జలాలతో శనివారం నాలుగో యూనిట్ ద్వారా విద్యుదుత్పత్తిని ప్రారంభించగా.. సాయంత్రం 5.07 గంటలకు 145 మెగావాట్ల గరిష్ట ఉత్పత్తి సామర్థ్యాన్ని అందుకున్నట్టు తెలంగాణ జెన్‌కో సీఎండీ డి.ప్రభాకర్ రావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. టీఎస్ జెన్‌కో హైడల్ డైరెక్టర్ వెంకటరాజం పర్యవేక్షణలో కేంద్రం సీఈ సూర్యనారాయణ, ఎస్ఈ (ఓఅండ్ఎం) ఆదినారాయణ, ఎస్ఈ రవీంద్రకుమార్, సద్గుణ కుమార్ ఆధ్వర్యంలో ట్రయల్ రన్‌ను విజయవంతంగా పూర్తి చేశారు. 900 మెగావాట్ల భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 6 యూనిట్లుండగా, 2020 ఆగస్టు 20న జరిగిన అగ్నిప్రమాదంలో యూనిట్లన్నీ కాలిపోయాయి. నాలుగో యూనిట్ మినహా మిగిలిన యూనిట్లను గతంలోనే పునరుద్ధరించారు. నాలుగో యూనిట్‌కి సంబంధించిన జనరేటర్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో పునరుద్ధరణలో జాప్యం జరిగింది. కేరళలోని ఓ కంపెనీకి ఆర్డర్ ఇచ్చి కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను తయారు చేయించడానికి రెండేళ్లు పట్టింది. గతేడాది ఫిబ్రవరిలో ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి నాలుగో యూనిట్‌కు మరమ్మతులు పూర్తి చేశారు. అయితే, ఈ యూనిట్‌కి సంబంధించిన సర్జ్‌పూల్ లో ఓ భారీ గేటు విరిగి పడిపోవడంతోపాటు మరికొన్ని గేట్లు వరద ఉధృతికి దెబ్బతినడంతో అప్పట్లో విద్యుదుత్పత్తి సాధ్యం కాలేదు. 75 మీటర్ల అడుగున ఉన్న గేటును బయటకు తీసే క్రమంలో ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉండటంతో ఉత్పత్తిని వాయిదా వేశారు. గత వేసవిలో జలాశయంలో నిల్వలు అడుగంటాక గేటును బయటకు తీసి మరమ్మతులు చేశారు. ప్రస్తుతం జూరాల నుంచి భారీ స్థాయిలో వరద వస్తుండటంతో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తికి ఏర్పాట్లు సిద్ధం చేశారు.

విచారణ నివేదిక ఏమైంది?: 2020 ఆగస్టు 20న శ్రీశైలం జల విద్యుత్ కేంద్రంలో ఘోర అగ్నిప్రమాదం జరిగి ఐదుగురు ఇంజనీర్లతో సహా మొత్తం 9 మంది మరణించిన విషయం తెలిసిందే. ప్రమాదంపై టీఎస్ఎస్పీడీసీఎల్ సీఎండీ జి.రఘుమారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు చేసిన టెక్నికల్ కమిటీ మూడేళ్లు గడిచినా విచారణ నివేదికను సమర్పించలేదు. ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సీఐడీ విచారణకు ఆదేశించగా, ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

నిద్రిస్తున్న బాలుడిని కాటేసిన రెండు పాములు

చికిత్స పొందుతూ మృతి.. నిజామాబాద్ జిల్లాలో ఘటన



రుద్రాన్ష్



బాలుడిని కాటు వేసిన పాములు

నవీపేట: ఇంట్లో నిద్రిస్తున్న బాలుడిని రెండు పాములు కాటు వేయడంతో మృతి చెందాడు. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘటన చోటు చేసుకుంది. నవీపేట మండలం బినోల గ్రామానికి చెందిన మంగళి భూమేష్, అర్షిత దంపతులకు రెండున్నరేళ్ల కుమారుడు రుద్రాన్ష్, మూడు నెలల కూతురు ఉన్నారు. ఆ దంపతులు పిల్లలతో కలిసి తమ పెంకుటింట్లో ఎప్పటిలాగే శుక్రవారంరాత్రి నిద్రపోయారు. అది పురాతన ఇల్లు కావడంతో ఇటీవల కురిసిన వర్షాలకు పైకప్పు పాక్షికంగా కూలింది. ఈ క్రమంలో రాత్రి 12 గంటల ప్రాంతంలో రెండు పాములు ఇంట్లోకి చొరబడి నిద్రిస్తున్న రుద్రాన్ష్ చేయిపై కాటు వేశాయి. రెండు పాములు ఒకేసారి కాటువేయడంతో ఆ బాలుడు ఒక్కసారిగా కేకలేశాడు. వెంటనే మేల్కొన్న తల్లి అర్షిత గమనించి ఆ పాములను దూరంగా విసిరేసింది. భూమేష్ కర్రతో ఆ పాములను చంపేసి, బాలుడిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. బాలుడు చికిత్స పొందుతూ శనివారం ఉదయం మృతి చెందాడు.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.